# ఆకాశవాణి

పత్రికాధిపతులు

అయ్యగారి బాపిరాజు

సూరంపూడి సత్యనారాయణమూర్తి

**Vol. 1.** } రాజమహేంద్రవరము. 3. ఫిబ్రవరి. 1913. { **No. 6.**

## దొరతనమువారు-నీటిహక్కులు.

గంజాముమండలమున జయపురముసంస్థానములో పుట్టి, కొన్ని గవర్నమెంటుగ్రామములలో నుండి ప్రవహించుచున్న వంశధారయను చిన్ననదియొకటికలదు. అది ఉర్లాము యస్టేటులోకూడ ప్రవహించుచున్నది. ఆనదినుండి మబగాం అను ఉర్లాముయస్టేటులోని గ్రామము వద్దనుండి మబగాంపిల్లకాలువ అనుపేరుతో ఒకకాలువ త్రవ్వబడి దాని వెంటవచ్చు నీటివలన సుమారు 4000 యకరములపరిమితముగల పదకొం

గ్రామములయొక్క భూములు తడుపబడుచున్నవి. ఈపదునొకొండు గ్రామములలో 4 ఉర్లాముయిస్టేటులోనివి. ఏడుగ్రామములు యీనాం అగ్రహారములు. అందులో వరాహ నరసింహపురము అగ్రహారమొకటి. ఇది పూర్వమునుండియు వుబగాంకాలువనీటివల్లన తడుపబడుచుండెడిది. కాని దొరతనమువారెన్నడును నీటిపన్ను పుచ్చుకొనలేదు. అయినను 1874 సంవత్సరమునుండి నీటిపన్ను వసూలుచేయుచున్నారు. ఇదివరకు వసూలుచేసిన నీటిపన్నును దొరతనమువారివలన తిరిగి యిప్పింపుడనియు, ఇకముందు దొరతనమువారు నీటిపన్ను వసూలుచేయకుండ శాశ్వతముగ ఇంజక్షన్ యిప్పింపుడనియు, నరసింహపురము అగ్రహారము యీనాందారు దొరతనమువారిపై గంజాముజిల్లాకోర్టులో నొకదావాను తెచ్చెను. వంశధారానదియొక్క హక్కు తమదనియు, ఆనీటినిపన్ను లేకుండనుపయోగించుకొను హక్కు యీనాందారునకు లేదనియు దొరతనమువారు వాదించిరి. దావావిచారణజరిగి దొరతనమువారికి వ్యతిరేకముగ తీర్మానింపబడియెను. అందుపై దొరతనమువారు మదరాసుహైకోర్టులో అప్పీలుచేసిరి. న్యాయమూర్తులగు మిల్లరుదొరగారును, శంకరనాయరుగారును అప్పీలును విభిన్నాభిప్రాయులయి చెరియొకతీరుగ తీర్మానమొసంగిరి. న్యాయమూర్తి మిల్లరుదొరవారు దొరతనమువారిపక్షమునను న్యాయమూర్తి శంకరునాయరుగారు యీనాందారుపక్షమునను తీర్పు చెప్పిరి. ఇప్పటి శ్రీశంకరునాయరుగారు అద్భుతమైన గుణక గొప్పతీర్పును వ్రాసిరి. అందు జమీందార్లెన్ని తరగతులగనున్నారో, వారికెట్టిహక్కులున్నవో, నీటియందు దొరతనమువారికెంతహక్కుకలదో, జమీందారీ భూములకు నీటి సప్లయివిషయమై సన్నదులిచ్చునప్పుడు యీస్టిండియాకంపెనీవారి అభిప్రాయములెట్లున్నవో, దరిమిలాను దొరతనమువారి అభిప్రాయములెట్లుండెనో, నీటిపన్నుకట్టుబటుకేర్పడిన 1865 సంవత్సరపు

7 వ శాసనము దొరతనమువారికెంత అధికారమునిచ్చుచున్నదో, నీటి ప్రదేశములన్నియు దొరతనమువారివని నిర్ణయించిన 1905 సంవత్సరము 3 వ శాసనమెంతవఱకన్వయించునో మొదలగు సంగతులనుగూర్చి విపులముగచర్చించిరి. ఉస్తాముసంస్థానములోనున్న వంశధారనదియొక్క అధికారము దొరతనమువారిదని ఈ హైకోర్టువారిచే వెనకనొకమారు తీర్మానింపబడి 34 వ మద్రాసు హైకోర్టులారిపోర్టులలో ఉదాహరింపఁబడియున్నది. శ్రీశంకరనాయరువారు ఆతీర్పునుగూడవిమర్శించి అదిసరిగాదనియెంచిరి. తుదకు దొరతనమువారి అప్పీలుఖర్చులతోకూడ కొట్టివేయబడియెను. నీటిపన్ను, నీటిసప్లయిలను గూర్చిన యనేకముఖ్యవిషయములు తెలియఁజేయుటయేగాక శ్రీశంకరనాయరుగారి యీతీర్పు ప్రస్తుతము దొరతనమువారియాలోచనలోనున్న "ఇరిగేషనుబిల్లు" విచారణలోగూడతోడ్పడఁగలదు. ఈతీర్పును సంపూర్ణముగ నాంధ్రమున భాషాంతరీకరించి ప్రకటించినచోనుపయోగముగనుండఁ గలదు. కాని మాపత్రికయందు ప్రస్తుతమునతావులేకపోవుటచే క్లుప్తముగ నీసారాంశమునుమాత్రము తెలిపితిమి. ఇందుకొఱకు ప్రత్యేకముగ నేర్పడియున్న మాపత్రికాసోదరియగు "తెలుగులాజర్నలు" ఈవిధిని నెరవేర్చునని నమ్ముచున్నారము.

ఎప్పుడును లేనిదే కొన్నిసంవత్సరముల నుండి ఆనకట్టు దిగువనున్న భూములకు గోదావరిలోని నీరును నుపయోగపర్చుకొ[illegible] నీటిపన్ను విధించుచున్నారు. వర్షాకాలపు దినములలో గోదావరిప్రవాహమువచ్చినపుడు ఆనీటిచే ముంపఁబడుటవలన ఉపయోగమైననని కూడ కొన్నిభూములకు నీటిపన్ను విధించుచున్నారని వినుచున్నాము. అది రైతులుకోరినది కాదు. ఆనీరువల్లనై పంటనష్టమైనచో దొరతనమువారు శిస్తుమినహా నిచ్చెదరా? ఫలనష్టమొసఁగెదరా? కొన్నిసంవత్సరములక్రిందట [illegible] నకు గండ్లుపడి యింటికవెల్లువవచ్చినప్పుడు గోదావరిలోని పొలములను

ముంచివేయుచు, సస్యములను నష్టపర్చుచుండుటచే తిండిలేక మలమల లాడుచున్న అమలాపురము తాలూకాయందలి అయిలాంశలోనున్న పోలవరము కొత్తపల్లి కేశనకుర్రు మొదలగు గ్రామములలోని బీదరయితులవంక నింతవరకును దొరతనమువారు తమయనుగ్రహవీక్షణములఁ బరపియుండ లేదుకదా!

శాసననిర్మాణ సభాసభ్యులీవిషయమును దొరతనమువారి యాలోచనకుఁ దెచ్చెదరుగాక! కృష్ణాగోదావరి మండలసభలవారు తమతీర్మానములలో దీనినిగూడ చేర్చి దొరతనమువారికి రయితుల యిక్కట్టులను విన్నవించెదరుగాక.

అభయ — సావకాశమున్న నందుఁ గొన్నింటినైనఁ జెప్పఁగోరెదను.

దుర్గదా —

సీ. నగరికోటనుగూర్చి ♦ సాధునిభేదించి
తోరంపుమణులెల్లఁ ♦ దోఁచినారు
మధురలో వెలసిన ♦ మానాథుఖండించి
మంచినగలు దొంగ ♦ లించినారు
స్థానేశ్వరమునందు ♦ చండికేశ్వరుఁగొట్టి
విపులవిత్తముఁ గొల్లఁ ♦ బెట్టినారు
సోమనాథములోని ♦ సోమేశులింగంబుఁ
జుట్టిముట్టి పగులఁ ♦ గొట్టినారు

తే. గీ. చేరియిస్లాముగానట్టి ♦ భారతీయు
లందఱిని యమాలయమున ♦ కనిపినారు
కఱకు తురకలు కటకటా! ♦ కరుణమాలి
భరతమతసంకరముసేయఁ ♦ బ్రబలినారు.

అభయ — హర హరా (చెవులు మూసికొనును.)

దుర్గదా — వారొనర్చిన దుష్కృతములు కోట్లకొలఁదిఁ గలవు. వాటినన్నింటి దలఁచికొనినపుడేను మనంబుననొందు దుఃఖంబపరిమితంబు.

తే. గీ. ఐకమత్యంబు దేశమం ♦ దడఁగిపోయె
సార్వభౌములు విషయాను ♦ సక్తులైరి
ప్రజలు స్వార్థపరులయిరి ♦ భరతమాత
యింకఁ బఠానులచేఁజిక్కి ♦ కెట్టులుండు.

అని నామనంబున ననయంబునుఁ జింతించుచుంటిని.

అభయ — ఆచార్యవర్యా!

తే. గీ. అభయచందు ధాత్రిపయి ను ♦ న్నంతసేపు
భరతఖండంబుఁ దురకచేఁ ♦ బడక వరలు
నిద్ది ముమ్మాటికిని సమ్ముఁ ♦ డిద్ధచరిత !
క్షితిపతీంద్రులు మనముల ♦ సిగ్గుఁజెంద.

దుర్గదా—(సహర్షముగా) కుమారా ! నీ బలపరాక్రమ సాహసౌర్యాదుల నే నెఱుంగుదును. కాని యిక్కార్య మొక్కరునిచేఁ గాఁదగినదిమాత్రము కాదు.

అభయ—యతివరేణ్యా ! స్వార్థపరిత్యాగ మొనర్చికొనఁగలను. కాని యొరులు గూడ నట్టులొనర్చి నాకు సహాయ మొసంగుదురని నే నెటులు చెప్పఁగలను?

దుర్గదా—వత్సా ! నీయుద్యమంబునకు తోడుపడఁగల ధీరులను నేఁజెప్పెదను వారిని నీవుఁ గలిసికొని యరులఁ దునుమాడి విజయుండవై కళ్యాణముం బొందుము.

అభయ—చిత్తము. వారినామాక్షరమాలయగుటకు నోచిపుట్టిన వర్ణమాల నోలిఁ గర్ణానందముఁగా వినిపింపఁ గోరెదను.

దుర్గదా—మంచిది. ప్రస్తుతమందొక నృసింహుని పేరుఁ జెప్పెదను వినుము.

అభయ—మహాప్రసాదము.

దుర్గదా—

చ. కలఁడల యుర్గళేశ్వరుఁడ ♦ ఖండ బలాఢ్యుఁడు శౌర్యమూర్తి యు
జ్జ్వలగుణ రత్నభూషితుఁడు ♦ సాధుజనాదరణుండు శ్రీకరుం
డలఘుఁడు గౌతమప్రభు స ♦ మాఖ్యుఁడు నిర్జితవైరిమండలుం
డెలమినినీకు తోడుపడు ♦ నీవలవల్లభుఁ గోరితేనియుఁన్.

దానఁజేసి నీయభీష్టంబు నెఱవేఱఁగలదు.

అభయ—అటులయినఁ బ్రియత్నించెదఁగాక !

దుర్గదా—ప్రయత్నించెదఁగాక యని జాగు సేసెదవేల? త్వరఁబడవేల?

సీ. అమలపతివ్రత ♦ లైనట్టిసతులఁ గొం
పోవుఁగూళలఁ గూల్పఁ ♦ బోవదేల?

భగవదాలయములఁ ♦ బాడుసేసినయట్టి
కలుషాత్ములంజంపఁ ♦ దలఁపవేల!
స్వమతాభిమానులౌ ♦ భారతీయాహిత
జననాశనముఁజేయఁ ♦ జనవదేల?
బాటనడ్డమువచ్చి ♦ పాంథులఁ దెగటార్చుఁ
ద్రోవదొంగలనిఁకఁ ♦ దునుమవేల?

తే. గీ. దేశనాశంకరులను మ ♦ ర్దింపవేల
కేలుదోయినిఁ గత్తియుఁ ♦ దాలుఁబట్టి
దేశమండలిద్రోహులఁ ♦ ద్రెళ్ళనేసి
భరతమాతను సేవింప ♦ నరుగవేల?

(తెఱలో)

చ. తమవిభుఁడస్తమించెనని ♦ దైన్యమునొంది సరోజినీసతుల్
విమలముఖంబులన్ ముకుళ ♦ వృత్తినిఁజొప్పడఁజేసి శుష్కులై
రమణుఁడు లేమినీబ్రతుకు ♦ రాజుదొలంగినరాష్ట్రమంచు దుః
ఖములమునింగిరేమగడ ♦ కాదొకో కాంతలకెంపు వల్లభుల్.

అభయ—(ఆలకించి) ఆచార్యా! సూర్యాస్తమయసమయమైనది. అంతిపురంబున కేగుదము రండు.

దుర్గదా—మంచిది. పోవుదముపద. (విదూషకుఁడుతప్ప నందఱును నిష్క్రమించుచున్నారు.)

విదూష—నోరుపెట్టుకుబ్రతుకవే రోలుకూఁతురా! యనునట్లు నోరుఁగలవానిదే రాజ్యము. భోగము. న్యాయము. సర్వమును—ఈమాయముండకొడుకు సన్న్యాసివేషమువేసికొనివచ్చి యేమేమో వెఱ్ఱిమొఱ్ఱిమాటలుచెప్పి మా రాజును ప్రోత్సాహపఱచి దేశమాతృసేవయనిచెప్పి మఱల నొకనిన్నాతుక యుద్ధంబునందుఁ బ్రవేశపెట్టుచున్నాఁడు. ఇందు

నేను వద్దనినను కద్దనినను వినువారులేరుకదా. నీతో చిరకాలమునుండి పెనవేయఁబడిన స్నేహబంధముఁ ద్రెంచుకొనఁజాలక ప్రభువు విన్నను వినకున్నను చెప్పుట నాపనియని చెప్పుటయే కాని చెప్పినటుల చేయించుట నాతరముకాదు. ఊటివారికేమి. విన్నమ్మవీపు కాలునా? కన్నమ్మ కడుపుకాలునా? వారు ప్రతిసంగతియును బాగుగనేయున్నదియని చెప్పి రాజుగారినిఁ జేయఁ బ్రోత్సాహపఱచి యకార్యంబులఁ బ్రవేశపెట్టుదురు. కాని దిగుదిగుమన్న సవతియే కాని తోడదిగినసవతి లేదనునటులు రాజుగారితోఁగూడ నాయనప్రాణమే మాప్రాణమని పోయి నిర్వహించఁగలవారొకరును లేరు. వేయేల. అవసరమగునప్పటికి నేనైన నేనేపోలేను పరులసంగతిఁ జెప్పవలయునా? (తెలివైపుఁజూచి) కాలయాపనమైనది పోయివచ్చెదను. (యవనికజారును.)

ఇది తృతీయాంకము.

# రాజపుత్ర విజయము

## తురీయాంకము

### ప్రథమరంగము

విహారదేశాంతరారణ్యము—గంగాతీరము

[సలీము ప్రవేశించుచున్నాఁడు]

సలీము—(విచారముగా) అయ్యో! నేనెంతకాలమియ్యరణ్యమందు వశింపఁగలను. వసింపక యెందుఁబోదును? ఎందుఁబోయిన నన్నెవ్వరు నాదరించెడివారలు లేరుకదా! ఈహిందూస్థానమునందీవిహారదేశములోని యగ్గళసంస్థానాధీశ్వరుండు నాయోధపురేశ్వరుండుఁ దక్క తక్కిన నృపతులెల్లరు నాఢిల్లీపాదుషాకరిగాపులై యున్నారు. ఆఢిల్లీశ్వరుండుఁ గుమతులైన మంత్రులప్రోత్సాహమునఁ జేసినన్నానాఁడు సభయందు వంచించి పదభ్రష్టునిఁ జేసి సభనుండి యావలకు వెడలఁగొట్టుటకాయేక నాయాస్తినంతయుఁ గొల్లఁబెట్టించి తనరాజ్యమందుఁ దనసామంతులరాజ్యములందుఁ గూడ నుండవలదని నేనెంతవేడికొనుచున్నను నామొఱలాలకింపక త్రోలివేసినాఁడు. అపరానుబానిసమంత్రుల దురూహలనెల్లఁ బాదుషాకెఱింగించి వారల పొగఱడఁచి యేలికచేఁ బొగడఁబడవలెనని తలంచి చేసినట్టి ముప్పులు నాకు వాటిల్లినవి. దీనఁజేసి నోటిలోనికండకును నీటిలోనిచేపకుఁ జెడిన నక్కవిధంబుగ నాత్మీయమతంబుఁ బాసి తన్మతస్థులకును రాజమతమని పరమతావలంబినై వారలవలనఁ బరాభవింపఁబడి పాదుషాకు నహితుండనై తొల్లింటి మతమునఁ దిఱుగఁజేఱుదమన్న నందుకనర్హుఁడనౌటచే నుభయభ్రష్టుఁడనై యొక్కఁడ నొంటరినై యజ్ఞాతవాసదీక్షఁబూని మిడుకవలసివచ్చినది. హా! దైవమా! నీవిధానమవిలంఘనీయముకదా. ఎటులయినను నీవే నాకిక్కాలమునందన్నివిధంబులను దిక్కైయున్నావు. కనుకఁ బాలముంచినను నీటముంచినను నీవేనాకు దిక్కని నెఱనమ్ముచున్నాను. జగదీశ్వరా! కరుణాకరా! దీనజనక్షేమంకరా! ఈవిపత్సముద్రనిమగ్నుఁడనైన నాకెద్దియేనియు నాధారమొసంగి దరిఁజేర్పుము. (అనినిమీలితలోచనుఁడై యాలోచించి) వీరలిరువురు

నుదారపురుషులే యగుదురు. అందాయోధపురీశ్వరుండు బాలుండును మున్ను నన్నెఱుం గనివాఁడగుటచేఁ బరమతావలంబినని నన్ను శంకించి యాదరింపక పోవచ్చును. ఎటుల యిన నాగౌతమనృసింహుఁడు పూర్వమునందా బాల్యముననుండియును నన్నెఱింగిన వాఁడగుటచే వానియందు సాహీనపరివర్తనకై కొంచెము కోపించినను జివరకుఁ దొల్లిం టి కులాభిమానమైనను దలఁపోసి కరుణాంతరంగితుఁడై యభయమొసంగక మానఁడు. దానఁజేసి యమ్మిత్రద్రోహులైన పఠానుల మత్సరంబు నామూలాగ్రముగఁ బురుఁగు నాకినటులుఁ జేసెదఁగాక! (అని వెళ్ళిపోవుచున్నాఁడు.)

ఇదివిష్కంభము.

## ద్వితీయరంగము

### అర్గళపురముకోటలోని రాజసభామందిరము

[గౌతముఁడు దుర్గదాను సలీము లుచితాసనములఁ గూర్చుండి కొలువుఁ దీర్చియుందురు]

గౌతమ—(సాదరముగా) ఓయీ! సలీమా! పాదుషాకు ప్రధానమంత్రిసేఖరుల లో నొక్కరుండవగు నీకట్టుల నిమిత్తంబుగ నిట్టియిక్కట్టులొదవుటకుఁ గారణమేమి?

సలీము—(సవినయముగా) దేవా! దేవరకావిషయమెల్ల నామూలాగ్రముగ నిదివరకే యెఱుకపడియుండఁగలదు. అయినను నానుండియే వినఁగోరుచుంటిరి. కనుక నదెల్లనశేషముగాఁ దమకు విన్నవించుకొనియెదఁ గాఁక. ఆలకింపుఁడు.

గౌతము—మంచిది. చెప్పుఁడు.

సలీము—పాదుషాయొద్దఁగల సచివులలోఁ జాలమంది స్వకులీనులైన దుర్మతులుఁ గలరు. ఆరాజద్రోహులు గోముఖవ్యాఘ్రంబులగతిఁ బైకిమంచివారలటులు నటింపుచుఁ జాటునఁ బ్రభునాశనోపాయముల నెమకి సలుపుచుఁ ద్రోవదోఁపిడులను సాధ్వీగత్నము లైన సుందరీమణులఁ జెఱఁ బట్టుటయు నొనర్చుచుందురు.

గౌతమ—అట్టివారినిఁ బాదుషావిశ్వసించి మన్నించుచున్నాఁడా?

సలీము—వారిదుండగములాయనకుఁ దెలిసియేయుండిన నీపాటికి వారిఁనిబర లోకయాత్ర కనిపియుండెడివాఁడే.

గౌతమ—నీవు నాచక్రవర్తి ముఖ్యామాత్యవర్గంబులో నొక్కరుండవే కదా?

సలీము—అవును. నేనాకృతఘ్నులవలెఁ గాక నేనెపుడెంతకాలమెవరి యుప్పుఁ బులుసుఁ దిని యాకాయముఁ బోషించుకొనుచుందునో యప్పుడంతకాలమును వారి

మంచిని నామంచిగాను వారికీడును నాకీడుఁగాఁ దలఁపోసి నిష్కళంకబుద్ధితోఁ ప్రభునియభ్యుదయమునకై పాటుపడుచుందును. కనుకనే నాస్వామిద్రోహుల కహితుండను. ఈసంగతిఁ గూర్చి నేను మీకు వేఱుగఁ జెప్పుకొననవసరములేదు. అనుభవమునంజేసి యదియే వెల్లడికాఁగలదు.

గౌతమ—అటులయిన నీవు వారినిట్టి ద్రోహకృత్యములఁ జేయఁ గూడదని చాటునఁనైన జేఱఁజీఱి మందలించలేదా?

సలీము—మందలించితిని. అయిననేమి? తప్తతైలమందు నీటిబొట్లుపడినఁ జిటపెటధ్వనులతోఁ మంటలెగయునట్లు వారికి నేనుపదేశించిన హితోపదేశములఁజేసి వారికి నాయందోపరాని వైరమొదవినది.

గౌతము—అటులయిన నీవు స్వయముగఁ బాదుషాకు వారిదుండగముల నేలచెప్పలేదు?

సలీము—చెప్పితిని. అయిననేమి? పాదుషా తనబంధువర్గముల మాటలనే నమ్మి భజింపుచుండెను. కాని నాపలుకులయందుఁ గొంచెమైనను విశ్వాసముంచఁడయ్యెను. అంతియేకాక విశేషించి తమదౌష్ట్యములను మఱల నెప్పుడు నిదర్శనములతోఁ గూడఁ జక్రవర్తికి దెలియఁజేసెదనోయని వెఱఁగంది యాదోసకారులైన షరానుసచివులున్నవియును లేనివియుఁ గొన్నికుతంత్రములఁ బన్ని నాపై నారోపించి చెప్పిన నవెల్లను సత్యములని యెంచి పాదుషా నన్ను పదభ్రష్టునిఁజేసి కొలువుకూటమునుండి వెడలించి వెండియును మఱునాఁడే మదీయకష్టార్జితద్రవ్యమంతయుఁ గొల్లబెట్టించి బొక్కసమునందుఁ జేర్పించి యంతటితోనైనను శాంతింపక నన్ను తనరాష్ట్రమందుఁ దనసామంతరాష్ట్రములందుఁగూడను నిలువవలదని శాసించి పురమునుండి వెడలించెను.

గౌతమ—(నిర్విణ్ణుఁడై ముక్కుమీఁదఁ దర్జనినిడికొని విచారముతో) అన్నా! ఎంతకష్టమెంతకష్టము! పాదుషాయే యిట్టి క్రూరకర్మలఁ దనచేతులారఁ జేయనోడఁబడెనా?

దుర్గదా—రాజర్షికంఠీరవా! సాధుస్వభావుఁడవైన భారతీయుఁడవగుటచే నిది నీకు ఘోరముగాఁ గనుపడుచున్నది. కాని క్రూరస్వభావులయిన మ్లేచ్ఛులకిదియొక క్రొత్త పనికాదు.

తే. గీ. సత్త్వమననెఱుఁగక తామ • సంబుఁబూని
యోడకెపుడును నెత్తుటి • కూడుఁదినెడి
మ్లేచ్ఛులకు దయకలుఁగునే • లేశమైన?
నగ్నిశిఖలకెందును శైత్య • మబ్బనటులు

గౌతము — అమాత్యశిఖామణీ! నాకీతనియవస్థఁజూడ నెంతయు సంతాప మొదవుచున్నయది.

తే. గీ. రాజపుత్రాన్వయోద్భవుఁ • డీజనుండుఁ
గుళికి విషంబుఁద్రావెడు • కూళభంగిఁ
బొట్టఁజేఁబూని పందయై • పోయియన్య
మతములోఁ జేరి హీనుఁడై • మఱలెనిటకు.

దుర్గదా — రాజచంద్రా! అల్పమతులకిది సహజగుణమే కదా.

తే. గీ. దూరమందలికొండలఁ • బాఱఁజూచి
స్నిగ్ధములటంచుఁ దలఁపోసి • చేరియందుఁ
గఠినపాషాణములఁ గాంచి • గాసిఁజెంది
మఱలు మూర్ఖునిగతినీతఁ • డఱిఁగెనిందు.

సలీము — (జనాంతికముగా) పురుషాగ్రణీ! నిజముపలికితివి. నేనట్టులే చేసితిని.

గౌతమ — సచివోత్తమా!

తే. గీ. అలచతుష్పాదమునుఁగాక • యండజంబుఁ
గాకయారెంటికిని వెలి • గాఁదిఱుంగు
గబ్బిలంబట్టులీతండుఁ • గష్టుఁడగుచు
భువిఁబరానులకుమనక • పూజ్యుఁడయ్యె.

సలీము — (దీనుఁడై సవినయముగానంజలిపట్టి) దేవా! నేఁజేసినయపరాధములకై పశ్చాత్తాపానలదగ్ధుఁడనై ప్రాయశ్చిత్తముఁజేసికొని యప్పటికినిఁ దొల్లింటినిర్మలవంశమర్యాదలఁ గనర్హుఁడనయ్యెను మీకృపాపరిపూర్ణతంజేసి యభయమునొంది నేఁటి నుండియు నీ మేననుసురులున్నంతవఱకును భవచ్చరణారవిందసేవానందకందళితహృదయార

# పీ ఠి క.

ఆకాశవాణీ పత్రికాధిపతుల కోరికపై "ఇండియన్ రివ్యూ" అనునాంగ్లేయపత్రికనుండి నే నీ కథనాంధ్రీకరించితిని. దీనినాభాషలో శ్రీమోహనకుమారసింగుగారు రచియించిరి. నేనక్కడక్కడ నించించుక మార్పులనుమాత్రము చేసితిని.

కపిలేశ్వరపురము 20—1—1913 } చాగంటి శేషయ్య.

ఈపుస్తకము వలయువారు

శ్రీ విద్యానిలయ ముద్రాక్షరశాలయందుఁ

బడయఁగలరు.

ద్రౌపది యెంతటి శాంతచిత్తురాలో యెంతటి ధీరురాలో యెంతటి సదయహృదయయో యెంతటి సుశీలయో యామెముఖమునుండి యాసమయమున వెలువడిన మృదువాక్యములవలన మాచదువరులే తెలిసికొనెదరు గాక! ఆసాధ్వీశిరోమణి యాశిశుహంతకుని జూచి యిట్లుపలికెను.

తండ్రీ! భూసురుఁడవును, బుద్ధిమంతుడవును నయాపరుడవును, శుద్ధవీరభటాగ్రేసరుఁడవును నగు నీవంటి సాధుసత్తముఁడు రాక్షసకృత్యమును, నీచమును నగు శిశుమారణకర్మమును జేయుట ధర్మమా! గురుపుత్రకా! ఉద్రేకంబున నీపైకి రానట్టియు, శస్త్రాస్త్రములనుధరించి యుద్ధరంగమున లేనట్టియు, లేశమైన మోసమును జేయనట్టియు నిద్రితులైనట్టియు మాశిశువులను నిర్దయుండవై సంహరించుటకు నీకు జేతులెట్లు వచ్చినవోగదా తండ్రీ! అనిపలికి కృష్ణార్జునులను జూచి మరియు నిట్లు వేఁడుకొనియెను.

వీరాగ్రేసరులారా! అయ్యో! పాపమీ విప్రకుమారునకుఁ గలిగిన యవస్థనువిని యీతనితల్లియైన గురుపత్ని నావలెనే పుత్రశోకమున నెట్లు పొక్కుచున్నదో. ఈతని నిప్పుడు మనమెంత వేధించినను గొంచెమైనను మనకు లాభములేదు. మన శిశువులిక బ్రతికిరారుగదా! ఈతని నిట్లు శిక్షించి యాసతీమణికి దుఃఖముగలిగించుట నాయభిమతము గాదు. భర్తృవిహీనయై శోకించుచున్న యాసతీమణికి పుత్రవియోగదుఃఖమును గూడ గలిగించి క్షోభపెట్టుట న్యాయము గాదు. కావున దయయుంచి యీబ్రాహ్మణకుమారుని శీఘ్రముగా బంధవిముక్తునిజేసి రక్షింపుఁడు. నావాక్యముల మన్నింపుఁడు. అని వేఁడుకొనెను. పుత్రశోకసాగరంబునంబడి పొగులుచున్న ద్రౌపది తన్ను వధియింప వేగిరపెట్టుననియు తప్పక కృష్ణార్జునులు తన్ను సంహరింపకమానరనియు దలంచి తనకు మరణమాసన్నమైనదని నిశ్చయించుకొని పరితపించుచు చేసిన దుష్కృత్యమును దలంచి పశ్చాత్తాపమునొందుచు దన్ను దానిందించుకొనుచు, దనగతికి వగచుచున్న యశ్వత్థామకు పాంచాలి పలుకు లమృతప్రాయములై యాశ్చర్యము గొలిపెను. విన్నవారెల్లరును నామె దయారసభావమునకును, సర్వసమత్వమునకును వింతపడిరి.

కృష్ణార్జునులు పాంచాలి వాక్యములాలకించి గురుపుత్రుడను గౌరవమునను భూసురుడవధ్యుడను తాత్పర్యమునను నతండు దయనీయుడని తలంచి విడిచిపెట్టుటకు సమ్మతించిరి. కాని భీముడందుల కిష్టపడక క్రూరుడును, నిర్దయుఁడును దుష్టుడును నైనవాడు బ్రాహ్మణుడైనను గురుపుత్రుడైనను మరియెవ్వడైనను వధ్యుడేయగుననియు నీశిశు

హంతకుని వధింపక విడిచిపుచ్చుట యుక్తము కాదనియు సంహరింపక మానననియు గట్టి పట్టును పట్టెను. అప్పుడు ద్రౌపది యుక్తాయుక్తముగా నిట్లు భీమసేనునికి సమాధానము చెప్పెను. బ్రాహ్మణుడును సమస్తధర్మవేదియునైన యీగురుపుత్రుడు ప్రమాదంబున జేసిన యీయకృత్యము ఘోరమును క్రూరమును నీచమును మహాపకారము నైనను కోపవశమున తాను చేసిన యీపాపకృత్యమునకు ఫలమనుభవించి పశ్చాత్తాపము నొందుచున్నవాడు. ఇతండు గురుపుత్రు డైనను బ్రాహ్మణు డైనను పండితుం డైనను మహావీరు డైనను మనకు మాననీయుడు. చంపక విడువదగినవాడు. ఒకవేళ వధ్యుడేయని తప్పక మీకుతోచునెడల బ్రాహ్మణునకు తలగొరుగుటయే తలదరుగుట కాన నీద్రౌణిని శిరోముండనము చేయించి విడువుడు. ఇతండును శూరాగ్రేసరుండు. మానవంతుండు. అట్టివానికి అవమానము కంటె మరణ మెక్కువ కాదు. కావున నామనవి నంగీకరింపుడు. అని వేడుకొనెను.

సతీమణీ! నీపలుకులు శాంతరసమొలుకుచు నాకెంతయు వింత గొలుపుచున్నవి. క్షమింపదగని వీనిని క్షమింపు మని వేడుట నీ సతీత్వమును విశదపరచుచున్నది. పుత్రఘాతకుని వధింపు మని తొందరపెట్టు వారలుందురు గాని నీ వలె విడిచి పెట్టుమని బలవంతపెట్టు సాధుచరితలగు స్త్రీరత్నము లుండుట లోకమున నరుదు. ఈపాపాత్ముని, విప్రరూపఘండాలుని, మనుజరూప దనుజుని ప్రాణములతో విడిచిపుచ్చుటకు నాకెంతయు మన సొప్పకున్నది. నీ వాక్యముల యందలి మాకు గల గౌరవమును బట్టి యైన తలగొరిగి విడిచిపుత్త మన్నను నితండుసన్యసించిన వాడగుటచే నిదివరకే బోడిగదా! ఈబోడినెన్నిమారులిక గొరిగించిన నేమి పరాభవము? ఎన్నివిధములను వీనికి మరణ దండనమే తగినదని తోచుచున్నది. అని పలికెను.

నాథా! ఇతండు సన్యాసియే యగును గాక! బ్రాహ్మణుడే యగును గాక. వీరాగ్రేసరుడు గదా! మరియు బోడియగుట యీయాశ్రమమును బట్టి యిప్పుడు తప్పు గాకున్నను శిశుమారణ దోషమునకు శిక్షారూపముగా జేయించుచుంటిమి గదా! పరాభవమును బొంది చేసినదానికి చింతించుచు బ్రదికియుండుట కంటె దోషస్థునికి మరణ మెక్కువదండనము కాదు. మీరు బాగుగా నాలోచింపుడు. మీరు తలచినదానికంటె నేను చెప్పినదే యీశూరశిఖామణికి గొప్పశిక్ష యగుచున్నది. అని పలికెను.

ఈసంవాదమును వినుచుండిన శ్రీకృష్ణునకు శిఖామణిమాట స్ఫురణకువచ్చి ద్రౌపదీభీములను జూచి యిట్లనియెను. పాంచాలి వాక్యములు యుక్తియుక్తములు. మరియు మాననీయములు. భీమునివాక్యములును నసత్యములు కావు, ఈశూరశిఖామణి యొద్ద శిరోమణి కలదు. ఆరత్నమును గైకొంటి మేని యితని తలగొఱిగినట్టులే గాక తలదఱిగినదానికన్న నధిక శిక్షయే యగుచున్నది. కావున నట్లు చేయుట యుక్తము. అని పలికెను. అర్జునుండదియే యుక్తమనియెను. భీముడును నందుల కంగీకరించి యాతని శిరోమణిని దీసికొని యాతనిని విడిచిపుచ్చెను. ద్రౌపదియు సంతసించెను. చదువరులారా! సతీమణులారా! చూచితిరా! ద్రౌపది సౌశీల్యము! ఆహా! అట్టి నారీరత్నముల వల్లనే గదా భారతదేశము ఇంతటి గౌరవమును సత్కీర్తియు గలిగియున్నది. ఆహా! అట్టి స్త్రీరత్నము జన్మమే జన్మము. అదియే ధన్యము. భారతీయ నారీతిలకములారా! మీరలెల్లరు పాంచాలి వలె సుగుణసంపదను గలిగి సత్కీర్తిని వహించెదరు గాక!

సంపూర్ణము.

# ఆకాశవాణి

---

ఆంధ్రదేశమునందు వారపత్రికలేమి లెక్కకు నిరువది మించకుండ నడుపఁబడుచున్నయవి వానిలో గొన్ని ఆయాపత్రికాధిపతుల మతముననుసరించియు, నుద్దేశములననుసరించియు నడుపబడుచున్నవి గాని సకలజనుల కుపయోగించునట్లును, స్త్రీపురుషులేకపత్రికయందు గ్రహింపఁదగిన నీతిని గలిగియుండునట్లును నడుపఁబడుట లేదని మాయభిప్రాయము.

మాయాకాశవాణి బుక్కుసైజున 48 పేజీలుగలదానిని మాసపత్రికగా ప్రకటింపుచుంటిమి. ఇందొకప్రహసనము, ఒకనవల, ఒకనాటకము, చక్కనిచిన్నచిత్రకథ, స్త్రీపురుషుల కుపయుక్తంబగునట్లు పతివ్రతలు మున్నగువారిచరిత్రయొకటి, అప్పుడప్పుడు గౌర్నరుగారి సభయందును, ఇండియాగౌర్నమెంటు సభయందు జరుగు రాజకీయ చర్చలు మొదలగు తదితర రాజ్యాంగవిషయములును, మరికొన్ని విచిత్రగాథలను, చక్కని చిత్రపద్యములు ఆనెలపంచాంగము (అనగా తిథివారనక్షత్రవర్జ్యములును పర్వపండుగదినములను దెలుపునది.) ప్రతినెలయందు ప్రకటించుచుందుము.

ఈమాదిరి మాయాకాశవాణి వెలువడి సకలజనరంజకమై, స్త్రీపురుషుల కుపయోగించునట్లుండి చాలమందిచే పోషింపఁబడగలదని మాయాశయము.

చందావివరము:—చందాదారులకు రు 2—8—0 మాత్రమె. పోషకులకు రు 10—0—0 సహాయులకు రు 5—0—0

**N. B.** పత్రికమాదిరిని గోరువారు 4 అణాలు పోష్టుబిళ్ళలు కవరులో బంపిన యెడల బడయఁగలరు. వారు చందాదారులుగా నుండు నెడల యీనాలుగుఅణాలుపోను మిగిలిన రు 2—4—0 లుమాత్రమె చందాధనముగ గ్రహించెదము.

రాజమహేంద్రవరము,

ఇట్లు విధేయులు,
పత్రికాధిపతులు.

# ద్రౌపది.

## పతివ్రతలచరిత్ర


మంగిపూడి వేంకటశర్మచే

వ్రాయఁబడి



ఆకాశవాణిపత్రికయందు

అయ్యగారి బాపిరాజుగారిచే

ప్రకటింపఁబడియె.

మొదటికూర్పు 500 ప్రతులు.

రాజమహేంద్రవరము.

శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1913.



కాపీరైటు]


వెల రు. 0—2—6.

# శ్రీ విద్యానిలయ ముద్రాక్షరశాలయందు
# వెలకుదొరకు పుస్తకములు

| | | |
|---|---|---|
| 1 | చంద్రసేనవిజయము (ఒకచక్కని వంగదేశపుకథ) చాగంటి శేషయ్యగారిచే వ్రాయఁబడినది. | 0—2—0 |
| 2 | ద్రౌపదీదేవి చరిత్రము (ఇదిపతివ్రతలచరిత్ర) మంగిపూడి వేంకటశర్మగారిచే వ్రాయఁబడినది. | 0—3—0 |
| 3 | న్యాయవాదివిలాసముఅనుప్లీడరుపార్సు (అచ్చులోనున్నది) ఫిబ్రవరు 1913 లో వెలువడును. | 0—4—0 |
| 4 | రాజపుత్రవిజయము (చరిత్రాంశమైననాటకము) వేమవరపు నాగభూషణరావుచే రచింపఁబడినది అచ్చులోనున్నది. మార్చి 1913 లో వెలువడును. | 0—8—0 |
| 5 | స్వయంసహాయము (Selp Help) చిలుకూరి వీరభద్రరావు ప్రణీతము. | 0—4—0 |
| 6 | శ్రీశివాజిమహారాజు చరిత్ర (చిలుకూరి వీరభద్రరావుగారిచే వ్రాయఁబడినది.) | 0—3—0 |
| 7 | వీరమతి. స్త్రీలకత్యంతోపయుక్తమగు చక్కనినవల (మంగిపూడి వేంకటశర్మ ప్రణీతము.) | 0—3—0 |
| 8 | శ్రీదాదాభాయినౌరోజి జీవితచరిత్ర (అత్తిలి సూర్యనారాయణ ప్రణీతము.) | 0—3—0 |
| 9 | హిందూదేశదారిద్ర్యము. | 0—2—0 |
| 10 | కాళిదాసకేరళి (జ్యోతిషగ్రంధము.) | 0—6—0 |
| 11 | సర్వసమ్మతమైనమతము. | 0—2—0 |
| 12 | మతతత్వము--మానవప్రకృతి. | 0—1—0 |
| 13 | ఇండియారాజ్యతంత్రము. | 0—12—0 |
| 14 | సౌఖ్యజీవనవృక్షము(or Happiness)యిదియొక పటము. | 0—1—0 |
| 15 | కాబూలుసాహేబు (యిదియొకచక్కని వంగదేశపుకథ.) | 0—1—0 |

వలయువారు

విద్యానిలయ ప్రెస్సు, రాజమండ్రి.

అని వ్రాసిన బడయఁగలరు.

న్యా—(తేరిపారచూచి)

Well. Mr. The court cannot brook such insinuations. That amounts to contempt of court. Do you mean to say that the court willfully dismissed your petition?

మంచిది. ఏమండీ! కోర్టువారు అట్టి వ్యతిరేకపువడతను సహింపజాలరు. ఇట్టిమాటలు కోర్టువారియుత్తరువును నిరసనజేసినట్లూహింపఁబడును. కోర్టువారు బుద్ధిపూర్వకముగా మీపిటీషను కొట్టివేసిరనియా మీయభిప్రాయము?

సీతా—No, your honour: I make no insinuations I state facts.

(విధేయతతో) అటులుకాదండి; నేను చెప్పినదానిలో కోర్టువారిని తిరస్కరించినదేదియు లేదు. నేను జరిగినదంతయు మనవిజేసుకొంటిని.

న్యాయ—No. They are unwarranted insinuations you must withdraw them; if not the court will proceed against you.

మేమటులూహింపము. మీరు తప్పక అవిధేయతజూపినారు. మీమాటలు మీరు రద్దుజేసికొనినగాని, కోర్టువారు మీపైన ప్రొసీడు గాకమానరు.

No your honor, I never meant to insinuate; if I am so understood by the court I shall gladly withdraw, but only request my petition to be restored.

సీతా—కోర్టువారు మన్నింపవలెను. నేను కోర్టువారిని తిరస్కారభావముతో నుద్దేశించియునలేదు. అటులేయని కోర్టువారూహించినచో నామాటలు నేను రద్దుచేసికొనియెదను. కోర్టువారు మన్నించి నాపిటీషను తిరిగి రిస్టోరుచేయించి అమలులోనికిదే ప్రార్థించుచున్నాను.

న్యాయ—(కోపముతో) The court has rightly understood your insinuations and your petition is dismissed. You can appeal if aggrieved. Your conduct is revolting.

మీరు నిందాస్పదముగా కోర్టువారిని తిరస్కరించినటుల స్పష్టమైనది. కోర్టువారికి న్యాయమనితోచి నందున మీపిటీషను త్రోసివేయబడినది. మీనడత బాగుగాలేదు.

సీతా—The court will be pleased to state how they are insinuations.

కోర్టువారు నేననినమాటలు ఎట్టినిందాస్పదములో తెలిపెదరని కోరుచున్నాను.

న్యాయ—The proceedings of the court will explain everything. You will take the consequences.

కోర్టుప్రొసీడింగ్సు మీకన్నియు తెలుపగలవు. మీకు తగిన ప్రాయశ్చిత్తము జరుగును.

సీతా—The court will take notice of the insult it showed o me in the public court. I will sue for damages.

కోర్టువారు యిప్పుడు సెలవిచ్చినమాట జ్ఞాపకముంచుకొనెదరు గాక! పబ్లికుకోర్టులో నన్నిట్లు కోర్టువారు నిందించినందులకు, కోర్టువారిపై నేను డామేజిస్యూటు తీసుకువస్తాను.

న్యాయ—You pleaders, you may do as you please.

మీరుప్లీడర్లు! మీయిచ్చవచ్చినరీతిని మీరు జరిగింపవచ్చును.

(అందరు నిష్క్రమింతురు.)

# న్యాయవాదివిలాసము.

పంచమగుచ్ఛము—ద్వితీయభాగము.

రంగము. కోర్టు.

జడ్జీ—ఇరకతరకలరావుగారు. ప్లీడర్లు. రంగయ్యపంతులు.

బంట్రోతు—గ్రహాజరుఖాన్. నీలకంఠయ్య.

గుమాస్తా—నాగన్నపంతులు. సీతారామశర్మ.

ప్రవేశించుచున్నారు.

ఇరక—రంగయ్యపంతులుగారు వినండి.

గీ. నాకు న్యాయాధిపతియను నామమమరె
న్యాయదేవత నాయాజ్ఞ సేయవలయు
గాన నేనాడునదియాట నేను పాడు
నదియె పాటయ్యె ధరమీద నలరుగాదె?

రంగ—చిత్తము. అందుకేమిసందేహము. తమకలమున కడ్డమున్నదా? న్యాయదేవతయను స్వరూపమెచ్చటనైనగలదా? తమరుచేతబట్టినకాకితమే దానిశరీరము. తమరువ్రాసిన యక్షరములేదాని యవయవములు. వాటిశబ్దోచ్చారణమే దానికంఠస్వరము. తమమద్రయే దానికధికారచిహ్నము. కాబట్టి తమరుచెప్పినప్రకారము 'నేనాడునదియాట నేనుపాడునదియె పాట' యనుమాటలలో నతిశయోక్తి యేమియును లేదు. దానిస్వరూపమునకు సృష్టికర్తలు మీరేకాని మీకదియంత కాదు. మీబుద్ధివలన పుట్టినవాక్యములే దానివాక్యములు. మీలేఖినీప్ర

చారములే దానిసంచారములు. మీరచ్చినగాని దానికధికారమే లేదు— కాబట్టి మీరేయధిష్టానము (Real object) అదియే యాభాసము (Reflection) అని చెప్పనచ్చును.

సీతా—తాము కూర్చున్న బెంచియే ధర్మస్థానము. తమస్వరూపమే ధర్మస్వరూపము. ఆస్థానమందా దేవతామహాత్మ్యమున ధర్మపద్ధతిని వ్యవహారముచేయువారి వాక్కులే ధర్మములు. కావున అట్టిధర్మమును నిష్పక్షపాతబుద్ధితో జనులందు నడుపువారే న్యాయాధిపతులు. కావున ధర్మదేవత యధిష్టానము తమరు దాని యాభాసయని జెప్పనొప్పు.

నీల—సీతారామశర్మగారన్నమాటయే నిజముగాదోచుచున్నది. తమకు క్షేత్రమునుబట్టియే గౌరవముగాని యవతల న్యాయాధిపతియను గౌరవనామమొప్పదు. బెంచిమీదనున్నంతసేపుమాత్రము జడ్జీలగుదురు. దానివిడచి వచ్చినచో మీరును జనసామాన్యులే యగుదురు. కావున ధర్మదేవత మీకులక్ష్యముగాని మీరు దానికి లక్ష్యమనుట యసంగతమని నాకు తోచుచున్నది.

రంగ—ఓహో! నీలకంఠయ్యగారు గురువుకు పంగనామాలు దిద్దుట నేర్చినారు? నామాటలు పూర్వపక్షము చేయుచున్నారు. నేను జాయంటువకాల్తనామాలు దాఖలుచేసి పనిలో మెలకువలన్నియు నేర్పినందుకు గురుదక్షిణ బాగానేయిచ్చినారు.

నీల—అవును. నిజమాడితే నిష్ఠూరమే కలుగును.

ఇరక—సీతారామశర్మగారెప్పుడూ వికటకవులు. వీరితో శుష్కవాదములేల. నేను కర్మదేవతకధిపతినో ఆమెయే నాకధిపతియో చూపించెదను. ఎవరయ్యా నాగన్నపంతులు! ట్రియల్ కేజులు పిలవండి.

నాగ—చిత్తము. బంట్రోతు! నిర్భాగ్యదామోదరయ్యగారు వాదినిపిలు. (తనలో ఏమిమాట్లాడడేమి) హైరుహాజరుఖాఁ, హైరుహాజరుఖాఁ.

ఇరక—వాడెక్కడకుపోయినాడో నీవేపిలు.

నాగ—(దిగ్గున చిత్తము అని లేచి) నిర్భాగ్యదామోదరయ్యా! దామోదరయ్యా! హాజరులేడండి.

ఇరక—ప్లీడరునుపిలు.

నాగ—సీతారామశర్మగారు.

సీతా—చిత్తము. నేను రెడీ(సిద్ధము)గానున్నానండి.

ఇరక—ప్రతివాదిప్లీడరును పిలు.

నాగ—రంగయ్యపంతులుగారు!

రంగ—చిత్తము నాపార్టీ సిద్ధముగానున్నాను.

ఇరక—సరే ప్రతివాదితరపు సాక్షులను, వాదితరపుసాక్షులను దూరముగానుండమను. ప్లయింటుచదువు.

సీతా—కోర్టువారు ట్రియిల్ కేసెస్ ఆరంభించకమునుపు నాది యొక్కమనవియున్నది. అదివినవలెను.

ఇరక—ఏమిటి?

సీతా—ఒకనెంబరులో వాది డిక్రీపొంది ప్రతివాది ఆస్తి (సస్యము) జప్తుచేయించినాడు. అందులో కావలసిన భత్యము వగైరా లన్ని దాఖలుచేసియున్నాము. ఇప్పటికి రెండుమాసములైనది. బెంచి మీదనే ఆర్డరువేయించినాను. ఆయార్డరు యిప్పటికిన్ని జారీఅయినట్లు కనపడదు. సస్యము కోతకువచ్చినది. ప్రతివాదికి ఇంతకన్న ఆస్తిలేదు. అది కోసుకొనిపోవడం ప్రయత్నంలోనున్నాడు. కాబట్టి అదివెంటనే జారీచేయించమని కోరుతూ యీపిటీషను దాఖలుచేస్తూవున్నాను.

ఇరక—కోర్టువారు ట్రియిల్ ఆరంభించినతరువాత రామాయణములో పిడకలవేట్లాటయన్నట్లు వారంటుయిీగాకా పిటీషను పెడతారే మయ్యా? దానివేళలో అదిరావలెను. సమయాసమయము లక్కరలేదా?

సీతా—మామూలుప్రకారం ఇది వారంటుయిలాకా విచారించు సమయమే. అదిమార్చి కోర్టువారు ప్రత్యేకము యీరోజున ఏకారణముచేతనో ముందుగా విచారణకేజులు ప్రారంభించినారు. అర్జెంటువ్యవహారము గనుకనున్ను, పార్టీకి నష్టము సంభవించునుగనుకను, చిరకాలము క్రితమే దాఖలైనది గనుకనున్ను ఇప్పుడు చెప్పవలసివచ్చినది.

ఇరక—ఏమిటయ్యా! నాగన్నపంతులు!

నాగ—(తనలో) ఈపార్టీవల్ల వారంటుదరఖాస్తునాడిచ్చిన రూపాయతప్ప దమ్మిడీ కళ్ళబడలేదు. దావా ఫైల్ వేసుకొనుటకు ఇచ్చినపావలాడబ్బులుకన్న దమ్మిడి హేడ్డుగుమాస్తాగారికే ముట్టలేదు. నాజరుగార్కి వీడుదర్శనమే యివ్వలేదు. వెళ్ళినఅమీనాకు వీడేమి చెప్పకపోతే యెదరపార్టీవల్ల ఒకరూపాయపుచ్చుకొని వాడది అమలుజరపకుండా వచ్చినాడు. ఈసంగతిదాచి ఈపిటీషను తోసివేసేటట్టు చేస్తాను. ఆలాగైతే మాకు అందరికి మళ్ళీ మామూళ్లు ముట్టుతవి. ఇందులో ఎదరసైడు రంగయ్యపంతులుది. అతనిపార్టీ చాలాధనికుడు. అతనివల్ల ఎక్కువలాభము కలుగును. ఇదిగాక రంగయ్యపంతుల్కు జడ్జీ పెద్దకొడుకు. నేను రంగయ్యపంతులు పక్షమైతే ఈకోర్టులో సాగనిషని యేమున్నది.

(ప్రకాశముగా) చిత్తము. యిదివరకే జారీఅయినదండి. ప్రతివాది గొప్పస్థితిపంతుడు. రంగయ్యపంతులుగారి క్లయింటు.

ఇరకి—ఏమయ్యా! రంగయ్యపంతులుగారు ఈపిటీషన్కు ఏమి చెప్పతారు.

రంగ—చిత్తము. ఇదివట్టి ప్రివలస్ పిటీషన్ (నిష్ప్రయోజనమైన) పిటీషనండి. అందులో సత్యము అందులోనేయున్నది. అదికోర్టుకు రాలేదు. ప్రతివాది 200 యకరముల వసద్దారుడు. వీరిసొమ్ము అడిగినతక్షణమే యివ్వగలడు. సదరుడిక్రీ తమకుముందున్న జడ్జీగారివల్ల తీర్మానించబడినది. దానిపైన అప్పీలుచేసినారు. పెండింగులోనున్నది. యక్జిక్యూషన్ స్టే

చేయమని మేము పిటీషనుకూడా దాఖలుచేసినాము. ఆర్డరుపడినట్లు నా కుత్తరముకూడా వచ్చినది. ఒకవేళ తమఆర్డరు ఇదివరకే జారీఅయిన యెడల సొమ్ము యిచ్చివేసేవుంటాము.

సీతా—అతనికి ఆస్తిలేదు. అప్పీలులేదు. స్టే పిటీషనులేదు. అంతాఅబద్ధము. డిక్రీమొత్తము కోర్టులో డిపాజిట్టుచేస్తే మాకేమి అక్కరలేదు.

నాగ—అప్పీలు కోర్టునుంచి ఆర్డరువస్తేనేకాని తమరేమిచేయు. టకు వీలులేదండి. జప్తు ఆర్డరులోగడనే జారీఅయినది.

ఇరకే—ఈపిటీషను అనవసరము. కొట్టివేసినాను. ప్లయింటు చదువుము.

నాగ—(చదువుచున్నాడు)

మహారాజశ్రీ కోర్టువారిసముఖమునకు.

వాది నిర్భాగ్యదామోదరయ్య 1 ప్రతివాది నిశ్చింతబ్రహ్మానందంగారు పయిన వాది కోర్టుయొక్క శై ప్రకారము దాఖలుచేసిన ప్లయింటు.

(1) వాదితాలూకు 25రూపాయలు కిమ్మతుచేసే దున్నపిల్లనుప్రతివాది అక్రమముగా హరించినాడు.

(2) అది యివ్వమని తగాయిదాచేసినను యివ్వలేదు.

(3) సదరు దున్నపిల్లను ప్రతివాదిహరించిన 1910 సం॥జనవరినెల ఆప్రాంతములనుంచి తమకోర్టుయిలాకా మాదయవరంలో దావాకారణము కలిగినది.

కాబట్టి కోర్టువారు కటాక్షించి సదరు దున్నపిల్లలేక దానికిమ్మతు రు 25 లున్ను ఖర్చులున్ను యితరపరిహారములున్ను యిప్పించమని వాది ప్రార్థిస్తూవున్నాడు.

శ్రీరస్తు.

# బాలబోధ.

క. తనదారిఁ దాను బోవుచు।
జనులకు బోధించకొలంది సాయము నొసఁగన్।
దనరుమఁ దగునడవడికలఁ।
జనుసజ్జనుఁ డిలఁదు నందు సౌఖ్యము లలరన్.

నానావిధజన్మములలో నుత్తమోత్తమ మయినది మానవజన్మమనుట సర్వజనవిదితముగదా. అట్టి మానవజన్మ మెత్తి లోకజ్ఞానసంపన్నుఁడైన జనుండు తా నేమతస్థుండయినను సర్వజనసమ్మతంబే తనమతంబని తలంచుచు లేనిపోని వ్యాపారంబులం దగులుకొని చెడదారులంబడి దురితంబులాచరించి లోకనిందితుండై నిరయంబులపాలౌగాక తనకు న్యాయ్యమని తోఁచినమార్గంబున మెలంగుచు సత్యసంధుఁడై చేతనైనంతవఱకుఁ బరులాకుపకారంబాచరించుచు భగవదారాధనతత్పరుండై సత్కాలక్షేపంబుల చేయుచుండవలయునని పెద్దలు చెప్పుచుందురుగదా.

అట్టి సర్వోత్కృష్టమైన మానవజన్మమెత్తిన యిప్పటివారిలో నెవరో సత్తములు కొందఱుతక్కఁ దక్కినవారందఱును దిక్కుమాలిన విషయోపభోగంబులం దగులుకొని జ్ఞానలవదుర్విదగ్ధులై కన్నుగాన కిహపరదూరులై యున్నవారనుట సత్యమునకుం గట్టుబడియున్నదనుట స్వభావోక్తియే. అట్టివారి ప్రవర్తనంబు లిట్టివని జనులెఱింగినచో నించుక మంచిగం బ్రవర్తించుట గలుగఁగలదని వానింగొంచెము వ్రాయుచున్నాము. కొందఱు మేముపురాణవిద్యాభ్యాసము చేసితిమి మేమేలోకజ్ఞులము మాకన్న గొప్పవారెవ్వరును లేరని గర్వించి యొరులను దిరస్కరించుచున్నారు. మఱికొందఱు మేముమహాకవులము మాకవిత్వము సర్వసామాన్యమై మృదుమధురశైలిం దగిలియుండును. మాతో వచనము వ్రాయువారీ జగంబున లేనేలేరని విఱ్ఱవీఁగుచున్నారు. కొందఱు

శతావధానులమనియు నష్టావధానులమనియు నాశుకవులమనియుం జెప్పుకొనుచు ననేకా కార్యకరణములు చేయుచున్నారు.కొందఱు మేముపాధ్యాయులము మేముసంస్కర్తలము. మేము మతగురువులమని తక్కినవారిం జెందనాడుచున్నారు.కొందఱు మేము పత్రికాధిపతులమని తమపత్రికలో వీఁడు మంచివాడుకాడు ఇత్యాదులు నిర్భీకులై వ్రాసియుఁ బదుగురి లోనిల్చి ధర్మోపన్యాసము లిచ్చియు మరియు నెన్నెన్నో చేసియుఁ దాము లో లోఁ జెప్పుకొనరాని తప్పులు చేయున్నారు. మఱికొందఱు తామే గొప్పవారమనిపించుకొనుటకును గొప్పబిరుదములు సంపాదించుకొనుటకు నెన్నెన్నో పాట్లుపడి యేవేవో చేసి కృతార్థులగుచున్నారు. కొందఱు జగదుపకారమని పేరుపెట్టి కార్యస్థానములని, సమాజములని, పాఠశాలలని సత్రములని సమారాధనములని యజ్ఞములని యాగములని కల్పించి ధనవంతులనాశ్రయించి వారినివంచించి ధనముసంపాదించి కాకులంగొట్టి గ్రద్దలకు వేయునట్లు చేయుచుఁ దాముసుఖించుచున్నారు. ఇట్టివీరందఱును పాపమునకు జంకరు అసత్యమునకు డొంకరు. కౌటిల్యమునకు బాయరు.ఏమిచేయుటకును వెనుకదీయరు. జనులారా! వీరినిజూచి మోసపోకుడు. వీరుమేకవన్నెపులులు వీరితోడి మైత్రిముప్పునకగు. వీరిదర్శనస్పర్శనసంభాషణాదికములును బాపంబునకాకరంబు. ఏమో చెప్పితిమని యెట్లోతలంచుకొనక జాగరూకులై మెలంగుఁడు. మోసపోకుఁడు. మీమీసత్కార్యంబులదెస మీరు ప్రవర్తించుచు భగవదారాధనంబు గావింపుఁడు. దానమీకిహపరంబుల నత్యంత సౌఖ్యంబు చేకూరును. చేకూరును.

# వివేకానందస్వామి

కలకత్తా ఉన్నతన్యాయసభయందు విశ్వనాథదత్తుఁడను న్యాయవాది గలఁడు. ఆయనకు సద్గుణశీలయు మేధానిధియు నగు భార్యగలదు. 1862 సంవత్సరము జనేవరి నెల 9 వ దినమున ఈదంపతులకు శుభముహూర్తమున పుత్రజననము గలిగెను. వారా బాలునకు నరేంద్రుఁడని నామకరణము జేసిరి. వివేకానందుఁడను సార్థకనామమును వహించి తన యసమానవాగ్ధాటిని భారతీయులకేగాక పాశ్చాత్యులకుఁగూడ జవిజూపి, భారతవర్షముయొక్క యాధ్యాత్మికౌన్నత్యమును ప్రపంచమున వెల్లడించి, తన మాతృదేశముయొక్క కీర్తి నజేయమగునటుల స్థిరీభూతము జేయునని ఈబాలుఁడు జన్మించినపుడెవ్వరును దలంపరైరి.

పువ్వుపుట్టగనే పరిమళించును. నరేంద్రుఁడు బాల్యమునందే సహచరులయెడల సహానుభూతిని సమభావమును, పెద్దలయెడల భక్తిశ్రద్ధలను, దేవునియెడలను పారమార్థికవిషయములయందును బ్రేమనుగలిగియుండెను; ఆయనస్వభావసిద్ధముగనే ధ్యానపరాయణుడును, నిశ్చింతభావుడునునైయుండెను. బాల్యమునందలి ఈసద్గుణపుంజముతే వయస్సుముదిరినకొలదిని పరిపక్వస్థితిని జెంది ప్రజ్వరిల్లెను. పాఠశాలలో గ్రింది తరగతులయందు జదువునప్పుడే ఆయన భారతీయతత్త్వశాస్త్రము నభ్యసింప మొదలిడినదేగాక పాశ్చాత్య తత్త్వకోవిదులగు హెర్బర్టుస్పెన్సరు మొదలుగాఁ గల మహనీయుల గ్రంథములనుగూఁడ పఠియింప గడంగెను. ఇంతియగాక స్పెన్సరుయొక్క కొన్ని సిద్ధాంతములను విమర్శించుచు ఆయనకొకలేఖను లిఖియించెను. ఈలేఖనుజూచి స్పెన్సరు మిగుల యానందమును జెంది సత్యజ్ఞానాభివృద్ధినిజేసికొనుటకాయనను బ్రోత్సహించెను. వివేకానందుడు బ్రథమమున నాస్తికవాదమును పరిశీలించి జూచెను; కాని మనఃపూర్వకమగు భావప్రేరిత స్వభావమును గలిగిన యాయనకది సరిపడదయ్యెను. పిమ్మట బ్రహ్మసమాజ మతమును బరిశీలించెను; భావశీలమగుయాత్మనుగలిగియుండిన వివేకానందుని సంకుచితమై యణచబడియున్నట్టి యామత మాకర్షింపలేదు. ఆధ్యాత్మిక జ్ఞాన సంపాదనాభిలాషచే

ఆయనమనస్సు వేదననుబొందుచుండెను. దైవికసత్యమునుగ్రహింపుట కాఁగాన యాత్మ పరితపించుచుండెను. ఇట్టిస్థితియందు బి. ఏ. పరీక్షయందు కృతార్థతను జెంది న్యాయవాదివృత్తి నవలంబింపవలెనని ప్రయత్నించుచుండెను. కాని ఆయనమనస్సు అంధకారబంధురమై శంకలతోఁగూడుకొని యుండెను. అట్టిసమయమునందాయంధకారమును భేదించి శంకానివృత్తిజేయుటకు సద్గురువుగావలసియుండెను.

జగద్విఖ్యాతుఁడగు శ్రీరామకృష్ణపరమహంస, వివేకానందుని పినతండ్రికిగురువుగానుండెను. వివేకానందు డొకసారి తన పినతండ్రితోఁగూడ గురువుయొద్దకేగెను. అప్పటినుండియు వివేకానందుని జీవితమున కొక నూతన వికాసము గలిగెనని జెప్పనగును. ప్రథమమున ఈగురుశిష్యులిద్దరును సంభాషింపగనే వారిద్దరికిని పరస్పర యాకర్షణభావమంకురించెను. గురువు వివేకానందుడే తనకుదగిన శిష్యుఁడని తలంచెను. వివేకానందుడు గూడ ఆయనయేతనకుదగిన గురువర్యుండని భావించెను. సర్వసంగపరిత్యాగియగు నామహాత్ముఁడు శ్రీకృష్ణసంకీర్తనమును గావింపమని వివేకానందునితోఁజెప్పెను. వివేకానందుడు తన సహజమైస్వరముతోఁబాడెను. అంతట గురువుయొక్క ముఖము దైవసాక్షాత్కారతను బొందినట్లానంద పరిపూర్ణమై విలసిల్లుచుండనే భారతీయుని హృదయము భక్తిభావపూరితమై యుండకుండును! తిరిగియొంటరిగా వచ్చెదనని జెప్పి వివేకానందుడాయనయొద్ద శెలవునుదీసికొని తననిజసదనమునకుంజనెను. ఈసమయమునందేర్పడిన సంబంధము గురువుయొక్క జీవితకాలమునందంతటను దృఢతరమగుచునేయుండెను. మఱియు వివేకానందుని భావిజీవిత ప్రవాహముకొ్రత్తపథమును ద్రొక్కనారంభించెను.

వివేకానందు డప్పటినుండియు రామకృష్ణపరమహంసయొక్క భక్తియుతుడగు శిష్యుడై ఆయనయొద్ద నాద్యంతరహితములగు వేదాంతరహస్యముల గ్రోలనారంభించెను. సదయహృదయులనేకులు పరమహంసయొక్క శిష్యులైయుండిరి. అయినప్పటికిని వివేకానందుడు వారియందెల్ల నగ్రస్థానమును వహించియుండెను.

రామకృష్ణపరమహంస 1886 వ సంవత్సరమునందు ఆగష్టునెల 16 వ దినమునందు పరమ పదమును జెందెను. ఆయనశిష్యులందరును స్వార్థత్యాగులై పవిత్రవంతముగ జీవితములను గడుపుకొన కృతనిశ్చయులైరి. వారందరునుగూడ ప్రాపంచక సౌఖ్యముల

నన్నిటిని విడనాడి, దేశమునందు నీతిమతముల నభివృద్ధిజేయ దీక్షను వహించిరి. వివేకానందుడు వారియందొకడు. తనసోదరులతో గూడి కొంతకాలముపనిజేసి ఆయన తపస్సునుజేయుటకై హిమాలయపర్వతములకు బోయెను. అక్కడనుండి టిబెట్టుదేశమునకు బోయి బౌద్ధమతమును జదివెను. ఆదేశమునుండి దిరిగి వచ్చి హిందూదేశమునందంతటను సంచారముజేయ నారంభించెను. ఖత్రీనగరమునకుబోయి యిక్కడి మహారాజును తన మతమునకుద్రిప్పి, పశ్చిమతీరమున సంచారముజేసి త్రివేండ్రమునకును యక్కడినుండి మద్రాసునకునుబోయెను. ఈసంచారమునందెల్లెడలను విసుగు విరామము లేకుండ వేదాంతసూత్రములను బ్రబోధించుచు ప్రాచీన భారతవర్షముయొక్క యౌన్నత్యమును దృక్పథమున బెట్టుచుండెను.

ఆయన మద్రాసునందున్నప్పుడు ఛికాగోనగరమునందు సర్వమతమహాజనసభ జరుగనుండెను. ఆసభయందు హిందూమతమునుగూర్చి నివేదించుటకు వివేకానందుని బంపినయుక్తముగ నుండు నని జాలమంది తలంచి చందాలను బ్రోగుజేసి అమెరికాఖండమున కాయననుబంపిరి.

అమెరికాఖండమునకు జేరునప్పటికి తనదగ్గరయున్న స్వల్పద్రవ్యము ఖర్చుపడిపోగా ఆయనబిచ్చమెత్తవలసిన దశ సంభవించెను. కాని యొకముసలిది స్వామిని వినోదార్థముగా తనస్నేహబృందమునకు బ్రదర్శింపదలంచి ఆయన కాతిథ్యమొసంగెను. వివేకానందుడు వారికి వినోదమును గొల్పుటమాత్రమేగాక, అసమానమును యపూర్వమును యగు తనవాక్సామర్థ్యమును వారు మెచ్చుకొనునటులజేసి, తనయందిమిడియున్న మేధాశక్తిని వారికి జవిజూపెను. భారతీయుల తత్వశాస్త్రమునుగూర్చి యసమానవాగ్ధాటితో జెప్పిన యంశములను విని వారందరును 'ఆయనయొక్క శక్తిసామర్థ్యములను గ్రహించిరి. ఆయనచెప్పిన కొన్నియంశములు వారి కర్థమే గాలేదు. అందుచేత తత్వశాస్త్రజ్ఞునొకనిని ఆయనతో వాదమును సల్పుటకై దీసికొనివచ్చిరి. ఆశాస్త్రజ్ఞుడు త్వరలోనే స్వామియొక్క యోగ్యతను గ్రహించి, సర్వమతమహాజనసభకు అగ్రాసనాధిపతియగు డాక్టరు బారోసుగారికి పరిచయమును గలుగజేయగా, హిందూమతమును

గుఱించి దెలియజేయుటకు స్వామినాయన యంగీకరించెను. ఆగొప్ప సభయందు మన స్వామియొక్క దర్శనము గొప్ప సంక్షోభమును బుట్టించెను. కాషాయవస్త్రములను ధరించి సభకుబోయి ఆయనవేదాంతముయొక్క మహత్వమును, ఘనతను యుచ్చైస్స్వరముతో జాటెను. మఱియు వేదాంతశాస్త్రమునందణగియున్న మహద్విషయముల నన్నింటిని జూపునప్పటికి సభికులందరు యాశ్చర్యమగ్నమానసులైరి. ఇంతటివఱకును బ్రఖ్యాతిలేకయున్న స్వామికిప్పటినుండియు బ్రాముఖ్యత గలిగెను. వెనువెంటనే బాశ్చాత్యులందరును ఆయనయొక్క గొప్పతనమును గ్రహించిరి. న్యూయార్కునగరమునందు బ్రచురింపబడుచున్న 'హెరల్డు' యను పత్రిక యిట్లువ్రాసెను:—"సర్వమతమహాసభయందెల్ల నిస్సందేహముగ వివేకానందస్వామియే గొప్పవాడు. ఆయన జెప్పిన విషయములను విన్నబిదప విద్యావంతులగు నాజాతివారికి (హిందువులకు) ఈదేశమునుండి మిషనరీలను బంపుటెంతయు యవివేకము.'' అంతటినుండియు, తత్వజ్ఞానమతములనుగూర్చి యుపన్యాసము లిచ్చుట కాహ్వానము జేయుచు అమెరికాదేశమెల్లెడల నుండియు ఆయనకనేకలేఖలు వచ్చెను. ప్రపంచమునందున్న అనాత్మవాదులయందొకరగు యమెరికా ప్రజలయందు వేదాంతమతమును జనసమ్మతమగునట్లు జేసిన వివేకానందస్వామియెడల మనమెట్లు కృతజ్ఞతను జూపగలము?

అమెరికాఖండమునుండి ఆంగ్లేయదేశమునకు బోయి యక్కడకూడ తనప్రభావమును వెల్లడిబరచెను. ఆయన లండనునగరమునందు రెండుమాసములుండి వేదములను ఉపనిషత్తులను నిరంతరముగ వివరించి జెప్పెను. ఆయన పడిన శ్రమయంతయు ఫలించెనని జెప్పవచ్చును. ఆలోచనా సహితములగు మనస్సులయందు ఆయనజేసిన భారతీయ తత్వజ్ఞాన నిరూపణ బీజములు నాటుకొని యనేకమంది శిష్యులైరి.

ఆయన తన మాతృదేశమునకు దిరిగి 1893 వ సంవత్సరము డిశంబరు నెల 16 దినమున విచ్చేసి, 'కొలంబో' నగరమునుండి 'అల్మోరా' వఱకును బ్రయాణమునుజేసెను. ప్రతిస్థలమునను వివేకానందుని గాఢమగు బ్రేమతో నాదరించుచువచ్చిరి. మఱియు

నాయనను గొప్ప పునరుద్ధారకునిగను సంస్కర్తగను గౌరవించి సన్మానించిరి. ఆయన
యభిప్రాయములన్నియు సర్వజనాంగీకారములయ్యెను. ఆయనబోయిన స్థలమునందెల్ల
మాతృదేశముయొక్క ప్రాచీనయౌన్నత్యమును జనుల హృదయములయందు చిత్రించి
వైచి, వారియందుత్సాహమును యభిమానమును గలుగజేయుచుండెను. ప్రోత్సహించు
టతోడను, ఉపన్యాసవేదికలనుండి వాగ్ధాటిని జూపించుటతోడను ఆయనపని సమాప్త
ముగాలేదు. తానుజేయుచున్న మహాత్కార్యమునకు స్థిరత్వమును నిలుకడను గలుగజే
యుటకై ఆయన ప్రయత్నించెను. వేదాంతమును సర్వసామాన్యమగునటులజేసి, స
న్మార్గతయందును యాధ్యాత్మికౌన్నత్యమునందును దైవికజ్ఞానమునందును భారతీయులు
ప్రపంచమునంతకును మార్గదర్శకులగునటుల జేయవలెనని ఆయన యొక్క గొప్పయభిలాష.
ఈయభిలాషను నెరవేర్చుటకై భారతజాతి యందు ప్రచ్ఛన్నమై యణగియున్న స్ఫూర్తిని
విజృంభించునటుల జేయుటయును వేదాంతమును జీవమతముగ జేయుటకును ఆయన విశ్వ
ప్రయత్నమునుజేసెను. సిద్ధాంతములకును వారియనుచరణమునకును తారతమ్యమెంతగల
దో ఆయన తన సోదరులకు జూపెను. వారియనుచరణమునందు దొరలినట్టి యనేకము
లగు దురలవాటులను యనాచారములను పారదోలుటకును, సన్మార్గమునందును సాంఘిక
స్థితిగతులయందును జెడిపోయి యుండుటవలన ప్రస్తుత స్థితి యందెంత వరకు క్షీణించి
యుంటిమో కండ్లు దెరచి జూచుటకును ఆయనగోరెను.

ఆయన రామకృష్ణసంఘమును దిరిగిస్థాపించెను. హిందూయోగులకు స్వార్థ
త్యాగ భక్తిపూరితంబైన జీవితమును గడుప బోధించుటకు కలకత్తాయందును హిమాలయ
పర్వతములయందును ఆశ్రమములను మఠములను ఏర్పరచెను. నవీనసిద్ధాంతమును
బోధించుటకీ రెండుస్థలములును ఆయనకు ముఖ్యప్రదేశములు. 1897 వ సంవత్సరపు
కరవుదినములయందు బీదలను ఆపదయందున్న వారిని రక్షించుటకుగాను సహాయసంఘ
ములనాయన స్థాపించి బనిజేసెను. మితము మీరి పనిజేయుటచే ఆయన యారోగ్యము
జెడిపోవ నారంభించెను. ఆరోగ్యరక్షణ కొరకాయన దిరిగి పాశ్చాత్యదేశములకు పయ
నమైవెళ్లెను. కొంతకాలము ఆంగ్లేయదేశమునందుండి యారోగ్యము నభివృద్ధిపరచుకొని

అమెరికాఖండమునకుబోయెను. ఆఖండమునందున్న సాన్‌ఫ్రాన్సిస్కోనగరమునందు శాంతిఆశ్రమమును, వేదాంతసంఘమును స్థాపించెను. అవియిప్పుడుచ్ఛదశయందున్నవి ప్యారిసునగరమున జరిగిన మతమహాసభయందు హిందూమతప్రతినిధిగ నాహ్వానింపబడి ఆయనఫ్రాన్సుదేశమునకు బోయి, ఆసభయందు ఫ్రెంచిభాషలో హిందూతత్వజ్ఞానమునుగూర్చి యుపన్యసించెను. తిరిగి యారోగ్యము క్షీణింప దొడంగ నాయన భారతవర్షమునకు పయనమై వచ్చెను. తనయారోగ్యమునకంటె తానుజేయుపనికొఱకే ఆయన ఎక్కువశ్రద్ధను వహించెను. హిందూయౌవనుల విద్యాభ్యాసము కొఱకొకపాఠశాలను బీదలకును అసహాయులకును సహాయము జేయ నొకగృహమును ఆయనస్థాపించెను. దేశద్రిమ్మరులగు సాధువులందరును గలిసి వేదాంతాభివృద్ధికై పనిజేయుట కొకమతమును గూడ స్థాపించెను. ఆయన మిక్కిలి యోపికతో యౌవనులకు సంస్కృతమును వేదాంతమును బోధించుచుండెను. ఈసమయమునందు, జపానుదేశమునకువచ్చి వారిమతమునకు నూతన చైతన్యము నొసంగ వలసినదని నియుక్తులు గొందరువచ్చి స్వామిని బ్రార్థించిరి. గాని దేహమునందారోగ్యము కొరతవడి యుండుటచే వారికోరికను నెరవేర్చలేకపోయెను. ఆయనప్పటికిని తనసోదరులయభివృద్ధికై బాటుపడుటయందు మాత్రమాయనయే మరి యుండలేదు.

1902 వ సంవత్సరమునందు జూలై నెల యందొక ప్రాతఃకాలమున మామూలు రీతిగనే స్వామి కొన్నిగంటలవరకును ధ్యానపరాయణుడైయుండి, పిమ్మట కొందరునూతనశిష్యులకు సంస్కృతపాఠములను జెప్పెను. మధ్యాహ్నమునందు తిరిగి ధ్యానమునందు మగ్నుడైయుండెను. సాయంత్రము కొంచెముసేపటునిటు నడచి తిరిగివచ్చిన పిమ్మట ప్రార్థనసల్పుచు గూర్చుండెను. ఆరాత్రి 9 గంటలగునప్పటికాయన యాత్మదేహమును విడచిబోయెను.

జీవించినది నలువదిసంవత్సరముల స్వల్పకాలమైనను ఆయననడత ఎంతప్రకాశవంతముగను సుందరముగను యున్నదో జూడుడీ! ఆయన ప్రజలయందు జెల్లించిన పలుకుబడి

ఎంతయద్భుతముగను విచిత్రముగను యున్నయది! ఆయనఘనమగు మూర్తిమత్త్వమును, గంభీరముగ ధ్వనించు కంఠధ్వనినిగలిగియుండెను. భావప్రకాశమునందాయనకుగల కౌశల్యము మిక్కిలి యద్భుతము. ఈయసమానశక్తులనన్నిటి నాయన భారతీయులమతమును నీతిని యభివృద్ధిపఱచుటకు వినియోగించెను. ఆయన సంపూర్ణనిష్కపటి. ఆయన హృదయము సహచరులయెడల ప్రేమతోడను దయతోడను నిండియుండును. ఆయన దేశాభిమానము తీవ్రమైనది. భారతవర్షప్రాచీన యౌన్నత్యమునుగూర్చి ఆయన యుపన్యాసములయందెల్లప్పుడును, మిక్కిలి యానందముచే పారవశ్యతమును జెంది బోధించుచుండును. బుద్ధిసూక్ష్మతవలనను గాఢమగు పరిజ్ఞానమువలనను ఆయనవేదములయందిమిడియున్న మూల్యములగు విషయములను గ్రహించి, బోధించెను. వేదాంతజ్ఞానమునకును నవీన శాస్త్రమునకును గల యైకమత్యము నాయనజూపెను. ఈమతమును యేమతమును గూర్చి దురాక్షేపణలెన్నడు నాయన జేసి యెరుంగడు.

అనుభవమునకు దెచ్చుకొననిదేదియు మతముగాదని ఆయన యభిప్రాయము. ఈనిశ్చితాభిప్రాయమును జనుల హృదయములయందు దృఢముగ నాటవలెనని ఆయన కోరిక. మూఢనమ్మికయేమతమనియు, అదిహేతు వాదాతీతమనియు జెప్పు యభిప్రాయమును జనులమనముల నుండి పారదోల యాయన మిక్కిలి పాటుపడెను. హేతు వాదబద్ధము గానిది మతము కాదని యాయన యభిప్రాయము.

పరమతసహానుభవము నాయన బోధించెను. మతము ఆత్మార్థమననుభవమునకు దెచ్చుననియు, ప్రతిమతమును ఈప్రకారమనుభవమునకుదెచ్చు ప్రత్యేకమార్గమనియు ఆయన యభిప్రాయము. మనుజుడు మహమ్మదీయుడైనను, క్రైస్తవుడైనను, బౌద్ధుడైనను మోక్షమును జెందుటకర్హుడు. ఒకచక్రముయొక్క మధ్యభాగమునకు బోవుటకనేకమార్గములున్నవి. ఒకేపట్టణమునకు బోవుట కనేకవైపులనుండి పలుమార్గములుగలవు. కావున అన్యమతద్వేష రాహిత్యతయే ఆయనయొక్క ముఖ్యాదర్శము. ఆయనజేసిన మతబోధనలన్నియు భారతీయులకందరకును మిక్కిలి యుద్బోధకములై నేటికిని వెలయుచున్నవి.

ఆయనయొక్క భక్తియు, నిష్కాపట్యమును, స్ఫటికంబును వేయిమడుంగులు ప్రాశస్త్యమును గలిగియున్నట్టి స్వార్థత్యాగమును, మనహృదయపీఠమున చిత్రించుకొనవలసిన పాఠములైయున్నవి. మతపునరుద్ధారణ యరుణోదయమున యుదయించిన భానుడని ఆయనను జెప్పందగును. ఆధ్యాత్మిక భారతవర్షమునకును పాశ్చాత్య అనాత్మవాదమునకును జరుగుచున్న పోరాటప్రారంభమునందాయన యవతరించెను. ప్రస్తుత స్థితిగతులను గుర్తించి, మనకార్యములయొక్క ఫలితముల ననుభవింపవలెనను యాసలేకుండ దేశీయులకొరకు పాటుపడుటయే ఆయన మన కొసంగిన సలహాయైయున్నది. ఆయన యుపదేశములు మనయందున్న యంతఃకలహములను పరిహరించును గాక! దేశభక్తుడగు నీపరమపవిత్రుని మనము సదా జ్ఞప్తియందుంచుకొని మనజీవితములను పవిత్రవంతములుగ యొనర్చుకొందుము గాక!

అయ్యంకి వేంకటరమణయ్య.

---

# మేలుకొలుపు

చ. కలిమియు లేమియుం జెలిమికారము వైరము సౌఖ్యదుఃఖముల్
కలిగిన లెక్కసేయఁడు, వికల్పముఁ జెందఁడు జ్ఞానవంతుఁ; డా
తెలివిఁ దొలంగి మోహమునఁ దేజముఁ గోల్పడి క్రోధలోభసం
కలితము లైనకార్యములఁ గాపురుషుండు మునుంగు భ్రష్టుఁడై.

చ. పరు లొనరించుకార్యములు బాగుగ లేననువాఁడు సీతిని
త్పరుఁ డగు ధర్మసత్యములు దాఁటుట మేలగు; నట్లు గాక దు
ష్కరుఁ డగు నీచవర్తనముఁ గల్గి చరించిన యేని, లోక మె
క్కరణిఁ గణించు ఘోరనరకార్యము లెన్నియొ చేసియుండినన్?

ఉ. కామముఁ గ్రోధమున్ మనసు గాడఁగఁ దుచ్ఛసుఖంబుఁ గోరి తా
భామలఁ బెట్టనట్టి నగుబాటు వహించి మెలంగువాఁడు సం
క్రామముఁ జెంద వాఁడగును గాని మహాగుణశాలి గాఁడు బో
నేమముతోడ సంస్కరణ నిష్ఠ మెయిం బొనరించి మించినన్.

చ. పరవనితానురాగముఁ భ్రష్టులు గాఁదగ దంచు నీతులం
గఱపుచు జారకామినులకాంక్షఁ జరించుట, సత్యశౌచముల్
తొలఁగుట పాడిగాఁ దలఁచి దుర్జను లై విహరించు దుంపటల్
చిరము పవిత్రమార్గములఁ జేరనివారిక నైజధర్మముల్.

చ. తొలఁకని నీతివర్తనముఁ, దూలని సత్యబలంబు, శాంతియుం
బెలఁగొను ధర్మబుద్ధి కృప వెల్వడు నిర్మలచిత్తవర్తనం
బును గలవారు లోకముఁ బూజల నందుదు రంతె గాని నే
ఘనుఁడ నటంచు సత్సభల గంతులు వైచిన మూర్ఖు మెత్తురే?

చ. ఒరులకు ధర్మముల్ దెలుపునోజ మెలంగుట మేలు, చిత్తముం
బరమవిశుద్ధమార్గములఁ బంచుట మేలు, దయాంతరంగుఁడై
కరము పవిత్రజీవనముఁ గల్గి చరించుట మేలు, కాని తాఁ
బరులకు నీతులం గఱపి పాపము సేయుట మేలు గాదు పో.

చ. మలినమనస్వి డై సతము మానితధర్మము బోధసేయుచున్,
లలితవినీతివాక్యముల లాలనసేయుచు, శాంతమూర్తి నాఁ
జలనము వీడి చెప్పనకఁ జాగిలి మ్రొక్కఁగ మాత్ర వాయునే
నెలకొనుకామవృత్తి, మెయినిండిన తామసమోహలోభముల్?

చ. తనయవినీతిమార్గములు దాఁచుటఁ బొందు మహాపకారముల్
పోఁకరుచుచుండు, నీతులను బోధనసేయుచునుండు, దానిఁ జూ
చినఁ బెనువారు యోగ్యుఁ డని చేరి నుతింతురు గాని దుష్టుఁ జెం
తను వసియించువారు మనఁ దద్విధ మెల్ల నెఱుఁగనుండుమక్రే?

గీ. చిన్నతనమునుండియుఁ జెన్ను మెఱయఁ
బటుసదాచారముల నెల్ల పారవోలి
ధర్మమార్గంబులను జూప ధన్యుఁ డౌనె
కామదహనంబుఁ జేయనితామసుండు?

గీ. ధర్మసత్యశౌచంబులఁ దాల్పకుండ
బాహ్యవేషంబులను వేసి భ్రమల ముంచి
పరులదుర్మార్గములఁ జూచి పదరువాని
నీతివంతుఁడు నా నది నీటివ్రాలు

గీ. పైపటాటోపములఁ జూచి భ్రమసి పరులు
గౌరవించినమాత్రాన ఘనుఁడు గాఁడు
సత్యశౌచధర్మంబుల సంహరించి
తామసాదిదుర్గుణములఁ దొలఁచువాఁడు.

గీ. అఖిలజనులకు సాక్షి యై యంతరాత్మ
వెలుఁగుచును దేహసమితిని వెలసియుండ
దాని వంచించి దుష్టుఁడు తప్పుఁ జేసి
గప్పిపుచ్చి వాదించినఁ దప్పు పోదు.

గీ. పాపములఁ జేసినాఁ డని పరులు తన్ను
దూషణముఁ జేయ విని మది దుఃఖపడక
క్రోధ ముద్రేక మై తన్ను కొసరుమన్న
మానసము సాక్షిగా నమ్మి మసలు బుధుఁడు.

# సీతాదేవిచరిత్రము.

భరతఖండమునం దుత్తరప్రదేశమున విదేహాయను దేశ మొకటిగలదు. ఆదేశమునకు మిథిలయనునగరము రాజధాని. ఆనగరమున వసియించుచు జనకుడను మహారాజు విదేహరాజ్యము నేలుచుండెను. ఆజనకుడు సుగుణశాలి, సకలశాస్త్రరహస్యవేది. సర్వధర్మకోవిదుడు. భూతదయాపరుడు. సత్యశౌచములుకలవాడు. ఆమహనీయుడు రాజయోగియై యొక్కొకయెడ బ్రహ్మర్షులకుసైతము జ్ఞానోపదేశము చేయగలవాడై ప్రసిద్ధిజెందెననగా నిక నాతని గుణాధిక్యమును వర్ణింపనేల.

అట్టిమహారాజు పరిపాలకుడైన దేశమున ధర్మమెట్లుండునో యచ్చటి ప్రజలకెట్టి స్వాతంత్ర్యసౌఖ్యములుండునో చెప్పనేల ? అతండు ప్రజలనెల్లరిని బిడ్డలవలె పెంచుకొనుచుండుటచేతనే యాతనికి జనకుడను పేరువచ్చెనేమోయని విదేశములనుండి వచ్చి యారాజ్యసౌకర్యములను వీక్షించిన జనులనుకొనుచుండుటయు తమ మహారాజెట్టివాడౌనని యెట్లెఱింగిరో యతనికట్టిపేరిడిరని యచ్చెరువునొందుచుండుటయు తల్లిదండ్రులు పెట్టినపేరును సార్థకపరచి వారికృతజ్ఞతకు పాత్రుడైన మహారాజెంతటిస్తోత్రమునకైన పాత్రుడగునని ప్రజలు మెచ్చుకొనుచుండుటయు నాతని ధర్మపరిపాలనమునకును ప్రజాసౌఖ్యమునకును సాక్షులు. రాజట్టివాడైనపుడు ప్రజలెంతటిభక్తి విశ్వాసములు కలిగియుండిరో చెప్పనక్కరలేదుగదా !

ఆమహారాజు సకలసంపదలును గలిగియుండియు సంతానభాగ్యములేకుండ లోపమని చింతించి పురోహితులయొక్కయు హితులగు ఋషిపుంగవులయొక్కయు యాజ్ఞానుసారము యజ్ఞమొకటి చేయదలంచి యాగశాల నిర్మించుటకై యొక విశాలమైన ప్రదేశమును దున్నించుచుండెను. ఆసమయమున నాగేటిచాలునందొక పెట్టియయుండెను. కృషీవలులా పెట్టికయేమోయని పైకితీయగా నది మంటిచేత కప్పబడి బంగారుచాయతో నించుక మెరయుచుండెను. వారలాశ్చర్యమునొందుచు దానినికొనిపోయి యేలికయగు జనకునకొప్పగించిరి. మహారాజు పెట్టెను తెరచిచూడగా నందుకన

కలతవలె మెరయుశరీరముతో సర్వాంగసౌందర్యముగల యొకయంగనామణి కానవచ్చెను. జనకుడత్యాశ్చర్యచిత్తుడై వెంటనే యామె ప్రాణముతో నున్న సంగతి విమర్శించి తెలిసికొని ఘోరనిద్రయందున్న దానివలె నిద్రించుచున్న యా చిన్నదానిని మేలుకొలిపెను.

భూలోకమును చూడవచ్చిన యాదిలక్ష్మియో స్త్రీరూపమును దాల్చిన భూదేవతయో రతి చేసిన సౌందర్యమో జీవకళ దాల్చిన చిత్తరువో యనునట్టున్న యా బాలికపై కిచ్చి యెన్నడును నెవ్వరును విని కని యెరుంగని విచిత్ర ప్రదర్శనమున జనులనందరిని నద్భుతానందసాగరముల నోలలాడించెను. ఇదప నామె కన్నియయగునట్టుకూడ స్పష్టముగా తెలియనయ్యెను. జనకుడుప్పొంగెను. మహారాజు పుణ్యము మంచిదనియు సంతానచింతతో నున్న భూకాంతునకు భగవంతుడే యీ కాంతను ప్రసాదించి సంతోషము గూర్చెననియు తలంచుచుండిరి. తనపూర్వపుణ్యమీరీతిని కన్యరూపమున వచ్చి పుత్రికలవల్ల పొందవలసిన ముద్దుముచ్చటలు పొందుభాగ్యమును లభింపజేసెనని జనకమహారాజును రాణియు సత్యాంతకుతూహలస్వాంతములతో ప్రకాశించుచుండిరి. నాగేటిచాలునందు దొరికినదగుటచేత నాబాలికకు సీతయని పేరిడిరి. సీతయు నప్పటినుండియు జనకుని తండ్రిగా భావించుచుండెను. జనకుడామెను పుత్రికాప్రేమతో పెంచుకొనుచుండెను. వేపవతీచరిత్రము చదివినవారికీచరిత్రము విశదమే.

జనకుని కూతురగుటచేత జానకియనియు మిధిలాపురాధినాధుని కూతురగుటచే మైధిలియనియు విదేహరాజనందనియగుటచే వైదేహియనియు భూమియందు పుట్టుటవలన భూపుత్రియనియు సీతకు పేరులు కలిగెను. సీత దొరకినతరువాత కొలదికాలమునకే జనకమహారాజున కింకొక పుత్రిక జనించెను. వారిరువురిని జనకుడు సమానమైన గారాబముతో చూచుచుండెను. ఈబాలిక లిద్దరును బహుసుగుణాతులై సౌందర్యయుతలై సుజ్ఞానభరితలై లోకులకెల్లరకు నానందమును పుట్టించుచు పెద్దలెల్లరకు ముచ్చటలను గొలుపుచుండిరి.

క్రమక్రమముగా నీకన్యక లిరువురును బాల్యమును విడిచి యౌవనము ధరించిరి. యౌవనము వహించునప్పటికే మంచివిద్యావతులై చతురమతులై యొప్పుచుండిరి. తన కూతులకు వివాహప్రాయము వచ్చుటతోడనే జనకుడు తగినవరులు దొరకవలయునని ప్రయత్నించుచుండెను. ఆకాలమున క్షత్రియులలో స్వయంవరవివాహములు విశేషము

గా జరుగుచుండెను. స్వయంవరమే యైనను నిది దమయంతీస్వయంవరమువలె రాజుల నందరిని పిలిపించి యిష్టమువచ్చినపురుషుని నెంచుకొనుటమాత్రమే కాదు. ఇది ద్రౌపదీవివాహమువంటిది. క్షత్రియపుత్త్రుల బలాబలములనెల్ల పరీక్షించి యందు విజయము నొందిన వానిని పెండ్లియాడవలయునని యీస్వయంవర నియమము.

అందువలన శివునివలన ననుగ్రహింపబడి పారంపర్యముగా తాతతండ్రులకాలము నుండి తమయింటనుండి శివునివలె పూజింపబడుచుండిన శివుని విల్లొకటి రాజకుమారుల కెల్లగనుచూపి దానినెక్కుపెట్టిన బలశాలికి సీతనిచ్చుటకు నిశ్చయించుకొనిరి. సీతబాల్యమునందే యాచాపమును సులభముగానెత్తి యాటలాడుకొనుచుండుటచే నంతకన్న బలశాలి కామెనీయవలయునన్న తలంపున నిట్లు నిశ్చయించిరి. తలంచిన ప్రకారము దేశమునందంతటను స్వయంవరమును చాటించిరి. ముహూర్తమునాటికి రాజకుమారులెల్లరును విచ్చేసిరి. మిథిలాపురమదివరకే యలంకరింపబడెను. జనకుడు సాత్త్వికుడగుటచేతను రాజయోగియు జ్ఞాననిధియు నగుటచేతను ననేక ఋషీశ్వరులు స్వయంవరమును చూడవచ్చిరి. మిత్త్రులును బంధువులును వచ్చి యతికౌతుకముతో సర్వసన్నాహములను భద్రముగా చేయించుచు జనకునకు తోడ్పడుచుండిరి. స్వయంవరనిర్ణయకాలము సమీపించెను. మహారాజులు రాజులు నందరు నొకప్రక్కను రాజవంశజులును మిత్త్రులు నొకప్రక్క పెడను మునీంద్రులొకయిక్కను పౌరులింకొకచోటను నియమమున ననుసరించి పీఠముల నధిష్ఠించియుండిరి.

ఆసమయమున జనకుడు వచ్చి సీతను నడుమగానున్న యొక యున్నతమైన మంటపమున నిలిపి యామెప్రక్కనే శివధనస్సునుంచి రాజకుమారులను చూచి బిగ్గరగా స్వయంవరనిర్ణయమును తెలియపరచెను. అది వినగానే యామహాచాపము శివునిదనగానే కొందరిధైర్యము చెదరెను. ఆధనస్సుయొక్క గొప్పయాకారమును చూచి కొందరు తమయాశనువదలుకొనిరి. కొందరు స్వశక్తి నెఱుంగక యిదియెంతగొప్పకార్యము చిటుకలో నావిల్లు మోపుపెట్టి యాకన్యను గైకొందును, ఇకను బాలికనాదియే యని యువ్విళులూరుచు తమప్రజ్ఞకు తామే సంతోషించుచుండిరి. సమర్థులగువారువచ్చి యీవిల్లెత్తవచ్చునని జనకుడు హెచ్చరించినతోడనే యొకరాకుమారుడు వచ్చి యాకార్ముకమును కదలింపలేక సిగ్గుపడిపోయెను. మరియొకడు దానినెత్తబోయి పుడమింబడెను. ఇట్టులయిదారుగురు తమశక్తి నిచూపిన తరువాత నీలమేఘశరీరుడును నాజానుబాహుడు

ను పీనవక్షుడును విశాలముఖుడును నగు రాకుమారుడొక్కఁ డుత్సాహముతో సభలోను న్నయొకమహాముని యాజ్ఞను బడసి యాధనస్సు నమాంతముగా నెత్తెను. ఎత్తి నారి సారించి యందరును నాశ్చర్యమున చూచుచుండగా నతిసులభముగా నెక్కుపెట్టి విజయుడయ్యెను. ఆవీరాగ్రేసరుడు దనశక్తినంతయు నొక్కమారుగా నుపయోగించుటచేత నతిదృఢమైన యామహాచాపము సైతము చీకువెదురుబద్దవలె నడిమికి రెండుముక్కలుగా విఱిగెను. ఎల్లరును మేలు మేలని జయజయధ్వానములతో చేతులు చరచిరి. అవివరకోడిపోయినవారు మాత్రమభిమానమున చిన్నబోయి యాపురుషునియెడ నసూయ వహించిరి.

కొండవంటి యాగొప్పవిల్లును బెండువలె నెత్తిన యామహాబలశాలి సాకేతపురాధీశ్వరుండైన దశరథమహారాజు ప్రథమపుత్రుడగు శ్రీరామచంద్రుడు. విశ్వామిత్రుడు తనయాగరక్షణార్థము వేడికొని తండ్రియొద్దనుండి తీసికొనివచ్చి తన కార్యమైన పిదప సీస్వయంవరము చూచి వత్తము రమ్మని యతని నిచ్చటికి తీసికొనివచ్చెను. తోడినీడవలె నెడబాయక యెప్పుడును నన్నగారితో నుండు లక్ష్మణుడప్పుడుకూడ నుండెనని చెప్పబనిలేదు. విల్లెత్తుటకు పోవునప్పుడు రాముడు గ్రహించినది మహాత్ముడైన యావిశ్వామిత్రుని యాజ్ఞనే. విశ్వామిత్రుడు శ్రీరాముని బలపరాక్రముల నెఱింగినవాడగుటచేత స్వయంవరనిర్ణయమును విన్నతోడనే యామహాకార్యమునకు రాముడొక్కడే సమర్థుడని నిశ్చయించుకొనియే యాదాశరథులను మిథిలకు కొనివచ్చెను.

సీత యాక్షణముననే బలశాలియు సౌందర్యశాలియు నైన పురుషపుంగవుడు తనకు పతిగా లభించినందుల కానందము నొందుచు నతనికంఠము నొక్కపుష్పమాలికచే నలంకరించెను. జనకాదులనుకూలదాంపత్యమమరినదని సంతోషించిరి. మునులును విప్రులును నాశీర్వదించిరి. పిదప జనకుడు రాజన్యశేఖరుండగు రాముని గౌరవించి శ్లాఘించి దశరథుని బంధుమిత్రపుత్రకళత్రపరివారసహితముగా శ్రీరామచంద్రుని కల్యాణము నిమిత్తము తరలి రమ్మని శుభలేఖను వ్రాయించి యయోధ్యకు పంపించెను.

జనకునంతటి సుజ్ఞానితో తనకు వియ్యమందుట లభించినందులకును ప్రియపుత్రు

డైన రాముని వివాహమునకు సంతోషించుచు మహావైభవముతో దశరథుడు మిథిలానగరమునకు తరలి వచ్చెను. విశ్వామిత్రుడు మొదలగు మహర్షులును మరికొందరు మహనీయులును భరతలక్ష్మణశత్రుఘ్నులుకూడ రాముని యంతవారలే యనియు వారలందరును కేశవాంశసంభూతులనియు ప్రశంసించి శ్లాఘించి జనకుని కౌగిలించుటచేత నతండు మహాత్ములవాక్యము లమోఘములనియు యదార్థములనియు విశ్వసించియు వారల యుత్తమపురుషలక్షణంబులు వీక్షించి యాశ్చర్యము నొందియు తన రెండవపుత్రికను లక్ష్మణునకును తన తమ్మునిపుత్రికల నిద్దరిని భరతశత్రుఘ్నులకును నీయనిశ్చయించెను. బంధువులందరును సమ్మతించిరి. అతివైభవముగా నాలుగు వివాహములును జరిగెను.

యుక్తవయస్సు వచ్చినవధూవరులగుటచే వివాహమన్న వధూవరులకందరకును నెంతో సంతోషముగా నుండెను. సతీపతులన్యోన్యానురూపరూపరేఖాగుణలక్షణ విద్యావయోజ్ఞానసహితులగుటచే పరస్పరానురాగముతోను నుత్సాహముతోను వర్తిల్లిరి. వారల యన్యోన్యములును సరాగములును సంతోషములును చూడ ముచ్చటగా నుండెను. బాల్యవివాహముల యందిట్టి భాగ్యము లభింపదుగదా! వివాహానంతరమున వధువులత్తవారింటికి పంపబడిరి.

సీతమ్మ మహారాజగు జనకుని గారాబుకూతురగుటచేతను దశరథమహారాజు కోడలగుటచేతను రాజకుమారులలో నగ్రగణ్యుడును తనకనుకూలుడునునైన శ్రీరామచంద్రుని పత్నియగుటచేతను బహుభాగ్యవంతురాలని చెప్పుటకు సందేహము లేదు. ఎంతటివారికైనను నొక్కొకకాలమునందదృష్టము దూరమై కష్టములు కలుగుచుండుట లోకసామాన్యము. మన సీతాయికూడ దైవికములును భౌతికములును నైన కొన్నికష్టములనుభవింపవలసివచ్చెను.

దశరథమహారాజునకు కౌసల్య, సుమిత్ర, కైక యను ముగ్గురు భార్యలు గలరు. వారిలో పెద్దభార్య కొమరుండు సీతాపతియగు రామమూర్తి. లక్ష్మణశత్రుఘ్నులు సుమిత్రాదేవి సంతానము. కైకపుత్రుడు భరతుడు. దశరథునకు కడగొట్టు భార్యయగు కైకేయియందు ప్రేమము మెండు. మహారాజొకప్పుడు కైకకు కోరిన వరమిచ్చెదనని

వాగ్దానము చేసెను. కైక ముందెన్నఁడైన తనకు గావలసిన వరమడిగెదననియు నప్పుడు తప్పక యీయవలయుననియు నడిగి యట్లేయని యతని నొప్పించెను.

దశరథుఁడు పుత్త్రులవివాహమైన పిమ్మట పెద్దకుమారుఁడగు శ్రీరామునికి పట్టాభిషేకము చేసి వృద్ధుఁడగుటచే రాజ్యభారము లేకుండ కొడుకు రాజ్యమేలుచుండఁగా చూచుచు భగవంతుని సేవించుచు సంతోషముగా కాలక్షేపము సేయఁదలంచెను. ఒకనాఁడు శ్రీరాముని పిలిచి నాయనా! నేను వృద్ధుఁడనైనాఁడను. రాజ్యభారము నిక భరింపజాలను. అన్ని సౌఖ్యములును నెల్లభోగములును ననుభవించితిని. భగవత్సేవ సేయుకాలము పుచ్చఁదగినకాలము వచ్చినది. నీకిక పట్టాభిషేకము చేసెదను. అని చెప్పెను.

రాముఁడామాటలు వినినతోడనే యేమియును చెప్పజాలఁడాయెను. అతనిచిత్తము సంభ్రమముతో నుండెను. తండ్రివలె చక్కఁగా ధర్మయుక్తముగా ప్రజారంజకముగా పాలన చేయఁగలనో లేనో యని యతనిహృదయము విహ్వలమయ్యెను. తాను మహారాజగుచున్నా ననుసంతోషమునకు మాఱుగా రాముఁడు పరిపాలనాదక్షత తనకు పరిపూర్ణముగా కలదో లేదో యని డోలాయమానమానసుఁడయ్యెను. తానతిసమర్థుఁడయ్యును న్యాయధర్మములయందలి యాసక్తిచే నిట్లు భయసంశయగ్రస్తుఁడయ్యెను. ఇదియుత్తమపురుషలక్షణమే కదా!

రాముఁడు కొంతసేపటికి తండ్రికిట్లని యుత్తరమిచ్చెను. జనకా! నేను బాలకుఁడను. లోకానుభవములేనివాఁడను. కొంతకాలము మీచాటుననుండి రాజ్యాంగవ్యవహారములను చూచుచు నేర్చుకొనఁదగినవాఁడను. ఈరాజ్యభారము కడుగొప్పది. దాని నిప్పటినుండియు భరింపుమనుట న్యాయమా! యని సముచితముగా బలికెను. దశరథుఁడు తన ప్రియపుత్త్రుని సముచితసంభాషణమునకు సంతసించి యతనిబుజ్జగించి సమ్మతించునట్లొనర్చెను.

దశరథుఁడు ప్రజారంజకుఁడు. ప్రజలన్న బిడ్డలే యాతనికి. రాజునకు ప్రజాశరీరమన్న ధర్మమీమహారాజు పరిపాలనమునందే ప్రకాశించెను. ప్రజలును రాజు మంచితనమునుబట్టి భక్తియుక్తులై యనువర్తనతో మెలంగుచు తండ్రినివలె కొలుచుచుండిరి.

దశరధుడు రాజనీతిపారంగతుడు. ఉత్తమోత్తముడు. ఉపాయశాలి. కావుననే తన రాజ్యమునందలి ప్రజల కేకష్టమును గలుగనీయక యేయుపద్రవమును రానీయక జాగ్రత్తతో ధర్మము నాలుగుపాదముల నడచునట్లు ప్రజలు మెచ్చునట్లు వారియిష్టప్రకారము రాజ్యము చేసెను. ప్రజాభిప్రాయమును పురస్కరించుకొని పాలించుటచేతనే ప్రజలు తనయందు భక్తివిశ్వాసములు గలిగియుండిరన్న యుత్తమనీతిరహస్యము నారాజరత్నము బాగుగా నమ్మియుండెను. కావుననే యేకార్యమైనను ప్రజలతో చెప్పక వారి యంగీకారమును పుచ్చుకొనక చేయువాడుకాడు. ఆహా! మహారాజా నామమున కామహానీయుడే యర్హుడుగదా!

తరువాత దశరధుడు సుమంత్రుడు మొదలైన మంత్రివర్గముతోడను పౌరముఖ్యులతోడను తనయభిప్రాయమును మహాసభలో విశదపరచి సర్వజనాంగీకారమును సంపూర్ణముగా వడసెను. రాముడు సద్గుణసంపదయందును సత్ప్రవర్తనమునందును ధర్మాసక్తియందును దయాళుత్వమునందును నౌదార్యదాక్షిణ్యాదులయందును దశరధుని కొంకెంతయు తీసిపోవువాడుకాడు. అతని సుగుణములు చిన్నతనమునుంచియు నెల్లరు నెఱుంగుదురు. రాజకుమారుడనను గర్వంబు లేక యెట్టివారితోడను చనవు గలిగి ధారాళహృదయముతో సంచరించుచుండెను. సమస్తనరులను సమముగా ప్రేమించుచు తగినమర్యాదలు చేయుచు నెల్లరిగౌరవమునకును విశ్వాసమునకును విధేయతకును పాత్రుడైయుండెను. అతడు వయస్సున చిన్నవాడైనను గుణగణంబుచేత మిగుల పెద్దవాడును పూజ్యుడును నై యుండెను. అతనికి పూర్వాచారములయందును నార్యధర్మాచరణమునందు బహు ప్రీతి. రణశూరుడు. త్యాగశీలుడు. బుద్ధిశాలి. సకలకళాకోవిదుడు. వశిష్ఠమహాముని వలన శాస్త్రములును వేదములును నభ్యసించియు రాజర్షిసత్తముడైన విశ్వామిత్రునికడ గూడ నధర్వణవేదమును ధనుర్విద్యయు నభ్యసించినవాడు. ఇట్టిపురుషపుంగవుండిట్టి రాజకుమారరత్నము రాజగుభాగ్యము గలుగుచుండ ప్రజలేల వలదందురు? రాముని సదయహృదయతయు నీతిచరితయును నెఱింగించి యుండిన వారగుటచే జనులెల్ల నొక్కుమారుగా తమయామోదమును సంతోషపూర్వకముగా దెలియపరచిరి. దశరధునికంటె మిక్కిలి సౌఖ్యముగా రామరాజ్యముండునని ప్రజలు నమ్మియుం

డుటచేత శ్రీరామపట్టాభిషేకమహోత్సవసమయము కన్నులార వీక్షింపగలుగు భాగ్యమెప్పుడు లభించునాయని సమస్తజనులును నువ్విళ్లూరుచు నెదురుచూచుచుండిరి.

ముహూర్తము నిశ్చయింపబడినది. పురమును రాజ్యమునందలి సమస్తనగరములును జనపదములును మహావైభవముగా నలంకరించుచుండిరి. ఎల్లజనులకును వేడుక గలిగించు సత్కార్యములకు సైతమొక్కొకవేళ విఘ్నముసంభవించి నిరుత్సాహము ప్రాప్తించుటయుకలుగుకదా! అందరికిని నానందదాయకమైన శ్రీరాముని పట్టాభిషేకమహోత్సవము కైకమ్మకు దుస్సహముగానుండెను. మంథరయను దాదిచేసిన దుర్బోధలవలన కైక రామునియందు మచ్చరముపూని యీమహాకార్యమున కంతరాయమును గలిగించెను. రామునికి రాజ్యాధిపత్యము వచ్చినయెడల తనపుత్రుడగు భరతునికేమియు నధికారముండదనియు భరతుడు రామునిసేవయును తానుతన సవతియగు కౌసల్యాదేవి సేవయును జేయుచు జీవింపవలసివచ్చుననియు తనకును తనపుత్రునకును గౌరవమును నధికారమును గలుగవనియు గట్టిగానమ్మియుండెను. కావున దశరథుడు మున్ను తనకిచ్చెదనన్న వరమిప్పుడడుగుచున్నదాననియు భరతునకు రాజ్యపట్టముగట్టి రాముని పదునాలుగేండ్లువనముననుండ నాజ్ఞాపింపవలసినదనియు గట్టిగాగోరి తన కఠోరతను మూర్ఖతను మూఢతను నసహ్యతను వెల్లడించుకొనెను.

ఈవింతకోరిక దశరథుని దుఃఖసముద్రమున ముంచివేసెను. దశరథుడు తాను మున్ను చేసిన వాగ్దానమునకును తన స్త్రీలోలత్వమునకును కైక మూర్ఖత్వమునకును నవ్యక్తతకును పశ్చాత్తాపమును నాశ్చర్యమును విచారమును జెందుచు నేమియుననజాలకయు నేమియుజేయజాలకయు నూరకుండి తనలోతాను శోకించెను. తనపుత్రులలో పెద్దవాడగుటచేతను సుగుణసంపదలనగూడ నధికుడేయగుటచేతను రాజ్యాధికారమునకుపాత్రుడైనట్టియు వారసత్వము గలిగినట్టియు రాముని రాజును జేయవలదనుటయేగాకుండ నరణ్యమునకు పంపుమని యడుగుటకు నోరెట్లు వచ్చినదోయని యాశ్చర్యపడెను. తన్నుతాను నిందించుకొనెను. తాను సత్యవాక్యపరిపాలకుడగుటచే నేమియు బలుకలేక పోయెను. ఆహా! దశరథుని సత్యసంధత! సత్యపరిపాలనమనగా సూర్యవంశజులకేగదా చెల్లును!

కైకమ్మ కోరిన హిరణ్యాక్ష రాక్షసవరమును విన్ననరులందరును నామె నొక్క పెట్టున నిందించిరి. ఆమెగుణముల నెల్లను నేవగించుకొనిరి. రాజ్యాభిషేకము మాట యటుండ వనవాసము సేయనలసిచ్చిన సుకుమారుడగు శ్రీరాముని యవస్థకందరును విచారించిరి. కౌసల్య దుఃఖించెను. భరతలక్ష్మణశత్రుఘ్నులును సౌమిత్రాదేవియు చింతించిరి. లక్ష్మణుడు కైకమీద గినిసెను. భరతుడును తనతల్లిని పాపాత్మురాలని యనేకవిధముల దూషించుచు శ్రీరాముడులేని రాజ్యాభిషేకము తనకక్కరలేదనియు రాజ్యము నేలుటకు రాముడే తగినవాడనియు తనకతం డెల్లవిధముల పూజనీయుడనియు జెప్పుచు తల్లికోరికను నిరాకరించి యీవృత్తాంతమును విని యాసరికే యడవులకు పయన మగుచున్న శ్రీరామచంద్రుని సన్నిధికిపోయి నమస్కరించి వినయవిధేయతతో వనవా సమునకరుగవలదనియు నజ్ఞానవశమున కోరిన కైక కోరిక సముచితముగను సధర్మముగను లేదనియు దశరథునివలనావరమును కాపట్యముతో పడసినదగుటచేత చెల్లదనియు తనకు రాజ్యాధికారము వలదనియు ననేకవిధముల నుడువుచు రాజ్యభారమును వహించి యేలవలసినదనియు మనఃపూర్వకముగా భక్తితాత్పర్యములతో వేడుకొనెను. కాని రాముడు తనవలన నితరులమనసుల కించుకైన నొప్పిగలుగుచుండ నోర్చువాడుగాడు. అతడు కైకకు సంతోషమును గూర్పవలయునని తలంచెను అందువలన నెందరెన్నివిధ ములజెప్పి బ్రతిమాలినను వనవాసము మానలేదు.

రాముని ప్రయాణము విని సీతయు నాతనితో ప్రయాణమయ్యెను ఆమెయు నెవ్వరెన్ని చెప్పినను పతినెడబాసియుండుటకు సమ్మతింపలేదు. తనపతికి కాబోవు పట్టాభిషేకమునకు విఘ్నము కావించుటయే కాక సుఖముగా పురమునసుండనీయక యడవులకు పంపుచుండిన సవతియత్తయగు కైకయెడల సీతమ్మకేమియు కోపముగాని యయిష్టముగాని గలుగలేదు. ఆమె నొకపల్లెత్తుమాటయైనను ననలేదు. భగవదనుగ్రహ మున్నచో కష్టములే సుఖములై సంతోషమిచ్చునని యామె నమ్మియుండెను. కైక కారకురాలనుటయే గాని యంతయు దైవకృత్యమని యామె యెఱుంగును నాథునితో నట్టడవులనున్నను పురమధ్యమున దివ్యమందిరమున నుండినట్లే యని యామె తలంచెను. కుసుమకోమలివనియు సుకుమారివనియు లేతవయసుదానవనియు వనవాసమున కోర్వలే వనియు కౌసల్య, సుమిత్ర మొదలగువారెంతి చెప్పి వారించినను రాముని విడిచియుండు టకు సీతాదేవి యొప్పుకొనలేదు. సీతహృదయము నెఱింగినవాడగుటచేతను సీతయెడ

తనకుగూడ నతిప్రేమముండుటచే దీర్ఘకాలము చేయవలసిన వనవాసమునకు సీతను విడిచి వెళ్లలేకపోవుటచేతను నెట్టకేలకు రాముడు సీతవెంట వచ్చుటకు సమ్మతించెను. కాని యరణ్యములు క్రూరమృగనివాసములనియు మాయాపరులును నిర్దయులును పాపచిత్తులునునగు రాక్షసాదిఘాతుకజాతుల కునికిపట్టగు విపినప్రదేశములకబలయును సహజభీరుపురాలునగు ప్రియురాలిని దీసికొనిపోవుటపాయకరమునుభయము మాత్రమాతనిహృదయమున లేకపోలేదు. ఉన్నను తాను జగదేకవీరుడగుటచేతను నధికబలపరాక్రమసంపన్నుడగుటచేతను సామాన్యముగా నట్టియాపదకలుగనున్నను కలిగినను నివారించుకొనగలనను ధైర్యముకూడ నతనికి గట్టిగానుండెను.

లక్ష్మణుడెప్పుడును రాముని విడిచియుండువాడుకాడు. విశ్వామిత్రునియాగరక్షణార్థమరిగినప్పుడును నీతండు వెంటనేయుండెను. ఇతండును రామునితోడ గూడ విశ్వామిత్రునిసన్నిధిని ధనుర్విద్యయునస్త్రశస్త్రప్రయోగోప సంహారములను నేర్చుకొనియెను. ఇతనికన్నయందు భక్తిమెండు. రామునితండ్రివలెను సీతమ్మను తల్లివలెను చూచియితండు సర్వదావిధేయుడై సేవించుచుండును. జానకియు రాముడునుగూడ నితని నతివాత్సల్యముతోను నధికగౌరవముతోడను చూచుచుండిరి. ఇంతకును వారు ముగ్గురును సౌజన్యమును సౌశీల్యమును గలవారగుటచేతనే వారియన్యోన్యత యంతశ్లాఘనీయమై యున్నయది. రామలక్ష్మణులకుగల పరస్పరస్నేహమునుబట్టియే వారలేకమాతృగర్భజులు గాకపోయినను నొకతల్లికి పుట్టినకవలబిడ్డలవలె వాడబడుచున్నారు. ఎవరికి కవలపిల్లలు జనించినను రామలక్ష్మణులపేరులు పెట్టుచుండుటయే దీనికి దృష్టాంతరము. నకులసహదేవులను సుప్రసిద్ధులును బలపరాక్రమవంతును సుక్షత్రియులును నిత్యస్మరణీయులునునగు కవలవారుండినను నేకమాతృపుత్రులై యన్యోన్యమైత్రిచేత బ్రసిద్ధికెక్కిన పూజనీయులు సదాస్మరణీయులునగు రామకృష్ణులుండినను కవలలకు రామలక్ష్మణులపేరులు మాత్రమే పెట్టుచుండుట వారల యత్యంతమైత్రియేకాక హేతువేమున్నది స్నేహమన్న నిట్లుండవలయును గదా! సోదరీసోదరమణులారా! నేర్చుకొనుడు! నేర్చుకొనుడు!

అట్టిరామలక్ష్మణులు పదునాలుగేడులు కాదు పదునాలుగు క్షణములైన నొకరి నొకరు విడిచియుందురా! ఉండగలరా! అందువల్లనే లక్ష్మణుడుకూడ రామునితో ప్రయాణమయ్యెను. రాముడు యోగ్యుడును సజ్జనుడునగుటచేతను వారిరువురకుగల నేస్త

ము పెంపు నెఱిఁగియుండుటచేతను రాముఁ డొక్కఁడును భార్యాసహితుఁడై యడవులకు బోవుటకంటె తనపుత్రుఁడు లక్ష్మణుఁడుకూడ వెంబడినుండినయెడల కొంతసాహాయ్యముగ నుండుననియును రామలక్ష్మణు లిరువురును సమర్థులును సమానులు నగుటచే నొకరి కొకరు సాయమై నిరపాయముగాను సురక్షితముగాను మరలపురమునకు వచ్చెదరనియు తలంచి సుమిత్ర సౌమిత్రిని నివారింపలేదు. ఆహా! ఆమె సౌజన్య మెంతప్రశంస నీయమైనది?

లక్ష్మణుని రావలదని రాముడు మొదటచెప్పెను గాని యతడుమానలేదు. నిన్ను విడిచియుండజాలననియు నీపాదపద్మములు సేవించుచు వెంటనుండనిచ్చుట కంగీకరింప వలసినదనియు లక్ష్మణు డన్నను బహువిధముల ప్రార్థించెను. సీతారామలక్ష్మణులు మునివేషముల కనువగు నారచీరెలను ధరించిరి. జపమాలికలనుతాల్చిరి. రామలక్ష్మణులు తల్లులయొద్దను తండ్రియొద్దను గురుపురోహితామాత్యమిత్రవర్గమువద్దను సెలవుగైకొనిరి. పౌరులసెలవునుపొందిరి. సీతమువ్వురత్తలసెలవును మామాగారిసెలవును గైకొని చెలియండ్రయొద్దను చెలికత్తెయలయొద్దను గూడ సెలవందుకొనెయెను. పౌరస్త్రీలసెలవునుపడసెను. లక్ష్మణునిపైనమును విని యాతనిపత్నియు సీతచెలియలునగు నూర్మిళాదేవియును భర్తతో పయనమయ్యెను గాని లక్ష్మణుడును సుమిత్రికౌసల్య మొదలగు వారలందరు తగుసమాధానములుచెప్పి నివారించిరి. వారిప్రయాణమును గురించి పౌరులలో గాని యారాజ్యములో గాని కన్నీరునించనివారులేరు. వారుమరల సుఖముగా వచ్చి రాముడు తమరాజ్యమేలునట్లనుగ్రహింపుమని యెల్లజనులు ననేకదేవతలకు మ్రొక్కిరి.

ఆసమయమున కౌసల్యా సుమిత్రల హృదయములెట్లుండునో వ్రాయనక్కర లేదు గదా! దశరథుడు కొడుకులును కోడలును తనయాజ్ఞ నందుటకై వచ్చినప్పుడు దుఃఖపరవశుడై పెద్దపెట్టున మూర్ఛిల్లెను. పాపము! దశరథునకు రామునియందెంత ప్రేమ యున్నను పాపాత్మురాలగు కైక మూలమున రాముని బహుకష్టముల పాలుసేయవలసి వచ్చెను. సత్యమునకై పుత్రుని విడిచిన దశరథు డెంతయు స్తోత్రపాత్రుడేయగును. పితృవాక్యపరిపాలన తత్పరుండై తండ్రి వరమును మారు తల్లికోరికను చెల్లింప నరణ్యమున కరిగిన శ్రీరాముడును జగన్మాన్యుడై ధన్యుడయ్యెను. కాని సవతిపుత్రుకుడను మచ్చరమున సిద్ధమైన రాజ్యాధిపత్యమును చెడగొట్టి రాముని కానలకంపిన గయ్యాళియగు కైక యొక్కతె మాత్రమే నిందనీయురాలయ్యెను. రాముని సత్కీర్తియు కైక దుష్కీ-

ర్తియు జగమెల్ల వ్యాపించెను.

భరతుడు భ్రాతృభక్తియందు సౌమిత్రికి తీసిపోవువాడు కాడు. రాముడు వనమునకు పోయివచ్చెదను. అందాక తల్లిదండ్రుల యానతి ప్రకారము నీవు రాజ్యము నేలుచుండుము. అని సంతోషపూర్వకముగా నతని యనుమతిని గొనవచ్చినపుడు భరతుడు దుఃఖితుడై రామచంద్రుని పాదములపై బడి యగ్రజా! నీవును లక్ష్మణుడును లేని నాకీరాజ్యమేల? ధర్మయుక్తము కాని జననీజనకుల యాజ్ఞ మన్నింపనేల? ఈరాజ్యమెల్ల నీయది. దీని నేలుటకు నీవె యర్హుండవు. పూజ్యుడవును దైవసముడవును జనకుని వెనుక జనకునియంత వాడవును నైన నీవడవులలో నిడుమలుపడుచుండ నేనిచట రాజ్యసుఖము లనుభవింపగలనా? అనుగ్రహించి నన్నుగూడ వెంటగొనిపొమ్ము. నీచరణసేవ నేయుచు ధన్యుడనయ్యెదను. నీపాదకమలదాస్యము విడిచి యుండజాల నని యనేక విధముల దీనుడై ప్రార్థించెను. ఆహా! భరతుని సౌజన్యము! దాశరథులందరును సుగుణులేగదా!

రాముడు భరతుని రావలదని మానిమిత్తము పొగులు జనకు నోదార్చుచు పురమున నుండుమని చెప్పెను. భరతుడు రామునిమాట కడుగుదాటనివాడు. కనుక నీపాదుకలిచ్చెదవేని వానిని నీపదములకు మారుగా పూజించుచుండెదనని వేడుకొని రామపాదుకలను గైకొని కన్నుల నద్దుకొని శిరమున నిడుకొని భక్తితో గొనిపోయి నందిగ్రామమను పురమున రాజధానిగా నివసించుచు రామచరణస్మరణము చేయుచు నతిజనరంజకముగా పరిపాలించుచుండెను. పాదుకలు భరతునకిచ్చి రాముడు సీతాలక్ష్మణులతో నడవులకు నడచెను. దశరథుడు పుత్రరత్నమగు రాముని వియోగమును నపకీర్తిని భరింపజాలక కతిపయదినములకే స్వర్గమున కరిగెను.

సీతారామలక్ష్మణులు సాకేతపురము (అయోధ్య) నుండి దక్షిణమార్గముగా నరణ్యములయందు ప్రవేశించి సంచారము సేయుచుండిరి. ఆయరణ్యములయందు వారినడుమ వారికనేకులు క్రూరులగు దనుజులు కన్పించుచుండిరి. వారందరును మనుజభక్షకులు. నిర్దయులు. భయరహితులు. మూర్ఖులు. వారుసాధువులగు ఋషులను సహోహింసించుచుండిరి. మునివేషములతో నున్నను దీర్ఘబాహువులును విశాలముఖనేత్రములును కరములజ్యాకిణాంకములును పీనవక్షములును ధరించిన ధనుర్బాణములు చెప్పక మున్నె వీరలోకవీరాధివీరులును బలపరాక్రమయుతులును నగు నుత్తమక్షత్రియపుత్రులని

చెప్పుచుండెను. మునులు కొందరు వచ్చి రాక్షసులవలని బాముపడెడుపాట్లు చెప్పుకొని దుఃఖించి రక్షింపుడని రామలక్ష్మణులను ప్రార్థించిరి. అందువలన దీనరక్షణపరాయణులగు రామలక్ష్మణులు రాక్షససంహారమునకు పూని యనేకులను వధించిరి. వారా యడవిలో నొకపర్ణశాల నిర్మించుకొని యందుండిరి.

లంకాపురాధినాథుండైన రావణుని చెల్లెలగు శూర్పణఖయను రాక్షసి తనపుత్రులను జంపిన పగదీర్చుకొనసెంచి రామలక్ష్మణుల సమీపించెను. కాని కడుచక్కని యా రాకొమరును జూచినతోడనే యా యవివేకిని యాగ్రహము మోహముగా మారెను. తుదకా కామిని రాముని చెంతచేరి తన కోరిక నతనికెఱిగించెను. రామలక్ష్మణులా విరూపిణియగు నాదానవభామిని యవ్యక్తపుకోరికకు నవ్వి పరిహాసముచేసి ముక్కుచెవులు గోసి పంపించిరి. రామునిచేత నట్లు పరాభవింపబడిన శూర్పణఖ రావణుని యాజ్ఞచే జనస్థానమును రక్షించుచుండిన ఖరాదుల కడకుపోయి తనయవస్థ నెఱిగించి వారిని పురికొల్పి రామునిమీదికి పోరాటమునకై పంపించెను. కాని రామలక్ష్మణులను గెలువజాలక యా రాక్షసులలో కొందరు పారిపోయిరి. కొందరు మడిసిరి. వారిలో ముఖ్యుడును నధికారియు నగు ఖరాసురుడును చచ్చెను. మిగిలిన సేనలోని యకంపనుడను వాడొకడు రావణుని దగ్గరకుపోయి జరిగిన సంగతి చెప్పెను.

శూర్పణఖ రాముడు తన కోరిక నిరాకరించెనని యొకకోపమును తన్ను పరాభవించెనని మరియొకకోపమును ఖరాదులను ద్రుంచెనని యొకకోపమును గలిగి మండిపడుచు రోజుచు రావణుని చెంతకుపోయి తనకు శత్రువులు చేసిన పరాభవమును రావణసేనలకు గలిగిన పరాజయమును వినిపించి బలవంతుడగు రావణునివలన రాముని జంపించి పగతీర్చుకొన నిశ్చయించుకొనెను కాని యంతమాత్రమున ఖరాది రాక్షసవీరుల నుక్కడగించిన బలశాలులగు వారితో రావణుడు యుద్ధమునకుపక్రమించునో లేదో యని సంశయించి రావణాసురుడు స్త్రీలోలుడగుటచే రాముని భార్యయగు సీత చక్కదనము సంగతి చెప్పిన యెడల తప్పక యామెను రావణుడు మాయాప్రకారమున హరించుననియు తన్మూలమున రాముడు రావణునితో పోరాడి గెలువలేక హతుడగుననియు నీవిధముగా తనపగదీరుననియు నిర్ణయించుకొని సీతసౌందర్యమును గురించి రావణుని చెంగట ననేకవిధముల స్తోత్రము చేసి వానికామె పైతమకము పుట్టించెను.

అకంపనుని పలుకులును శూర్పణఖ మాటలును విని రావణుడు రాముని సంహరించి సీతను కొనవలయునని నిశ్చయించుకొని ముందుగా యుద్ధమునకు పోవుట మంచిదా కాదాయని తనపూర్వపు మంత్రియగు మారీచుని నాలోచన మడిగెను. మారీచుడు విశ్వామిత్రియాగకాలమున రాముని బాల్యముననే యతని బాణాభిఘాతముల చవిచూచియుండెను. కావున నది తగదనియు సీతను మాయాద్వారమున హరింపవలయును గాని రాముని యెదుట నెదిరించి నిలిచిన వాడెంతటివాడైనను బ్రదుకుట దుర్లభమనియు నొక్కిచెప్పెను.

రావణునకు మారీచుని మాటలయందు నమ్మకము గలదు. అందువలన నతని యాలోచన చొప్పున సీతనెత్తుకొని వచ్చుటకే నిశ్చయించెను. నీనెత్తిమీద తేలున్నదన నీచేతితోనే తీయుమన్నటులాలోచనచెప్పిన మారీచునే యాఘనకార్యమున సహాయము చేయవలసినదని రావణుడు కోరెను. రాముని పేరు తలంచినంతమాత్రమున గడగడలాడు మారీచుడాపనికి రానననెను. రావణునకు కోపము వచ్చెను. తనకెదురాడిన మారీచుని వధింప చేతిలో చంద్రహాసము ఝుళిపించెను. మారీచుడు వడంకెను. నిష్కారణముదుష్టుడగు వీనిచేతిలో చావనేల పుణ్యాత్ముడగు రఘువీరుని చేతిలోనే చచ్చెదనుగాక యని యతండు తలంచి రావణునికి సాయముచేయ సమ్మతించెను.

మారీచుడు మాయావి. కామరూప. అతడు బంగారులేడియై సీతయున్నవనములో మేతమేయుచుండెను. సీతయాముద్దులేడిని తనకు పట్టియిమ్మని రాముని వేడెను. రాముడు తెచ్చియిచ్చెదనని చెప్పి లక్ష్మణుని సీతనుకాచుచుండవలసినదనియుంచి దానిని వెంబడించిపోయెను. ఆలేడిదొరకక దూరదూరముగా రాముని గొనిపోవుచుండెను. అదిమాయలేడియై యుండనోపుననియు నింతవింత యాకారముగలలేడినిదివరకెన్నడైన గనివినియెఱుంగుదుమాయనియు రామునిపోవలదనియు సీతను దానికై రాముని శ్రమపెట్టవలదనియుచెప్పెను గాని యిరువురును వినలేదు. లేడి రాముని చూపుమేర దూరముకన్న నెక్కువమేర కలయించుకొని వెళ్లెను. రాముడికపట్టువడదని యెంచి దానిచర్మమైన సీతకిచ్చెదగాకని యొకబాణముతో దానినాటనేసెను. ఆవ్రేటుదిని యది మాయామృగము కావునను నది యదివరకే పన్నుకొనిన పన్నుగడ గావునను 'హాలక్ష్మణా' యనిబిగ్గరగా నరచుచు నాలేడి నేలగూలి ప్రాణములు విడిచెను. ఇదియేమి యాశ్చర్యమని యెంచుచు రాముడాలేడిని గైకొని పర్ణశాలకు వచ్చుచుండెను.

లేడిసోటినుండివచ్చిన లక్ష్మణాయను యార్తనాదము రామునికంఠస్వరమువలె నుండెను. అది సీతాలక్ష్మణులకువినబడెను. సీత రామునికేదియో యాపదసంభవించి యుండుననియు వెళ్లిరక్షించిరావలసినదనియు దైన్యముతో చింతాక్రాంతయై వేడుకొనెను. అది దానవమాయ యనినిశ్చయించుకొన్న లక్ష్మణునకందువల్ల నేమియు తొందర గలుగలేదు. రాముడు మహావీరుడనియు నతనిపరాక్రమము నీవెఱుంగవనియు నతనికేమి యుభయములేదనియు లక్ష్మణు డనేకవిధములు చెప్పెనుగాని సీత కామాటలెవియు చెవుల జొరవయ్యెను. నిజముగా భర్తకేదియో గొప్పయాపదవచ్చినదని యామె నమ్మెను. అందువల్ల లక్ష్మణుని నిష్ఠురోక్తులాడి రాముడేగినమార్గమున బంపించెను.

ఇప్పుడు జానకి పర్ణశాలయందొంటరిగానుండెను. ఆసమీపముననే పొంచి యుండి చూచుచున్న రావణాసురుడు యతివేషముతో సీతయింటికివచ్చి భిక్ష పెట్టుమనివేడెను. సీతకు మునులను యతులను పూజించుటయందును సేవించుటయందును నాసక్తిమెండు. అందువల్ల వినయముతో నమస్కరించి దీవెననందికొని భిక్షము తెచ్చి పెట్టెను. ఆమె చక్కదనముచూచి యాయతివిమోహితుడయ్యెను. ఆలసించిన లాభములేదని వెంటనే తననిజరూపమును దాల్చెను. ఆయతీశ్వరుడిట్లకస్మాత్తుగా పదితలలును నిరువదిచేతులును రెండుపాదములునుగల భీకరాకృతిగల రాక్షసుండగుట చూచిన తోడనే జానకి భయమున మూర్ఛిల్లెను. ఇదియే సమయమని రావణుడు సీతను తన విమానమునందిడుకొని లంకాపురమునకు కొనిపోవుచుండెను.

సీత కొంతసేపటికి మూర్ఛతెలసి తన్నొకరాక్షసుండు దొంగిలించుకొని పోవుచున్నాడని తెలిసికొని తానప్పుడేమియు చేయజాలక తత్తరముచెంది దుఃఖమున కన్నీరు వరదలై పారనేడ్చుచు రామలక్ష్మణులను సంబోధించి మొరపెట్టెను. రాఘవులజాడ యెచ్చటను గానరాకపోవుటయు విమాన మప్పుడే, బహుదూరముపోవుటయు చూచి సీత యప్పుడు వారావీరాయని యడవిలోనిమునులను చెంచులను దేవతలను పక్షులను మృగములను చెట్లను కొండలను నదియిది యనక కనుపడ్డప్రాణినెల్లను వస్తువునెల్లను రక్షించుమని తన గోత్రనామాదులతో తన్నెరింగించుచు దనుజుడెవ్వడో యెత్తుకపోవుచున్నాడని తెల్పుచు మొరపెట్టెను.

రావణుడు బలవంతుడగుటచేతను దుర్మార్గుడగుటచేతను వాని నెదిరించి గెల్వజాలకయు వాని నిదేమనిమందలించి యాక్రూరకృత్యమునుండి మరలింపజాలకయు నెవ్వరును

సీతకు సాయముచేయరాక యుపేక్షించిరి. కాని జటాయువను పక్షిరాజొకడు దశరథునికోడలనియు రామునిభార్యయనియు రాక్షసుడెత్తుకొని పోవుచున్నాడు రక్షింపరే యార్తరక్షణపరాయణులారా! దీనరక్షణవ్రతదీక్షితులారా శరణాగతత్రాణబిరుదాంకితులారా యనియు వేడుకొను సీతవాక్యములువిని రయంబున విమానమునకెదురుగావచ్చి ఓరోరి రాక్షసాధమా! రావణానిలువుమునిలువుము. పక్షిరాజగునీజటాయువును గెలిచి మరికదలుము. లేదేని నిన్ను గదలనీయనని బీరములాడుచు రెక్కలతోడను ముక్కులతోడను రావణుని హింసించుచు పోరాటకు సిద్ధమయ్యెను. రావణుడాఖగేంద్రునితో నొక్కింతసేపుపోరి మహాబలవంతుడగుటచే నాతని రెక్కలు తెగగొట్టిజయించెను.

జటాయువు నేలంగూలికొన ప్రాణములతో దాశరథులకీ వృత్తాంతము చెవిని వేయవలయు ననెడి యాసతోనుండెను. రావణుడు సీతనుజూచి సుందరీ! చూచితివిగదా! అతిబలవంతుండగు నీ ఖగరాజు నాతోడ క్షణకాలమైనను పోరలేక సగముచచ్చి పడియున్నాడు. నాపరాక్రమమున కిదిగురుతుగదా! నేను ముల్లోకములను జయించితిని. దేవతలు దిక్పాలకులు నేనన్నగడగడలాడుచుందురు. నాకుసకలైశ్వర్యములును గలవు. ఇంద్రునిరాణి మొదలగువారు మాయింటనూడిగము చేయుచుందురు. ఇట్టి నన్ను మనుష్యమాత్రుడగు రాముడు గెలువనేర్చునా! మేము మనుష్యాశనులము. నరులు మమ్ము జయింపగలుగుదురనుట పరిహాసాస్పదముగాదా! అని తనను తానె పొగడుకొనుచు లంకాపురికి పోవుచుండెను.

మైథిలి తన్నప్పుడిక రక్షించువారెవరును గానరానందున తన యొంటినున్న యాభరణములను దీసి చీరచెరగుచించి దానినిగట్టి యవి ఋశ్యమూకపర్వతముపయిని వేసెను ఆనగలచ్చటివారుచూచి యాదారినివచ్చిన రామునికానవాలిచ్చినయెడల తన్నీమార్గముగా నెవ్వడో యెత్తుకపోయినాడని రాముడు తెలిసికొనునని యట్లు చేసెను. ఆపర్వతమున సుగ్రీవుడను వానరరాజును నతనిభటుండగు హనుమంతుడు మొదలగువారుండిరి ఆనగలుమూట వారికిదొరికెను.

రావణుడు జానకిని లంకాపురికి గొనిపోయి తన వైభవమంతయుచూపి యప్పుడైన తన్ను వలచునేమో యని చూచెనుగాని సీత నిర్మలహృదయురాలు. పరమపతివ్రత రాముడే దైవమని యామె నమ్మియుండెను. ఆసతీమణి మనస్సు రామునియందు లీనమైయుండెను. రాముడు లేనిసంపదలెల్ల తృణముగాదోచుచుండెను. ప్రపంచమే లేనట్టులుం

విందుఁడనై భారతమాతృసేవసేయుచు నుండఁదలచితిని. కనుక నన్నుమన్నించి కాపాడు భారము మీయది. (అని గౌతముని పాదములమీఁదవ్రాలి) ఇఁకఁ బాలముంచినను నీటముంచినను మీదేభారము. మీపదకమలములను విడువఁజాలను. నాకు మీరే దిక్కని వేడుకొనుచున్నాను. రక్షింపుఁడు. రక్షింపుఁడు.

దుర్గదా—

ఆ. వె. అగ్గిబడినఁగాని ♦ బుగ్గిఁబడినఁగాని
యల్పకుఁడగు నోకో ♦ యార్యకులుఁడు
కుక్కయానెగంగి ♦ గోవుగానెటులెన్ని
క్రియలఁజేయునైన ♦ వృత్తిఁబాసి

సలీము—పురుషసింహములారా! అజ్ఞానమునఁ జేసినయకృత్యములకై జనుఁడు జ్ఞానియై పశ్చాత్తాపపడినదియే వేయినిష్ఠుల కుండములఁబడుటకన్న నుత్కృష్టమైన ప్రాయశ్చిత్తమని యార్యులుబోధింతురు.

గౌతమ—

తే. గీ. చేతులంగాల్చికొని తరు ♦ వాతనాకు
లేరి చేఁబూనిననుఁ గల ♦ దేమిలాభ
మట్టులన్యమతస్థుఁడ వైపరాభ
వంబుఁబొంది పశ్చాత్తాప ♦ పడిననౌనె?

సలీము—కరుణాకరా! మీరును నాయందిట్టికఠినహృదయముఁ బూనఁదగదు ఓదీనరక్షకా! నేను మీచేతఁగూడ ననాదరింపఁబడిన నిఁక నిహమునందు బ్రతుకజాలను. రక్షింపుఁడు. రక్షింపుఁడు. రక్షింపుఁడు.

గౌతమ—(కరుణాంతరంగితుఁడై చిరునగవుతో) సుజ్ఞాననిధీ! నీవెఱుఁగని ధర్మాధర్మములెందు నుండఁజాలవు. కనుక

ఆ. వె. ఆర్తియెట్టిదైన ♦ నభయంబుఁగోరిన
నాదరముననతని ♦ కభయమొసఁగ
వలయుఁగాని మున్న ♦ భయమిచ్చి పిదపన
య్యర్థితప్పులెన్న ♦ నఘమటండ్రు

దానఁజేసి నేనీసలీమును మన్నించి మదీయసైన్యవర్గముల కధిపతిఁగాఁ జేసెదఁ గాక.

సలీము—(మహానందభరితుఁడై కేలుమోడ్చి సవినయముగా) మహాప్రభూ! నాకిది సర్వోత్కృష్టమైన వరరాజము. శిరసావహించితిని.

గౌతమ—మంచిది. నేఁటినుండియును నీవు నీకార్యములయందప్రమత్తుఁడవై మెలఁగుచుండుము. కూర్చుండుము.

సలీము—చిత్తము. (అనికూర్చుండును)

(అంతఁ దెఱలో గలకలము)

అహో! అగ్గిశపుర సైనికులారా!

మ. విమతుఁడ్వైరులమేముకాము ధరణీ ♦ భృత్స్నేహముంగోరివ
చ్చిరరాజన్యులమింక మీధవునకుం ♦ జేటుంగనేఁబోయి "దర్శనముంజేయ నభీష్టుఁడై యిచటికే ♦ సైన్యాంగముఁగూడి తా
సనియెన్ యోధపురీశుఁడంచనుఁడి ని ♦ స్సందేహముంబొందుఁడీ.

గౌతమ—(ఆత్రముతో) బావా! ఏమియీకలకలము. ఆలకింపుము.

(అంతనందఱును నిశ్చేష్టితులై యాలకించుచుందురు)

ప్రతీహారి—(ప్రవేశించి) దేవరకు జయమగుఁగాక

గౌతమ—(ఆత్రముతో) హజారమున నాకలకలమేమి?

ప్రతీహారి—దేవా! యోధపురాధిపుఁడు సైన్యసమేతుఁడై దేవరదర్శనార్థమై వచ్చుచుండుటను మనసైనికులు దూరమునుండిచూచి వైరులనిభ్రమించి యాసేనితోఁ గయ్యమునకుఁ దలఁపడిరి.

గౌతమ—తరువాత?

ప్రతీహారి—అంతనవ్విభుండు మనసైనికులుతమ్మశత్రువులగా భ్రమఁపడిరని యెఱింగి "నేను మీరాజునకు మిత్త్రుఁడనై రాజపుత్త్రుఁడనగు యోధపురనాథుఁడఁగాని విరోధిఁగాన"ని తెలిపి మనసైనికులనెల్లరను శాంతచిత్తులఁజేసి వారలచేఁ బూజింపఁబడి ద్వారముఁజేరి మీకుఁ దమవచ్చుట నెఱిఁగింపనై నన్నిటకు పంపిరి.

గౌతమ—(సగౌరవముగా) అయ్యో! మనసైనికులాభూపతికట్టి ప్రమాదమొనరించిరి. నీవుపోయి సత్వరంబుగ నయ్యాపనృపునిందుఁ బ్రవేశపెట్టుము.

ప్రతీహారి—చిత్తము. (అనివెళ్ళుచున్నాఁడు)

గౌతమ—(సాదరముగా) బావా! యౌధపురీంద్రుఁడిటకు వచ్చి ద్వారమునందు మనకొఱకు వేఁచియున్నాఁడుట. కనుక నాతని నెదుర్కొని తోడికొనివత్తమురమ్ము.

దుర్గదా—మంచిది. కానిమ్ము.

(గౌతమదుర్గదాసులెదురేగుదురంత)

అభయ—(ప్రవేశించి చిరునగవుతో సవినయముగా)

మ. పురె! శ్రీభారతమాతృగర్భకలశాం ♦ భోరాశిరాకాసుధా
కర! ఘోరారిమదాంధకారవిజితా ♦ ఖండప్రపూర్ణప్రభా
కర! భూపాలజనానువర్ణితమహా ♦ కల్యాణసంపద్గుణా
కర! జోహారులుగౌతమప్రభు సమా ♦ ఖ్యా! దీనసంరక్షణా!

(సాష్టాంగవందనమాచరించును)

గౌతమ—(చిరునగవుతో) కుమారా! లెమ్ము. లెమ్ము. (అనిసాదరముగాలేవనెత్తి) నీవీసింహాసనమధిష్ఠింపుము.

అభయ—(సహర్షముగా) ఆర్యులారా! మీరును మీయాస్థానముల నలంకరింపుఁడు. (అందఱునుఁ గూర్చుందురు)

గౌతమ—(సహర్షముగా)

తే. గీ. బంధురాజీవమిత్త్రినీ ♦ వచ్చుటరయ
నస్మదాత్మకు సంతోష ♦ మబ్బఁగలిగె
నేనుధన్యుఁడనైతి న ♦ హీనసత్త్వ
మెద్దియంటి నొకంటిని ♦ న్నిందునేఁడు.

అభయ—(సవినయముగా) ఆర్యవరేణ్యా! 'మీకునాయందుఁగల యనుగ్రహము యవజేసి యిట్టులంటిరి.

గౌతమ—రాజసింహా!

తే. గీ. పెద్దకొడుకు చావుఁదలఁచి ♦ బెంగటిల్లు
తల్లికాదుఃఖమున్మాపఁ ♦ దగినసేవ

సేసి మఱపించి ముదమొందఁ ♦ జేసిచాల
దీవనలఁబొంది శుభముల ♦ నీవుఁగనుదె?

అభయ—(సవిచారముగా) నాశక్తి కొలంది నా మెకేకో అంతయునుఁ గోరంతై నను రానీక సేవసేయుచుంటిని. అయినను

తే. గీ. కాలవశమునఁ బ్రాపించు ♦ కష్టములకు
బెంగటిలి యెవరేమి స ♦ ల్పాఁగనేర్తు
రమ్మ దుఃఖింపఁ బ్రతుకునే ♦ యన్నమఱల?
విధివశంబిట్టిదేకద ♦ విబుధవర్య!

గౌతమ—(సవిచారముగా) అవును. పాపము నీవు చెప్పినదియును నిజమే అయినను

ఆ. వె. తనకుపుట్టికట్టి ♦ తనయులిద్దఱియందుఁ
పెద్దవాఁడు సాధు ♦ వృత్తివాఁడు
నార్తరక్షుఁడును ♦ హాయపరాక్రముఁ
డీల్గఁదల్లిదుఃఖ ♦ మెన్నదరమె?

అభయ—సత్యమేకాని మేమెందుకారణమునఁ జేసి యాదుఃఖముందిగఁద్రావి సంతసించుచుంటిమి. అదెద్దియన

చ. అలఘుఁడు ధర్మవర్తనుఁడు ♦ దంచితకీర్తి బలాఢ్యుఁడగ్రజుం
డెలమిఁబరోపకారమున ♦ కేగిపరానులతోడఁ బోరుచోఁ
దలఁపఁగదేశభక్తియును ♦ ధర్మముఁదప్పక వీరనాకముం
గెలిచెనఁటంచుఁ బాసితిమి ♦ కేవలమవ్వగపేముఁ బూజ్యుఁడా!

గౌతమ—

తే. గీ. తలఁపనితలఁపుగానిట ♦ కెలమినెపుడు
రానివాఁడవు నేడిందు ♦ రాగతంబ
దేమొకో యెఱిగింపుమో ♦ యుద్ధచరిత!
యీవుకోరినదేదేఁ ♦ నేనొసఁగుదు.

అభయ—(సాభిలాషగా) రాజచూడామణీ! నేఁ గోరునది నీయెడల నతిస్వల్పవాంఛయగును. నీకది తృణప్రాయమేయయినను మాకగప్రాయముగా నున్నది. అదెద్దియనినఁ జెప్పెదను వినుము.

చ. అలఘునిమత్సహోదరుని ♦ నాలములోన నధర్మబుద్ధితోఁ
దలఁపడిచంపినట్టి బహు ♦ దారుణకర్మతులైన మ్లేచ్ఛులన్
సలమునఁబట్టి కూల్పనతి ♦ సాహసమొందితినైనగాని నా
తలకది పెద్దయెత్తుకద ♦ దైవమిఁకెట్టులు సిద్ధినిచ్చునో?

ఇంతియకాదు. దీనికన్నను భిన్నమైనను ముఖ్యకారణము వేఱొండుఁ గలదు. అదియుఁగూడఁ జెప్పెద నాలకింపుఁడు.

తే. గీ. వరపతివ్రతయైన యీ ♦ భరతమాత
యకట! కులటను వంచించు ♦ నట్టులామె
సుతులమైనట్టి మనముందె ♦ చూడరాని
సిగ్గుఁబఱచుచున్నారి ♦ నీ పతాన్లు.

ఉ. కావున, నోనృసింహ! ననుఁ ♦ గాదనియూఱటఁబల్క కాలమం
దీవుసహాయమిచ్చి రిపు ♦ లెల్లరఁబట్టివధించి దేశభ
క్తావళు లందఱుఁగీర్తిదగ ♦ వందుము పెంచుము ధర్మమిద్ధరన్
భూవరలోకమందుఁ బరి ♦ పూర్ణయశోవిభవోజ్జ్వలుండవై.

గౌతమ—(సహర్షముగా) రాజకంఠీరవా? నీవిందుఁ గోరఁదగినదేమియున్నది. నీవు వధింపఁగోరినవైరులు నాకమిత్రవైరులు. వారు నీ కొకటిరెండుకారణములచేత నే శత్రులైరి. కాని. నాకు మూడునాలుగు కారణములచేఁ గూడఁ బగతులైర, అదియన్నియును నీకు మనదుర్గదాసు చాలఁగఁ జెప్పఁగలఁడు.

దుర్గదా—(అభయచందునకభిముఖుఁడై)

తే. గీ. అప్పతానులు చెల్లింపు ♦ మన్నకప్ప
మెల్లఁజెల్లింపఁగాలేక ♦ యువ్విభుండుఁ

బొమ్మనొక్కట్టి ఘోరంబు ♦ వలదఁటంచుఁ
జెప్పిరమ్మని నన్నంపెఁ ♦ జెలిమిఁదలఁచి.

అభయ—(సాదరణముగా) పాదుషామీవేడికోలు నంగీకరించెనా?

దుర్గదా—అటులయిన నింతవైరమునకు కారణమేలేదు.

అభయ—నాజరతికరుణార్ద్రహృదయుండనియును సాధుస్వభావుండనియును యుక్తాయుక్తవిచక్షణుఁడనియుఁ బ్రజలుచెప్పుదురే. అట్టివాడిట్టులు మోమోటమునుఁ బాయఁజాలెనా?

దుర్గదా—కుమారా!

చ. మణియమలంబయైన నహి ♦ మస్తకమందు వెలుంగుచుండుటం
గణనకురానియట్టులిలఁ ♦ గాంతుఁడుసజ్జనుఁడైన నాశ్రితా
గుణజనులాడు చెడ్డపలు ♦ కుల్విని దుర్మతియౌనుగావునన్
గుణియుతఁడయ్యు మంత్రికుల ♦ కుత్సితబోధలచేఁ జెడెంజుమీ.

అభయ—(సాభిలాషముగా) తరువాత నేమిజరిగినది?

దుర్గదా—నాపలుకులాలకించి పాదుషాబిట్టులిఁగి యప్పుడు తనసమ్ముఖమందునన యయోధ్యాపురపాలకుఁడయిన జలాలుద్దీ నను ఖానిసీయు నొక నిక్కగళ పురముమీఁదికి దండువెడలి తత్పురాధీశ్వరునివంచించి తనకరినొసంగునటులు 'చేయుమని యాజ్ఞాపించెను.

అభయ—(చిరునగవుతో) సరి. సరి. కోదమసింగము నెదిరింప నొక శుండాల మునసిపినటులున్నది.

గౌతమ—(లేనగవుతో) నృసింహా! ఈయోధపురుషసింహుఁడు తననిశితాసిధారాహతింజేసి పాదుషా కీమాటఁదోఁపించియే వచ్చినాఁడు.

అభయ—అవునవును. క్షాత్రతేజమునకిది యొక క్రొత్తవింతకాదు. తరువాత?

దుర్గదా—అటులా పాదుషాచే జలాలుద్దీ నాజ్ఞాపితుఁడై నిజరాజధానికేతెంచి దళములఁ గూర్చుకొని యిప్పురీమతల్లిని భంగపఱుపనై వచ్చి తానేభంగపడివచ్చినదారిఁ బాసి చాఁటితోఁ పలనుసురులమీఁది యాసచే నాత్మయపురోన్ముఖుఁడై పారిపోవుచు నాసమయమునఁ దన్ను వెన్నంటిరాఁజాలని నిజసైన్యమును కొంతనాగంగానదీ తీరమందు

బక్సరుపట్టణసమీపమున విడచి సైన్యమ్ముదిగరండని చెప్పి తాను మాత్రము సత్వరముగనిలు సేరి సురక్షితుఁడయ్యెను.

అభయ—(ఆత్రముతో) ఆబలములఁబట్టి మీరుకడతేఱుపక యూరకుండిరా?

దుర్గదా—అప్పటికిమాత్రము—(అని సగము చెప్పి మిన్నకుండును.)

అభయ—(మోముఁజిటిలించి విచారముతో) అయ్యో! ఎంతప్రమాదమెంతప్రమాదము!

తే. గీ. దండతాడనమొనరింపఁ ♦ దాళలేక
పాఱిపోయిన విడతురే ♦ పామునెందు?
విడచిపుచ్చిన నయ్యది ♦ విడచునొక్కొ
ప్రాతపగనెల్లఁ జెప్పుమా? ♦ భవ్యచరిత.

దుర్గదా—(సహర్షముగా) నీవు చెప్పినదినిజమే. కాని. వెన్నిచ్చినవారిని మన్ను పాలొనరించుట క్షాత్రధర్మముకాదని మా రాజర్షిపుంగవుఁడు సాహసింపలేదు. అయిన నాపనియు ననతికాలము లోపలనే నీవలననేముగింపఁబడినది.

గౌతమ—(సరోషముగా) ఇంతకును వారికింకనుగర్వభంజనముకాలేదు. దానఁ జేసి యాకృతఘ్నులియ్యఁగల రాజ్యభూములఁ దిఱుగఁద్రొక్కకమున్నే మేమేపోయి వారికి సంపూర్ణగర్వభంజన మొనరించిరావలెనని దండయాత్రకు సంసిద్ధులమగుచుంటిమి ఇట్టితఱుణమందుఁ గాక తాళీయన్యాయముగ నీవును వారిమీఁదికే దండువెడల నైసైన్యములఁగూర్చికొనివచ్చి మాకెందత్యంతాప్తుఁడవైతివి.

దుర్గదా—(సహర్షముగా) కనుక

తే. గీ. అగ్నిదేవునకాప్రియం ♦ డానిలుండుఁ
దోషపడి వనమెల్లను ♦ బూడిదఁగనఁ
జేయునటులీవు నీరాజ ♦ సింహుఁగూడి
ప్రాణికాల్చుటబ్బురమె ప ♦ శానువనము?.

అభయ—(నిర్లక్ష్యముగా)దానికేమి? అదియొక లెక్కలోనిది కాదు. ఇంతకు నయోధ్యాఢిల్లీపురములందుఁ బగతురఁ జేయు యుద్ధసన్నాహముల జాడలేమేనియుఁ జారులమూలమునఁ దెలిసికొంటిరా?

దుర్గదా—(సాదరముగా) ఆయాప్రాంతములకేగిన చారులింకను రాలేదు. ఇప్పుడో యింకనో వచ్చెదరు. వచ్చిరేని వారలమూలమున నవిమనకు సాంతముగాఁ దెలియఁగలవు.

ధీరసింహ—(ప్రవేశించి) మహారాజా! జయము. జయము.

గౌతమ—(సాదరముగా) ఓయీ! నీ వెందుండివచ్చితివి?

ధీరసింహ—(సవినయముగా) మహాప్రభూ! అయోధ్యాఢిల్లీపురములకేగి యట నుండి ఆరావలీ పర్వతప్రాంతములకుంజని వచ్చితిని.

గౌతమ—(సాభిలాషగా) ఆయాస్థలములందలి విశేషములేమి?

ధీరసింహ—దేవా! ఆనాఁడటులాగంగానదీతీరమునందు ఏలికచే వంచింపఁబడిన పఠానుల కోఁడగు జలాలుద్దీనుఁ డెట్టులో చావుఁదప్పి యిలుసేరికొని యంతటితో నైనను లజ్జఁజెంది మిన్నకుండక మఱలఁ గ్రొత్తబలములను సమకూర్చికొని యాసైన్యముల నన్నిఁటిని రెండుపంతులుగాఁజేసి యందొకపంతున కాజహారుద్దీను నే నాయకునిఁగాఁజేసి యాతని నైదారు దినములలోఁబోయి యర్గళపురమును ముట్టడించి కొల్లబెట్టవలసినదని యాజ్ఞాపించెను. ఆతండునుఁ దనయేలికయాజ్ఞానువర్తియై రేపో నేఁడో మనపురముమీఁదికి దండు వెడలిరానైయున్నాఁడు.

గౌతమ—(రౌద్రముతో) మంచిది. కానిమ్ము. ఈతూఱి వారికి నామరూపములు రెండును లేకుండఁజేసెదను. తరువాత?

ధీరసింహ—తరువాత నో ప్రభూ! మిగిలిన సాఁబాలుబలమునకుఁ దానే యధిపతియై గంగ కావలియొడ్డున నే యొరులెఱుఁగకుండునటులు తానుఁ దనసైనికులును సార్థవాహులవేషములఁ దాలిచి చాలఁదూరము నదికెదురేగి యట నావాహినిం దాటి చిత్తూరుప్రక్కలనుండి యారావలీగిరిప్రాంతములకుపోయి యందుగూఢముగాఁ దమకు వలయు సామగ్రిని దాచికొని యటనుండి యకస్మాత్తుగఁ జాటుత్రోవల నడవులంబడివచ్చి మన పురంబును ముట్టడింపఁదలఁచి యయోధ్యనుండి నేఁడే పయనమై పోవుచుండెను.

అభయ — (రోషాశ్చర్యములతో) ఆ. ఆ. ఎంతఘోర మెంతఘోరము.

దుర్గదా — (కోపముతో) ఘోర మేకాదిది ద్రోహముకూడ ననుము.

గౌతమ — ఓయీ! ఈద్రోహమంతయుఁ బాదుషాకుఁ దెలియునా?

ధీరసింహ — రాజేంద్రా! పాదుషా సానుజనాదరణీయుండఁట. పరశ్రీనభిలాషియఁట. సద్ధర్మవర్తనుఁడట. వేయేల. ఆతఁడు కేవలరాజయోగియఁట. ఆతండు తన్నువోలెఁ దనమంత్రులు నట్టివారేయని నిజనమ్మి సర్వదా రాజ్యభారమును వారల చేతులలో నిడి తాను నిమిత్తమాత్రుఁడైయుండునఁట. ఆమంత్రులందఱుఁ బరమదురాగ్రహులఁట. ఆనాఁడు మనదేవరవారి సచివాగ్రణియందుఁబోయి సంధిఁజేయ నెంచి నేనేమో యుక్తియుక్తముగఁ జెప్పుచుండ నామాటల నాపాదుషా విని యాదరింపకపోవుటకు కారణమంతయును వారాతనికి బోధించిన బోధయేనఁట. చెప్పఁజెప్ప నాబ్రహ్మకైనను బుట్టు రిమ్మతెగులనునట్టులా కుమంత్రులు దయాస్తమయకాలములందుఁ జెపనిల్లుఁగట్టుకొని దేవరమీఁది యసూయచే నేవియో యున్నవి కొన్నియును లేనివి కొన్నియు నవసరానుకూలముగఁ గల్పించి చెప్పి పాదుషాకెట్టెటో దేవరమీఁదఁ గోపమొదవింపఁ జేసియయ్యదనునందే పైకేమియు నెఱుఁగనట్టులు నటించుచుఁ జాటుననయ్యయోధ్యాపురాధిపతియగు జలాలుద్దీనుతో నేమేమో బేరములాడి లంచములంది యాజలాలుద్దీను కగ్గళపురముమీఁద దండువెడలనై యాపఠానుల రారాజులచే నాజ్ఞాపత్రమిప్పించిపంపిరఁట. కాని యాదినము మొదలీదినమువరకుఁ జరిగినవిషయములలో నొండయినను బాదుషాకు మాత్రము శ్రుతపఱచిరి కారఁట.

గౌతమ — ఏల చెప్పలేదు?

ధీరసింహ — పాదుషా యుదారబుద్ధిగలవాఁడగుటచే నంగుఁ గలన్యాయాన్యాయముల నెఱింగనేని దేవరతోఁ బోరునకియ్యకొనఁడని తలఁచియేనఁట.

గౌతమ — పాదుషా యియ్యకొననేని వారికేమిలాభము కలదు?

ధీరసింహ — పఠానులు మనపురము నవలీలగ ముట్టడించి కొల్లఁబెట్టఁగలరనియు నద్దానఁజేసివచ్చినధనములోఁ గొలఁదిమాత్రమే పాదుషాకుఁ జూపించి యిదియే వచ్చినదని చెప్పి యాసొమ్ము నే బొక్కసమునఁ జేర్చి మిగిలినదానినంతయుఁ దమలోఁ దాము పంచికొని యనుభవింపవలయుననియుఁట.

సలీము—(సవినయముగా) దేవా! నాయనుభవమునఁ జేసి నేనీతని చెప్పుటలు ముమ్మాటికిని సత్యములని నొక్కి వక్కాణింపఁగలను.

దుర్గదా—(రౌద్రముతో) శత్రురాజసర్పములకీశ్వరవేఱయిన దుర్గదాసిటనుండె నని యప్పఠానులెఱుఁగరో?

అభయ—(క్రోధముతో) ఆమ్లేచ్ఛమృగసమూహములనెల్ల నొక్కుమ్మడినిఁ గీటడంపఁజాలునరసింహుఁడిందుండెనని వారికైన నెఱిఁగియుండెదరుగాక!

గౌతమ—(క్రోధావేశపరవశుఁడై) ఓ రాజపుత్రాన్వయోద్ధారకపురుషసింహములారా! ఇదికదా మనపౌరుషమును వెల్లడింపఁదగిన సమయము. లెండు, లెండు. మీమీయాయుధములఁ బూనుఁడు. సైన్యసమేతులై యాద్రోహులైనపఠానులతోఁ బోరఁ బయనముఁగండు. త్వరఁబడుఁడు; రండు; రండు. (అని పోఁబోవును)

దుర్గదా—(చిరునగవుతో గౌతముని చేయిఁబట్టుకొని వారించి) ఓ రాజర్షికంఠీరవా! మనము పోవునదిపుడాలమునకుకాని మేలమునకుకాదు. కనుక వెనుకముందులఁగలమంచిచెడ్డలనామూలాగ్రముగ నాలోచించుకొని వాటికవసరమయిన ప్రతిక్రియలఁజేసికొని తగు బలములఁగూర్చికొనినఁగాని దున్నపోతీనదనిన దూడనుఁ గట్టుమనినటు లనాలోచితముగఁ దలచినపుడే పోఁదగినదికాదు. వినుము. శాంతింపుము.

అభయ—అవునీనగోత్తముఁడు చెప్పినది సమంజసముగా నున్నది.

గౌతమ—మంచిది. నీవు చెప్పినచొప్పుననే చేసెదఁగాక. దేవపూజవేళయయినది. నేఁటికీసభఁజాలించి యంతిపురమున కేగుదము.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

(అంతనవనికజారును)

ఇది తురీయాంకము.

---

# రాజపుత్త్రవిజయము

## పంచమాంకము.

### ప్రథమరంగము—అర్గళపురరాజవీథి

[మణిసింహుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మణిసింహ—(సహర్షముగా) అదిగో కర్మసాక్షియైన జగద్బంధువగు భగవానుండు సూర్యుఁడుదయాద్రి నలంకరించుచున్నాఁడు.

మ. చనునే నాయపహోకుమందవలిసీ ♦ సాధ్వీమణిన్ మద్ప్రియం
గని రాత్రించరుఁ డెగ్గుసేసెనఁట యూ ♦ కంజారిదోషాకరున్
వినతున్ వేఁజనిరూపుమాపెదనిదే ♦ పెంపెక్కుదర్పంబుచే
ననియే తెంచెననంగఁ దోఁచె హరిపూ ♦ ర్వాద్రిన్ సరాగంబుగాన్

ఇఁక నేను నిత్యకృత్యములను నిర్వర్తించుకొని యమాత్యాగ్రణియగు దుర్గదాసు గారిపంపున నారావలీగిరిప్రాంతములందున్న స్వామియగు గౌతమనరేంద్రుని సందర్శించి పురవార్తలను విన్నవింపఁ బోవలయును. (కొంచెము ముందునకేగి) అవచ్చుచున్నవాఁడు నాసఖుఁడగు ధీరసింహునివలె నున్నాఁడు. (వికాసముతో) ఆతని నొకసారి కలిసి ముచ్చటించి మఱియుఁ బోయెదఁ గాక,

ధీరసింహ—(ప్రవేశించి స్వగతము) నాయనుంగుచెలికాఁడగు ధీరసింహుఁడా గంగాతీరమునకు స్వామితోఁ గూడబోయి పరాములనుక్కడంచి వచ్చెనని వినియుంటిని. ఇపుడాతనికడకేగి యచటివింతలెల్లఁ గర్ణానందముగా నాలకించెదఁ గాక. (కొంచెము ముందునకునడచి సంతోషముతో) అదిగో వెదుకబోయిన లత తనకాళ్ళకేయడ్డుపడినటు లెవనిఁగూర్చి నేఁబోవుచుంటినో యతఁడే నావైపునకే వచ్చుచున్నాఁడు. (సహర్షముగా) ఆహా! నేఁడు నేను నిదురనుండి లేచి యెట్టిసుముఖమాలోకించితినో కదా. (ప్రకాశముగా) మిత్త్రమా! మణిసింహా!

మణిసింహ—(ఆలకించి ప్రకాశముగాలేనగవుతో) ఓహో! నాప్రాణసఖుఁడు ధీరసింహుఁడా, మిత్త్రమా! ఇటురమ్ము. (ఇరువురుఁ గౌఁగలించుకొందురు)

ధీరసింహ—(ససంభ్రమముగా) మిత్త్రమా! నీముఖారవిందసందర్శనమబ్బ నన్ని దినములును నాకండ్లుకాయలుగాచెనటులుండెను సుమా. చేయుదమన్న నేపనియుఁదోఁచకుండెను. నేఁడునిన్ను కన్నాఱఁగనుటచే నమితానందభరితుఁడనైతిని. నష్టద్రవ్యలాభము నొందినటులు సంతసించుచుంటిని. ఇదినీకు నిజముగఁ బునర్జన్మమునొందుట వంటిదేసుమా.

మణిసింహ—(నిర్లక్ష్యముతో) ఆప్తుఁడా! భారతీయాన్వయులకిది సహజధర్మమేకదా.

ధీరసింహ—(సహర్షముగా) నిజము. నిజము. సఖా! నీవు చెప్పినది ముమ్మాటికిని నిజము.

ఉ. కాయముబుద్బుదంబు కద ♦ గౌరవమే కద శాశ్వతంబగుణ్
హేయమశాశ్వతంబనుచు ♦ నిట్టి శరీరసుఖాభిలాషియై
ధీయుతుఁడైన మానవుఁడు ♦ దివ్యతరోజ్జ్వలకీర్తిఁ బాసికే
ల్దోయినిఁ జేర్చి వైరులకు ♦ లోఁబడి వందనమాచరించునే.

మణిసింహ—అవునవును. వెండియు నొక మాటకలదు.

తే. గీ. మానమే ప్రాణమనియెంచు ♦ మానధనికుఁ
డసువులైనను గోల్పోవ ♦ నోర్చుఁగాని
మానహానికి సైచునే? ♦ మాన్యచరిత!
మానధనమున కిఁక నెద్ది ♦ యౌనుసాటి?

ధీరసింహ—(సాభిలాషముగా) చెలికాఁడా! మీరానాఁడు పఠానులతోఁ బోరాడనై గంగాతీరమున కిటనుండి వెడలినదిమొదలుగఁ దిఱుఁగనిప్పుడుమీరు మరల తరలి వచ్చువఱకునుఁ గలవింతలెల్లఁ దెలిసికొనఁ గుతూహలుండనై యుంటిని. కనుకన వ్వెల్ల నోలిఁ జెవులకుఁ జవులూరునటులు సాంతముగా నాకు వినిపింప గోరెదను.

మణిసింహ—మంచిది చెప్పెదను వినుము.

ధీరసింహ—సావధానుఁడనైతిని.

మణిసింహ — మేమిటఁ బురమునుండి వెడలినది మొదలు గంగాతీరము సందరులఁ గనుఁగొనుఁ దనుక నామధ్య ప్రదేశమందేము కనిన ప్రజలదుఃఖము లిట్టిట్టివని చెప్పనలవి కాకున్నవి. అయినను నాయోపినంతవఱకందుఁ గొన్నిటిఁ జెప్పెదను వినుము.

సీ. కుడువఁ గూడునుఁ గట్టఁ ♦ గుడ్డయు లేనట్టి
హీనుల మైతిమం ♦ చేడ్చువారు
నాలుబిడ్డలకుగా ♦ నట్టి సన్యాసుల
మైతిమయ్యయ్యయోయంచు ♦ నడరువారుఁ
గూడు లేకున్నఁ బో ♦ కొంపలలో నుండ
మన్న నయ్యవికట ♦ యనెడివారుఁ
గుడులుఁ గానరియట్టి ♦ కసుఁ బెద్దలముమున్నుఁ
గూలఁదన్నిరఁ టంచు ♦ గుందువారు

తే. గీ. వారువీరని లెక్కించి ♦ పలుకనేల
నెచ్చటికిఁ బోవన చ్చోట ♦ నెల్లవారు
లాపత్రానులు చేసిన ♦ యాగడములఁ
దలఁచిగొల్లున నేడ్పులు ♦ సలుపువారు.

ధీరసింహ — (విచారముతో) అయ్యోయ్యాపాపము. కేఁబోయి వారి యగచాట్లఁ గన్నాఱఁ గనకున్ననుఁ జెవులాఱవినిన మాత్రముననే నామనంబు దుఃఖాబ్ధి నోలలాడుచున్నయది తరువాత?

మణిసింహ — అటులయ్యాపన్నులార్తధ్వనులు సలుపుచు మాత్రోవ కడ్డము వచ్చి తాముఁ గుడిచినబాములెల్ల నాయూలాగ్రముగ జెప్పుకొనుచుండ నవి యన్నియు నాలించి స్వామియైన గౌతమమహారాజుగారు క్రోధావేశపరవశుఁడై పంచాస్యంబిభరాజముల మీఁదికి దుముకఁబోవు గతి నరులఁదునుమాడనై మమ్మందఱఁ ద్వరఁబెట్టుచు నామడకొక యడుగుగా నతిరయంబున నాగంగాతీరంబున కొక్కపూటలోఁ జేరి కొనియెను.

ధీరసింహ — (ఆత్రముతో) తరువాతఁ దరువాత?

మణిసింహ — అంతనరిబలములు మారాకనెఱిఁగి తోకఁద్రొక్కిన త్రాచులవడువున హుమ్మని యొక్కుమ్మడిఁ జెలరేగి రాజపుత్త్రసైనికులఁ జెనకఁదలఁపడిరి. కాని శలభసమూహము కార్చిచ్చుపైఁబడి భస్మమగునటులు నామమాత్త్రావశిష్టములై స్వరూపనాశనమొందినవి.

ధీరసింహ — (సంతోషముతో) మేలు — మిత్త్రమా — మేలు కోరఁదగిన శుభవార్తఁ దెలిపితివి. అందినజుత్తునందుకున్నఁ గాలుఁబట్టునా? పశానుహీనులటుల చావవలసినదే. తరువాత నేమిజరిగినది?

మణిసింహ —

చ. అరులనుగెల్చిదిగ్విజయ ♦ మందియునుంమరుహర్షచిత్తుఁడై
కరమనురక్తసైన్యముల ♦ గాంచిపురంబునకేగి మంత్రిశే
ఖరునకుమజ్జయోక్తులను ♦ గారవమొప్పఁగఁబల్కి వీరలం
దరయుఁడిశోభనంబులని ♦ యంపెనుమమ్ములనిండ్లకంతటన్.

ధీరసింహ — తత్తఱపాటుతో అదేమి ప్రభువుగారుమాత్త్రమందేలయున్నారు?

మణిసింహ — ఆరావళీగిరిప్రాంతములందు పరాసులతోఁ బోరుచున్న యోధపురీశ్వరుఁడైన యభయచందుమహారాజుగారిదర్శింపనై యాగంగాతీరమునుండి యటకు స్వల్పపరిచారకసమేతుఁడై యటవిమార్గమునఁ జనియెను.

(అంతఁ దెఱలో)

శా. జీమూతుండనువడ్డి వర్తకుఁడునున్ ♦ జీవాళికిప్పిచ్చివా
రామూలంబుగ నాఋణంబులను వే ♦ నర్పింపమిన్ సూర్యుఁడన్
భీమాంశూజ్జ్వలుఁడై వెలుంగుభటునిన్ ♦ వేఁబంపభీభత్సుఁడై
యామార్తాండదెయప్పులంగొనుచును♦న్నాఁడోయనన్ దోఁచెడిన్

మణిసింహ — (ఆత్రముతో) మిత్త్రమా తడవైనది. నేఁబోయి వచ్చెదను. శెలవొసంగుము.

ధీరసింహ — మంచిది. నేనుఁ బోయి వచ్చెదను.

(ఇరువురును వెళ్లుచున్నారు.)

ఇది విష్కంభము.

# రాజపుత్ర విజయము.

## పంచమాంకము.

### ద్వితీయరంగము—ఆరావలీగిరిప్రదేశము.

[అభయచందు నొకతరుణవయస్కుఁడగుపురుషుఁడు బ్రవేశించుచున్నారు.]

అభయ—(సంభ్రమముతో) మిత్త్రమా! నీవాసమయమున కటకుఁ గాకున్న నేను నిక్కముగ నాపరానుల చేతులలోఁబడి మడియవలసినవాఁడనే యగుదునుసుమా!

పురుష—ఆర్యా! నన్ను మీరీస్వల్పకార్యమునకై యింతగనుతి సేయఁజనదు. వెండియును మీరొనర్చిన మహోపకారములలో నిదియేపాటిది? అదియుఁగాక యుపకారికుపకార మొనరించుటయనది ప్రతిప్రాణికిని సహజధర్మముకదా! కనుక నట్టిలాభమును మనకొసంగిన పరమదయామయుఁడైన యప్పరమేశ్వరుని మనమిరువురముఁ బ్రార్థింపవలయును.

అభయ—(చిరునగవుతో) ఓయీ! పరహితకార్యరచనాధురంధర!

చ. మునిమునిసవ్వవెన్నెలలు ♦ ముద్దుమొగంబను నిండుజాబిలిన్
వెసనుదయించి చూపులకు ♦ వింతసుఖంబిడుచుండువేళ వా
క్యసుధనొసంగినాకమర ♦ గౌరవమబ్బఁగఁజేసెఁ గానను
హాసితముఖాబ్జదర్శన మ ♦ హార్నిశలందును మాననేర్తునే?

పురుష—(చిరునగవుతో)మిమ్ము నేఁ గోరఁదగిన వరరాజంబిదియేకదా!

అభయ—మిత్త్రమా! ఇదినీకునరము కాదు. నాకు విధాయకకృత్యము.

పురుష—అవునవును. ఆడవారందెల్లరు నిటులేయందురు.

తే. గీ. ఎదుటఁగనుపించు వేళలం ♦ దెన్నరాని
ప్రేమనెఱపుచు సవలకు ♦ వెళ్లినప్పు
డట్టిప్రేమను మఱతురె ♦ య్యవనిఁబతులు
కాననమ్మంగవచ్చునే ♦ మీ నుడులను?

అభయ—మిత్రమా! నీవటులుతలంపఁజనదు. నే నట్టివాఁడఁగాను. నాకు మిత్రకోటియే యేడుగడయని యెంచుము.

పురుష—(వేడుకతో) అవును. మీరట్టివారలే యగుదురు. అయినను—

తే. గీ. ధరనునూతనవస్తువు • నరసినపుడు
ప్రాతవస్తువుపై నెందు • రోతకలుగు
నటులు కావున ననుమించి • నట్టివారి
నెఱిఁగినప్పుడు నన్నీరు • మఱతురేమొ ?

అభయ—మిత్రమా! నామాటలను నెఱనమ్ముము. నిన్ను నే నెన్నఁటికిని మఱువఁజాలను.

పురుష—(సహాస్యముగా) అయిన నీ హేమలతాకుమారిని యదృష్టముత్తమోత్తమముకదా!

అభయ—(సాభిలాషముగా) సఖుడా! హేమలత నీకు పినతల్లికూతురనికదా యంటివి. నీవింటకటనుండి వచ్చునపుడా సుందరీమణిని జూచివచ్చితివా?

పురుష—చూచి, వచ్చుటమాత్రమే కాదు. ఆయమచేఁ బ్రేరేపింపఁబడియేవచ్చితిని.

అభయ—ఎందులకు?

పురుష—ఆజియందున్న తన మనోహరుని క్షేమంబరసివచ్చుటకై.

అభయ—(రిచ్చవడి) ఆమె యవివాహితకదా?

పురుష—అవును.

అభయ—అటులయిన నామె మనోహరుండన నెవఁడు?

పురుష—(పరిహాసముగా) సరి సరి. ఇదియా మీరు ప్రశ్నించినది. ఆమె తన మనంబెవనియందో యొకనియందు లగ్నంబొనరించి వానినే తన మనోహరునిగా నెఱనమ్మి యాతని యభ్యుదయంబునెదఁ గోరికొనుచున్నది. దానఁదప్పేమికలదు?

అభయ—దానికేమిలెమ్ము. కానియాప్తుఁడా! అట్టి ధన్యాత్మునకంకితంబుగా నోచిపుట్టిన వర్ణమాలనోలిఁ గర్ణానందముగా వినిపింపఁగోరెదను.

పురుష—అదియేమో నాకు తెలియదు.

అభయ—నీ వామెనడిగియైనను దెలిసికొనలేదా?

శ్రీరస్తు

# గోపాలశతకము.

ఇది

కవిరాజుశ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి ప్రియపుత్రిక

యగు

విశాలాక్షమ్మచేత

రచియింపఁబడినది.

రాజమహేంద్రవరము.

శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1913.

# పీఠిక.

శ్రీకలావతీపత్రికాధిపతులును కవిరాజబిరుదాంకితులు నగు బ్రహ్మశ్రీ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిగారి యగ్రపుత్రికయగు చి॥ సౌ॥ విశాలాక్షి యనుబాలికామణి రమారమి పదిరెండువర్షముల యీడు గలది. ఈమెకు నెనిమిదవయేట నక్షరస్వీకార మొనర్చుటయే గాని యీమెచదువువిషయమై తండ్రిగారు శ్రద్ధ తీసికొని యుండ లేదు. అట్లయిన నీచిన్నది బడికిఁ బోయి నాలుగవక్లాసువఱకుం జదివినది. ఇంగ్లీషునందుఁ గూడ నించుకపరిశ్రమ చేసినది. ఇట్లుండ నీమె వివాహ మైనపిమ్మట నొకనాఁ డొకవచనగ్రంథమును జదువుచుండఁ గని తండ్రిగారు సంతసించి కుమార్తెకుఁ జదువు చెప్పింపవలయు నని యెంచి నన్నుం బిలిచి సత్కారపూర్వకంబుగఁ జూచి "యీపిల్లకుఁ గవిత్వము వచ్చుటకుం దగినచదువు చెప్పు" డని యొప్పగించిరి. అది మొదలు నాయొద్ద నీమె వినయముతో విద్యాభ్యాస మొనర్చుచు నాల్గునెలలలోఁ గవిత్వము చెప్ప నేర్చి యీగోపాలశతకము మొదలగునవి రచించినది. ఈశతక మందుఁ గొన్నచోట్ల నేను దిద్ది సంస్కరించితిని. ప్రథమప్రయత్నము గావున భాషావిషయమున నీమె కవిత్వమున నక్కడ నక్కడఁ జిన్నచిన్న తప్పులు పడుచుండును. అయిన నీకొలఁదికాలమున నిట్లు కవిత్వము చెప్ప నేర్చినబాలికలను గాని బాలురను గాని మఱి యెవ్వరిని గాని నేను గని విని యుండలేదు. ఈయమ కెట్టిసమస్య లిచ్చినను నెట్టివర్ణనాంశము లిచ్చినను నెట్టిపద్యము లైనను గొన్నినిమిషములలో మనోహరముగాఁ జెప్పఁ గల దని కంఠోక్తిగాఁ జెప్పుచు నీమె కాయురారోగ్యసౌభాగ్యైశ్వర్యంబు లొసంగుఁ గావుత మని శ్రీగోపాలకృష్ణుని బ్రార్థించుచున్నవాఁడ.

విధేయుఁడు,

శ్రీపతి భాస్కరశాస్త్రి.

# విజ్ఞాపనము.

నాకు అక్షరజ్ఞానము వచ్చినదిమొదలుకొని ఎప్పుడును మానాన్న గారియొద్దనే కూర్చుండి వారికి కావలసినపుస్తకములు మొదలైనవి అందిచ్చుచు వారు చేసిననాటకములు మొదలైనవి చదువుచు వారికి వచ్చుపత్రికలు మొదలగునవి చూచుచు నుండుటచేత నాకు కొంచెము తెలుఁగునందు ఇష్టము పుట్టి "నాన్నగారూ! నాకు కవిత్వము చెప్పించండి" అని యడుగగా వారు మ. రా. రా. శ్రీపతి భాస్కరశాస్త్రిగారిని పిలిపించి నాకు తెలుఁగు ప్రారంభింపఁ జేసిరి. నేను బడిలో నాలుగవక్లాసువఱకుం జదివినాను. భాస్కరశాస్త్రిగారివద్ద నే నిప్పుడు చదువుకొనుచున్నాను. నాకు ఆంధ్రనామసంగ్రహము అమరము వేంకయ్యవ్యాకరణము లక్షణము మొదలయినవి వారు చెప్పుచున్నారు. ప్రతిదినమును భాస్కర రామాయణము అర్థముతో చదువుచున్నాను. షూ° కొన్నిపద్యము లల్లుట నాయభ్యాసములలో నొకటిగా నిర్ణయించుకొని అవకాశము గలిగినప్పుడెల్ల ఈశతకమును వ్రాయ మొదలుపెట్టితిని. ఈపద్యముల లోనిమేటరు కొన్నిటికి తప్ప అన్నిటికిని భాస్కరశాస్త్రిగారే యిచ్చినారు. నేను లక్షణములో తప్పుట లేదు గాని వ్యాకరణములో తప్పుచున్నాను. అవి భాస్కరశాస్త్రిగారు దిద్దుచున్నారు. ఇట్లుండగా మానాన్నగారు నాకవిత్వము పరీక్షించి నేవ్రాయుసీశతకము చూచి ముద్రించుటకు నిష్టపడి ఇట్లు ప్రకటింపించినారు. పెద్దలు నాతప్పు లన్నియు మన్నింతురు గాక యని ప్రార్థించుచున్నాను.

ఇట్లు,

విశాలాక్షమ్మ.

# విజ్ఞప్తి.

శ్రీగోపాలశతకము:—ఇది నాప్రథమపుత్త్రిక చి॥ సౌ॥ విశాలాక్షి వ్రాసినది. దీనిని మ॥ రా॥ రా॥ శ్రీపతి భాస్కరశాస్త్రిగారు తప్పులు లేకుండ దిద్ది సంస్కరించినారు. పిల్లలు వ్రాసినయిట్టిపుస్తకములు ప్రకటించుట లోకమున కుపకరించు నని కాదు గాని పిల్లలకుఁ బ్రోత్సాహము గలిగించుటకు మాత్ర మగు నని యీశతకమును ముద్రించుటకు నిర్ణయించి పత్రికాధిపతు లగు మ. రా. రా అయ్యగారి బాపిరాజుగారితో నీవృత్తాంత మెఱింగింపఁగా వారు తమపత్రికలో దీనిం బ్రచురింతు మని వాగ్దానము చేయుటం జేసి యిట్లు ముద్రించి ప్రకటించుట కంగీకరించినాఁడ. ఇందలి తప్పు లెల్ల మన్నించి లేఁకూన యగు నాకూఁతు నాశీర్వదింతురుగాక యని పెద్దలనెల్లఁ బ్రార్థించుచున్నాను.

ఇట్లు,

శ్రీపాద. కృష్ణమూర్తిశాస్త్రి.

శ్రీ

# గోపాలశతకము.

క. శ్రీలక్ష్మీప్రాణేశ్వర । నాళీకభవార్చితాంఘ్రినళిన! కటాక్షా
పాలితసురనాయక! శుభ । మూలా! శ్రీరాణ్మహేంద్రపురగోపాలా.

క. సన్నుతి నీకంకితమిడి । యున్నతిశతకము రచింతు నుర్వీస్థలిలో।
వన్నెకలుగఁజేయుముకృపఁ । బన్నుగ శ్రీరాణ్మహేంద్రవరగోపాలా.

క. తప్పొప్పులెఱుఁగ నీకృప । చొప్పునఁ బెద్దలకటాక్షశుభలబ్ధమతిన్
జొప్పడునానందముతోఁ । జెప్పెదనిది చిత్తగింపు శ్రీగోపాలా.

క. ఇలవాల్మీకివ్యాసా । దుల నాత్మదలంచి మ్రొక్కి తొలుత గురుపదం
బులుమదిఁదలంచి మ్రొక్కితిఁ।బొలుపుగ శ్రీరాణ్మహేంద్రపురగోపాలా.

క. పేదరికంబునబిడ్డల । తోఁదా బాధలు పడంగఁదొల్లికుచేలున్
పేదరిక మడచి వేగమె । శ్రీ దనరఁగఁ బ్రోచితీవె శ్రీగోపాలా.

క. పాలసముద్రమునందు న । లీలగ ఫణిపైని పవ్వళింపుచు జగముల్
పాలించుకన్నతండ్రివి । శ్రీలోలా! రాణ్మహేంద్రశ్రీగోపాలా.

క. ఇలఁబ్రహ్లాదునిబ్రోచితి । వలఘుమతిన్ సింహరూపమచ్చుపడఁగనిన్
దెలియఁగనెవ్వరితరమగుఁ । జెలువుగ శ్రీరాణ్మహేంద్రశ్రీగోపాలా.

క. అలసభలో పాంచాలికి । నలువలనియుంగలేదె వలసినయపుడున్
బిలిచిన వెంటనె బలుకుచు । జెలువుగ నను బ్రోవుమయ్య శ్రీగోపాలా.

క. ఓపికచెడిమునుగుచ ని । నోప్పి పురుషోత్తమయటన్న నోహోయనుచున్
గాపాడవె కరిరాజును । శ్రీపతి నిన్నేఁ దలంతు శ్రీగోపాలా.

క. కాళిందిమడుగులోనను । లీలగఫణిపడగపై లలితగతిన్నృత్యం
బోలియొనరించిప్రోచితి । శ్రీలీలారాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. దేవేంద్రుఁడుఱాల్ కురియఁగ । గోవర్ధనమెత్తితీవుగోపాలకులన్
గోవులఁబ్రోచితికాదే । శ్రీవరశ్రీరాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. ఇలమురనరకాసురులను । వెలయఁగఁజంపితివి కోపవీక్షణములచే
సలలితదేవకిసుతుఁడై । చెలువుగశ్రీరాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. ముందుగఁజదివితివిద్యను ! సాందీపునివద్ద నీవుశాస్త్రములెల్లన్
పొందుగనగ్రజుతోడను । జెందిన శ్రీరాణ్మహేంద్ర. శ్రీగోపాలా.

క. పలుగాకియైనకంసుని। వెలయఁగఁ జంపితివి కోపవీక్షణములచే
సలలిత నందునివరసుత । చెలువుగ ననుఁబ్రోవుమీవు శ్రీగోపాలా.

క. నీవు మణివలన సత్యా । దేవిని బరిణయముఁ బొందితివి జాంబవతీ
దేవిని బరిణయమైతివి । శ్రీవర శ్రీరాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. కొంగయి వచ్చినదనుజుని । దుంగించితి వీవులీలతోఁ గమలాకా
రంగుగ నే నినుఁ దలఁచెద । శృంగారాభరణజాల! శ్రీగోపాలా.

క. నీమలగుదనుజవర్గము । పీచ మడఁచితీవు బాలవేషముతోడన్
బ్రోచితివి జగములెల్లను । శ్రీచిత్తాంభోజలోల! శ్రీగోపాలా.

క. గోవులనుగాచుచుండఁగ। దావృషభమువలెనువచ్చుదనుజుదునిమియున్
గోవులఁ బ్రోచితి కాదే । శ్రీవర! శ్రీరాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. ఇల నుద్ధవునకు జ్ఞానము । కలుగగఁ జేసితివి నీవు కరుణామతివై
వెలయఁగ భక్తులఁ బ్రోచితి । చెలువుగశ్రీరాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. లీలామానుషవిగ్రహ । మై లోకము లేలుచుంటి వహాహా నీవే
యీలోకంబున దైవము । శ్రీలోలా! రాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. పాలసముద్రమునందున । లీలగ ఫణిపైని బవ్వళించెడినిన్నున్ .
నీలాశ్రీభూసతులున్ । దాలిమి సేవించుచుంద్రు తగ గోపాలా.

క. అలయేఁడెద్దులఁ జంపితి । విల నీలను బెండ్లియైతివి గదా నీవే
కలజనులఁ బ్రోచినవాఁడవు । చెలువుగ నను బ్రోవుమయ్య శ్రీగోపాలా

క. నీకరుణ యున్నయెడలను । శ్రీకలుగును లేక యున్న శ్రీపోవచ్చున్
బ్రాకటముగ దయ యుంచుము । శ్రీకరుణారసవిశాల! శ్రీగోపాలా.

క. వాణీకాంతు సృజించియు । నీనరలోకము సృజించితివే గాదే
మానవదైవం బీవే । శ్రీనీలాలోల! బాల! శ్రీగోపాలా.

క. ఇల మురళీనాదామృత । మలగోపికలకు నొసంగి యలరెడుప్రేమం
గలిగించి ప్రోచినాఁడవు । చెలువుగ లీలావతార! శ్రీగోపాలా.

క. ఇల భారం బడచుట కీ । వల లీలాంబరుఁడవైతి వహహా నీవే
సలలితనందకుమారా! చెలువుగ ననుఁ బ్రోవరావె శ్రీగోపాలా.

క. ఆవారిజగర్భుండును । గోవుల దాచుటయు గోపగోవత్సములై
శ్రీవెలయ నొప్పినాఁడవు । శ్రీవర! శ్రీరాణ్మహేంద్ర శ్రీగోపాలా.

క. వామనుఁడవైతి వప్పుడు । ప్రేమాస్పదముగను జెలంగ వెలసితివిబలీ
శ్రీమహితసత్యలీలా! । శ్రీమత్కాంచనసుచేల! శ్రీగోపాలా.

క. నీమంత్రంబు పఠించిన । యామానవకోటి కబ్బు నఖిలార్థములున్
నీమంత్రంబు పఠించని । యామానవకోటి పశువు లగు గోపాలా.

క. నీచరితంబు పఠింపని । నీచులు మూఢులు పశువులె నీరజనాభా
నాచేయుపూజఁ గైకొను । శ్రీచతురవచోవిశాల! శ్రీగోపాలా.

క. నామన మనియెడుపుష్పము । నీమది కర్పించుచుంటి నెమ్మిన్ దానిన్
బ్రేమాస్పదమునఁ గైకొను । శ్రీమత్కాంచనసుచేల! శ్రీగోపాలా.

క. నామంబున నిను ధ్యానము । నేమము తప్పక యొనర్తు నీరజనాభా!
సోమకళాధరమిత్రా! । శ్రీమత్కాంచనసుచేల! శ్రీగోపాలా.

క. హరునకు నీకును భేదము । నిరవిగ నిసుమంత లేదు విశ్వములోనన్
సిరికిని బ్రాణేశ్వరుఁడవు । పరఁగన్ ని న్నే భజింతు వరగోపాలా.

స్టేటుమెంటు.

(1) దావాసంగతులు నిజమైనవిన్ని చెల్లతగినవిన్ని కావు.

(2) దున్నకు పిల్లపుట్టడము అసంభవము. దున్న అనగా మగది. మగవానికి పిల్లలుపుట్టుట అసంభవము. ఒకవేళ పుట్టవచ్చునని కోర్టువారెంచినను ప్రతివాది హారించలేదు. వాదికిన్ని ప్రతివాదికిన్ని వుండుకొన్న విరోధముచేత యీదావా బనాయించబడినది: ప్రతివాది గొప్పస్థితివంతుడు. అతనికి హారించవలసిన అవసరములేదు

(3) ఈదావాలో వాదిపొందతగిన పరిహారము యేమిన్నిలేదు. దావావిచారణలో నిమిత్తము లేకుండా కొట్టివేయవలెను.

(4) కాబట్టి దావాపరిహారించి ఖర్చులు ముదరాయిప్పించగలందులకు వాది ప్రార్థిస్తూవున్నాడు.

సారాంశములు—(1) దున్నకు పిల్లపుట్టుట యసంభవమా?

(2) దున్నపిల్లను ప్రతివాది హారించినాడా దానికిమ్మతు ఎంత?

(3) ఈదావా యీఫారములో రావచ్చునా?

(4) ఏమిపరిహారము యిప్పించవచ్చును?

ఇతర—ఏమయ్యా! సీతారామశర్మగారు! మగవాళ్లకు పిల్లలు పుట్టిస్తారయ్యా? ఇంతయసంభవపు ప్లయింటు వ్రాసినారేమి?

సీతా—అందుకు కోర్టువారే సమర్థులుగాని నేను కాదు. అయోనిసంభవులగు పుత్రులుగలవారికి గాని మూకు ఆవిషయమైన ప్రజ్ఞ కలుగదు.

అదుగోనండి మనుష్యుల పేర్లజోక్యములకు (Personalities) వెళ్లినయెడల బాగా జరుగదు.

సీతా—ఇందులో మనుష్యులపేర్లు (Personalities) ఏమి కలవు? లోకములో సంతానము లేకపోతే పరులు ఆడపిల్లలను మగపిల్ల

లను పెంచుకొని తమపిల్లలవలెనే ఆనందిస్తూవుంటారు. అందుకోసము అన్నాను. కోర్టువారు నన్ను హాస్యముగా నన్న యుక్తికి ప్రతియుక్తి చెప్పినాను. మీకింత కోపమెందుకు?

ఇరక—మీప్లయింటులో దున్నపిల్ల అని వ్రాసినారు దాని కర్థమేమి.

సీతా—దున్నపిల్ల యనగా చిన్నదున్నపోతు (ది యంగ్ బఫెల్లో) అని యర్థముగాని రంగయ్యపంతులుగారు చెప్పినట్లు దున్నయొక్క పిల్ల యని యర్థము కాదు. అది స్వభావవిరుద్ధము.

ఇరక—ఏమండి రంగయ్యగారు! ఆయనచెప్పినది సబబుగా కనప డుతూవున్నది. లోకములో మగవారికి పిల్లలు పుట్టుటయెట్లు? అందుకు మీరేమిచెప్పెదరు.

రంగ—చిత్తము. ఇందుదున్నశబ్దము పుంలింగవాచికాదు. అది ఉభయలింగవాచకము (Common gender) పూర్ణభాషాప్రవీణులగు కోర్టువారికి నేను చెప్పనక్కరలేదు. అయినను ఒకఉదాహరణము జ్ఞప్తికి వచ్చినది. ఇంగ్లీషులో బఫెల్లో అను మాటకు పూర్వము 'హి' అనుమా టవేసిన 'హి బఫెల్లో' అని యగును. దానికి తెనుగులో మగదున్నయని యందురు. 'షి' అనుపదము వేసిన 'షి బఫెల్లో' అని యగును. దీని తెనుగులో దున్నపెయ్య లేక ఆడదున్న యందురు. ఇదిగాక పిల్లయని చివర ఉండుటచేత దున్నపిల్లయనగా దున్నయొక్కపిల్లయే యనవలెను. గాని చిన్నదున్న యనుకొనుటకు వీలులేదు. అయినచో పిల్లదున్నయని వ్రాయవలెను. విశేషణము (adjective) విశేష్యము (Noun) కు పూర్వమువచ్చును గనుక అది పిల్లదున్నయని ప్లయింటులో నున్నయెడల వాదివాదము నమ్మదగును.

నీల—దున్నపిల్లయనగా లేతవయస్సుకలది. దున్నపోతు అనగా ముదిరినవయస్సుకలది. రెండును పురుషవాచకములే. ఆడదానికి గేదె యందురు. అంతియేగాని ఆడదున్న పిల్ల దున్నయనువాడుక లేదు.

రంగ—అయ్యా నీలకంఠముగారు మీకు వకాల్తానామా లేదు. గనుక మీరు జోక్యము కలుగజేసికొనుట (యింటర్‌ఫీర్) కూడదు. పేరులు దేశభేదములను బట్టి మారుచుండును. మనుష్యులలో మహాలక్ష్మి, మాణిక్యము, రత్నం, అమ్మన్న అనుపదములు మగవారికిని ఆడవారికి కూడ వర్తించును. ఆపైన కోర్టువారిచిత్తము.

ఇరక—రంగయ్యపంతులుగారి యుక్తి ప్రశస్తముగా నున్నది. విశేషణము విశేష్యమునకు ముందుండుట సుప్రసిద్ధమే గనుక 1 వ సారాంశమువాదికి వ్యతిరేకము చేయడమైనది. అందువల్ల తక్కినసారాంశముల తో అవసరము లేకపోయినది. గనుక దావాఖర్చులతో తోసివేయుటకుతీర్మానించడమైనది. ప్లీడరుఫీజు పదిరూపాయలు. మరియొక కేజు పిలు.

నాగ—ఇదియును వెనుకటిదానివంటిదే. పార్టీలుకూడ ఒకటే.

ఇరక—సరే పిలువుము.

నాగ—వాది నిశ్చింతబ్రహ్మానందం 1 ప్రతివాది నిర్భాగ్యదామోదరయ్య

బంట్రో—(కేకలువేయుచున్నారు. పార్టీలు ప్లీడరు ప్రవేశించుచున్నారు.)

ఇరక—ఏమయ్యా మీ కేజుస్వభావమేమిటి.

రంగ—వాదివద్ద రు 100 లు కిమ్మతుచేసే గమిడిదున్నపోతు కలదు. దానికి ఒకదూడ పుట్టినది. సదరుదూడయున్ను పోతున్ను నా తాలూకు పొలములో మేస్తూవుండగా ప్రతివాది అక్రమముగా తోలుకొనిపోయినాడు. సదరుదూడను పోతును గాని అందులకిమ్మతు రు 110 లు గాని రాబట్టుకొనుటకు దావా.

నీల—నేను 1 ప్రతివాది తరఫున పనిచేయుచున్నాను. దున్నపోతు మగజాతిలోనిది. అది యీనుట అసంభవము. దూడపుట్టుట అసంభవము. వాదికి దున్నపోతు లేనేలేదు. కాబట్టి దావా అన్యాయమని (ప్రివలస్) యెంచి కొట్టివేయవలసి ఉంటుంది.

ఇరక—ఏమయ్యా దున్నపోతుకు దూడయేమిటయ్యా విరుద్ధముగానున్నది. ధావానిల్వ తగినదికాదు.

రంగ—చిత్రము, ఇందులో ఒకచమత్కారమున్నది. ప్రతికేజు సకు లాపాయింటు ఉండదు. మన అనుభవము చాలదు. లోకానుభవము ఎక్కువ కావలెను. కొన్నిప్రదేశములలో మగజంతువులు ఈనడము. ఆడవి గొడ్డుమోతులుకావడము కలదు. ఆడవి ఎన్నడూ యీనకుండా గొడ్డుపోతులు కావడం మనము చూచుచున్నాము ఆటులనే మగవి యీనడముకూడ సంభవించవచ్చును. చెట్లలో స్త్రీపురుషబీజములు ఏకవస్తువులోనే యిమిడియున్నవి. అందులకే తాడిచెట్టులో నుంచితాడిచెట్టు వచ్చుటయే కాక విజాతిపదార్థములగు రావిచెట్లు, వేపచెట్లు కూడా మొలచుచున్నవి. రాళ్ళలోనుంచి మొక్కలు వచ్చుచున్నవి. పురుగుల లో కంబళీపురుగులు భ్రమరములుగా మారుచున్నవి. పేలు, నల్లులు, పక్షులలో కొన్ని తమకుతామే సంతానవంతములగుచున్నవి. మనుజుల లోకూడ మగవారిలో ఆడరూపువారున్ను, ఆడవారిలో మగరూపుగల వారు బయలుదేరుచున్నారు. మనశాస్త్రములు జూడ మనువు ఇలుడను రాజు వేటకుపోయి స్త్రీగా మారినట్లును, అర్జునుడు స్త్రీపురుషరూపములు రెండును దాల్చినట్లున్ను, నారదుడు బ్రహ్మకు మానసపుత్రుడైనట్లును, వేణుని తొడలోనుంచి ఔర్వుడు పుట్టినట్లున్ను, ఆంజనేయుని చెమటవల్ల మత్స్యవల్లభుడు పుట్టినట్లున్ను, జహ్నుమహామునికి జాహ్నవి పుట్టినట్లును, విష్ణుపాదము లనుంచి గంగ పుట్టినట్లున్ను, పెక్కుయుదాహరణము లుకలవు. అందువలన దున్నపోతునకు దూడపుట్టెననుట యసంభవము

కాము. ఇదిగాక యీజాతివిశ్వామిత్రిస్రుష్టిలోనిది. నేనున్న విశ్వకర్మ యున్న విశ్వామిత్రిస్రుష్టిలో చాలాపని చేసినాము. త్రిశంకునికి స్వర్గము మాసహాయమువలననే విశ్వామిత్రుడు పొందించినాడు. తరువాత యీ కోర్టుకు వచ్చినాను. గనుక అనుభవముచేతను వయస్సుచేతను, మీయంత ధరికన్న నేనధికుడను నాయనుభవములో అనేకదుస్సపోతులు దూడలు పెట్టడము, పాలివ్వడము నాకళ్ళార నేను చూచినాను. ఈసంగతులు బోను లోనికివెళ్ళి చెప్పుమని సెలవైతే తప్పక చెప్పుతాను.

సీల—కేజు యెంతవిపరీతముగానున్నదో అర్గ్యుమెంటు అంతకన్న విరుద్ధముగానున్నది.

ఇరక—రంగయ్యపంతులుగారు విశ్వామిత్రిస్రుష్టిలో పనిచేసిన వారు గనుక ఆయనచెప్పినదే ఎక్కువసబబుగాతోచి దావాప్రకారం డిక్రీ యివ్వడమైనది. మరియొక్క కేజు పిలవయ్యా గుమాస్తాగారు!

రంగ—మాకింతమంది జడ్జీలు వచ్చినారు. కాని తమవలె బుద్ధి సూక్ష్మతగలవారు అరుదు. మీతాతగారు నేను విశ్వామిత్రుని కోర్టులో పనిచేసినప్పుడాయన చమత్కారమే చూచినాను. నాటికి నేడు తమవద్దనే చూచినాను. మరియొకరికి యీప్రజ్ఞ రానేరదు.

నాగ—వాది పిచికల చంద్రయ్య టాంగుటూరి 1 ప్రతివాది గోరింకల తాతిగాడు ప్రొనోటునుబట్టి దావా. ప్లీడరు సీతారామశర్మ గారు. 1 ప్రతివాది ప్లీడరు రంగయ్యపంతులు.

ఇరక—ఎవరయ్యా! వాదిప్లీడరు మీవాదమేమి?

సీతా—వాదిపేర గురయ్య అనే అతను ఒక ప్రామిస్సరినోటు ఆర్డరు వేసియిచ్చినాడు. ఆసొమ్ము ప్రతివాది వాదికి యివ్వలేదు. గనుక సొమ్మునున్ను వడ్డీకిన్ని ఖర్చులకున్ను దావా.

ఇరక—1 ప్రతివాది వాదమేమి?

రంగ—సదరు ఆర్డరుకు ప్రతిఫలము లేదని ప్రతివాది వాదము. ఇది లాపాయింటు కేజు గనుక సాక్ష్యమవసరము లేదు.

సీతా—ప్రానోటుమతలబులోనే ఆర్డర్కు ఇచ్చుటకు ఏర్పాటు కలదు గనుక అట్టివాటికి ప్రతిఫలము అవసరములేనట్లు అక్టులో ప్రానోటు శబ్దనిర్వచనములోనే స్పష్టముగానున్నది.

రంగ—చిత్తము "ప్రయోజనమనుద్దిశ్యనమందోపిప్రవర్తతే" అను న్యాయమునుబట్టి యంతమందుడైనను ప్రయోజనములేక ప్రవర్తింపడుగనుక లాభముపొందకుండా ఆర్డరువేయడం అసంభవము. అట్టి లాభము పొందలేదని వారే చెప్పుచున్నందున ప్రతిఫలములేనట్లు ప్లయింటులోనే ఒప్పదలకనుపించినది. గనుక విచారణఅక్కరలేకనే దావాత్రోసివేయవలసియుంటుంది.

ఇరక—నాబుద్ధికి రంగయ్యపంతులువాదము సారవంతముగా కనుపించుచున్నది. గనుక దావాత్రోసివేసినాను. ఎవరిఖర్చులువారేవహించవలెను మరియొకకేజుపిలువుము.

నాగ—వాది గోపిశెట్టినారాయుడు—ప్రతివాదులు వెర్రివెంకమ్మవగైరాదావా. రిలీపుఆక్టునుబట్టి వాదిస్వాధీనంలోనున్న భూమిలోనుంచి వానిని ప్రతివాదులు అక్రమముగా లేవగొట్టినారు. వాదిరయితు అయియున్నాడు. ప్రతివాదులను తొలగించి భూమిస్వాధీనంచేయించమనివాది దావా. ప్రతివాదులవాదం వాదికికవులిచ్చిన ఆసమీాకే హక్కుభుక్తములు లేవనివాదము.

ఇరక—వాదితరఫుఎవరయ్యా! రెడీగానున్నదా సాక్షులెంతమంది

రంగ—నేను.వాదితరఫున 16 మందిసాక్షులుగలరు. దావాకుపూర్వము ఆరునెలలభుక్తమునుగావించి చెప్పతారు. దస్తావేజులుకూడా ఉన్నవి.

ఇరక—1 ప్రతివాది తరఫుప్లీడరుఎవరు? రెడీగానున్నదా?

నీల.—చిత్తము! ప్రతివాదితరఫున నేను. రెడీగానున్నది. 5 గురు సాక్షులున్నారు. ఋజువుభారము వాదిదై యున్నది.

ఇరక—మేమిప్పుడు 21 మందిసాక్షులను తనిఖీచేయవలెను. రికార్డునుబట్టిచూడగా విచారణ అవసరముకనపడలేదు. ఆఖరుపురుషుడు వాది లెస్సార్కు పెన్మిటి ఆయియున్నాడు. 1 ప్రతివాదికి కొడుకై యున్నాడు. ఆఖరుపురుషుడు పోయినతరువాత దావాభూమి ఆయనభార్యా అయినవాది లెస్సారుకు సంక్రమించినది. ఆమెపోవడంతోనే ఆయేజెస్సీ అంత్యమించినది. ఆమెపోయినవరకు ఆమెస్వాధీనంలోనున్నదని వాదియే ఒప్పుకొంటూవున్నందున వారికి దావాకు పూర్వం భుక్తంలేదని స్థిరపడు చున్నది. గనుక దావానిల్వకూడదని తోచుచున్నది.

రంగ—అలాకాదండి వాది ట్రిస్పాసర్ అయిననుసరే, పొజెసరీ దావాలో పొజెషన్ గురించి సాక్ష్యము అవసరముంటే తమరు ఒకరిద్దరినితనికీచేస్తేచాలును మీకున్యాయము దొరుకుతుంది.

ఇరక—ఇంతమందిసాక్షులను ఎవరువిచారించెదరు? ఇందులో లాపయింటుదొరికింది. ఫాక్ట్సు ఎందుకు? న్యాయమువరుకనుక్కోవడంశక్యముకాదు. ఏలాగునోకాయితము వదలిపోవడంకావలెను. కాబట్టిదావా ఖర్చులతోత్రోసివేసినాను.

రంగ—(నవ్వుచు) తమవంటికుశాగ్రబుద్ధిగలవారిని అరుదుగా చూచెదము. భాష్యం అయ్యంగారు బుద్ధిమంతులని చెప్పుకోవడం గాని మేముయెన్నడూచూడలేదు. వారిజడ్జిమెంటులలోనైనా యీలాంటిపాయింటు ఎన్నడూ కనిపెట్టలేదు. దావాపోతేనేమిగాని క్రొత్తలాపాయింట్లు చాలాతెలిసినవి.

ఇరక—నాకుఎక్కడకువెళ్ళినను యీలాటికీర్తియేవచ్చినది. నేను లా యొక్కసారమును(స్పిరిట్ ఆఫ్ ది లా) చూస్తానుగాని వర్డ్సును బట్టి అర్థము చేయను. హైకోర్టుజడ్జీలుకూడా ఒకయింగ్లీషులాబుక్కులు మా

త్రిమే చదివి అందులో(సర్ము)మాటలను మాత్రము వాగ్వాదనములు చేస్తారు. నేను జెర్మన్, ఫ్రెంచి, ప్రిషియన్, ఇంగ్లీషు లాలయొక్కసారమును (స్పిరిట్) గ్రహించి చదివినవాడను. అందుచేత ఎంతకేసైన క్షణములో సంగ్రహించి ఫైసలుచేయగలను.

నాగ—సివిల్‌పని అయినది. ఇంకను క్రిమినలు కేజులున్నవి.

ఇరక—చాలా ఆలస్యమైనది. ఒకటిరెండు చిన్న కేజులు ఉంచి తక్కినవి పోయిదావేయుము.

నాగ—(చిత్తము) వాయిదావేసినాను. నె 1 రు నె 2 రు కేజులుమాత్రము వుంచినాను.

ఇరక—1 నెంబరు కేజులో పిర్యాదిముద్దాయీలను పిలువుము.

ఇరక—పిర్యాదితరపు ప్లీడరు ఎవరయ్యా!

నీల—నేనండి.

ఇరక—ముద్దాయీలతరపు ఎవరయ్యా!

రంగ—నేనండి.

ఇరక—బంట్రోతు పిర్యాది వాక్మూలము తీసికొనుటకు ప్రమాణము చేయించుము. బంట్రోతూ! గైరుహాజరుఖాన్.

నాగ—వాడు ఎప్పుడూ హాజరుంటాడండి. ఎవరుపిర్యాదీ? ఇట్లాబోను లోనికిరా.

పిర్యాది—చిత్తము.

నాగ—నేనుచెప్పిన మాట మళ్ళాచెప్పు.

ఫిర్యాది—చిత్తము.

నాగ—దేవునియెదట.

ఫిర్యాది—చిత్తమండి యనటేమండీ.

నాగ—దేవునియెదట అను.

ఫిర్యాది—దేవునియెదట అను.

35613

| ఇంగ్లీ | తిథి | వారం | 1912 సం॥ డిశంబరు నెల పరీధావి సం॥ కార్తీకం, మార్గశిరం. |
|---|---|---|---|
| 1 | 7, 8 | ఆ | స 4-49, అష్టమి 54-17, మఖ 19-45, రావి 10-41. |
| 2 | 9 | సో | న 53-34, పుబ్బ 15-43, రావి 4-54. |
| 3 | 10 | మం | ద 48-36, ఉర 12-4, రావి 4-6. |
| 4 | 11 | బు | ఏ 44 20, హ 8-57, రావి 0-28, పశ్చాదస్తం గురు 48-44 ఉషా 2 శు 26-28 |
| 5 | 12 | గు | ద్వా 40-54, చి 6-34, శో 48-2, కా 12-37, దివి 20-16 |
| 6 | 13 | శు | త్రి 38-30, స్వా 5-8, దివి 19-1 |
| 7 | 14 | శ | చతు 37-20, విశా 4-50, దివి 14-57. |
| 8 | 30 | ఆ | ● అమా 37-15, అనూ 5-34, దివి 20-2 |
| 9 | 1 | సో | శు॥ పడ్ 38-33, జ్యే 7-38, విషాభావః |
| 10 | 2 | మం | ద్వి 41-7, మూ 10-55, దివి 6-41, ప్రాగుదయంబు 27-57 |
| 11 | 3 | బు | తృ 44-52, పూషా 15-28, రావి 13-44 |
| 12 | 4 | గు | చ 49-24, ఉషా 20-53, రావి 9-40 |
| 13 | 5 | శు | పం 54-31, శ్రి 27-2, రావి 10-30 |
| 14 | 6 | శ | ష 60-0, ధని 33-32, రావి 25-52 |
| 15 | 7 | ఆ | స 60-11, శత 39-55, రావి 29-56, మూ 1, రవిః 1-27 |
| 16 | 7 | సో | స 5-17, పూభా 45-52, శేషః 1-57 |
| 17 | 8 | మం | అ 9-48, ఉభా 50-59, దివి 11-59 |
| 18 | 9 | బు | న 13-21, రే 54-58, దివి 22-58 |
| 19 | 10 | గు | ద 15-36, అశ్వి 57-57, రావి 19-57 |
| 20 | 11 | శు | ఏ 16 53, భర 59-40, దివి 22-38 (ముక్కోటి) |
| 21 | 12 | శ | ద్వా 16-44, కృ 60-4, దివి 2-52 |
| 22 | 13 | ఆ | త్రి 15-22, రో 59-20, రావి 12-1 |
| 23 | 14 | సో | చతు 14-36, మృ 57-40, దివి 17-44 |
| 24 | 15 | మం | ○ పౌ 9-24, ఆర్ద్రి 55-6, దివి 17-46 |
| 25 | 1 | బు | కృ॥ పడ్ 6-10, పున 51-51, దివి 23-28 |
| 26 | 2, 3 | గు | ద్వి 0-1, తృ 54 36, పుష్య 47-6 దివి 10-16 |
| 27 | 4 | శు | చ 48-20, ఆశ్లే 43-59, దివి 17-27 |
| 28 | 5 | శ | పం 42-39, మఖ 39-51, దివి 1 55, రావి 30-53 |
| 29 | 6 | ఆ | ష 36-58, పుబ్బ 35-32, శేషః 2-8, ధ 3 శు 13-20 |
| 30 | 7 | సో | స 31-31, ఉత్త 32-7, రావి 24 27 |
| 31 | 8 | మం | అ 26-35, హ 28-52, రావి 20-27, మూ 1, ధనుష్కుజః 54-54 |

# గ్యారంటి బంగారు లక్ష్మీపిల్లకాసులు

ఈకాసులయొత్తు, బంగారువన్నె, సైజు, పనితరము, మామూలు ఫ్రెంచి పిల్లకాసులకు మించియుండును. ఈయొత్తు, ఈవన్నెబంగారముగల ఫ్రెంచికాసులు రు 4-4-0 లకు అమ్ముచుండగా మాలక్ష్మీకాసులు రు **3-4-0** లకే కాసుబంగారముచేసి అమ్ముచున్నాము. మీరు బంగారం తెచ్చియిచ్చేయెడల చార్జీపుచ్చుకొని స్వదేశీలక్ష్మీకాసులను యంత్రములసహాయమువలన చేసియిచ్చెదము. నాలుగుపెద్దకాసులు కరగించి 20 లక్ష్మీకాసులు తయారుచేయుటకు 1కి 0-4-0 చొప్పున రు 5-0-0 లు. 20 లక్ష్మీకాసులు పైగా ఎన్నితయారుచేసినప్పటికి 1కి 0-3-0 చొప్పున తయారుచేయుదుము. మావద్దనున్న లక్ష్మీకాసులుసైజున మీరుబిళ్ళలుచేయించి తెచ్చేయెడల 20 లక్ష్మీకాసులులోపువాటికి 1కి 0-3-0 చొ॥నను, 20 లక్ష్మీకాసులుదాటినవాటికి 1కి 0-2-0 చొ॥నను మజూరితీసుకొని బిళ్ళలు కాసులుచేసి యిచ్చెదము. బిళ్ళలుచేయుటకు సైజుకావలసినచో మావద్ద చిక్కును. వలయువారు—

అయ్యగారి బాపిరాజుగారు, ప్రొప్రయిటరు.

శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాల. ఇన్నీసుపేట, రాజమండ్రి.

---

విద్యానిలయముద్రాశాల.

రాజమహేంద్రవరము.

---

ఇందన్నివిధములైన యచ్చుపనులును తప్పులు లేకుండగను నీటుగను, చౌకగను చేయఁబడుచుండును. గ్రంథకర్తలు ప్రూఫు చూచుకొనసక్కఱలేదు.

మునసబుకోర్టులోను తాలూకాకచేరిలోను గూడ నుపయోగింపఁబడు నన్నిరకముల ఫారములు నీటిదరఖాస్తుఫారములు గూడ సరసమగు వెలకు మావద్ద దొరకును. వలయువారు,

మేనేజరు, విద్యానిలయ ముద్రాక్షరశాల,

రాజమహేంద్రవరము. (అని వ్రాయవలయును.)